సాహిల్ గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur,Visakhapatnam, Vijayawada, Hyderabad, , Rajahmundry,Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 127 పేజీలు: 16 వెల: 8.00

సద్దుమణిగిన కర్ణాటక వివాదం

అన్నామలై ఉద్యమానికి భారీగా మద్దతు

11లో

# 50శాతం పచ్చదనం మన లక్ష్యం



శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జీలకు నిర్వహిస్తున్న వర్క్‌షాపులో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి

### ఎన్నికల ప్రచారంలో చెప్పినవన్నీ చేస్తున్నాం

### అన్ని ఎన్నికల్లో 'కూటమి'గానే ముందుకు

### ఈ పర్యాయం ప్రతిచోట గెలవాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణంలో ప్రజలు కీలక భాగస్వామ్యులు కావాలని సిఎం చంద్రబాబు అన్నారు. సైకిల్‌తో ఆరోగ్యం, పర్యావరణ హితంతో పాటు ఇంధన పొదుపుకూడా జరుగుతుందన్నారు. పర్యావరణ దినోత్సవం రోజున ప్రజల్లోకి మంచి సందేశం తీసుకెళ్లామని చెప్పారు. నాయకులుకూడా సైకిల్ తొక్కి, ప్రజలు ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకునేలా చేశారని సిఎం ప్రశంసించారు. శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం క్లస్టర్ ఇన్‌చార్జీలకు నిర్వహిస్తున్న వర్క్‌షాపుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌భవన్‌లో మీడియాతో కొద్దిసేపు ముఖ్యమంత్రి ముచ్చటించారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యమని చంద్రబాబు ప్రకటించారు. ఆ స్ఫూర్తితో పనిచేస్తే రాష్ట్రంలో వాతావరణ సమతుల్యత సాధించవచ్చని అన్నారు. శారీరక శ్రమ ఆరోగ్యానికి మంచిదన్నారు.తాము నిన్న విశాఖలో ఇదే విషయాన్ని పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్పష్టం చేసామన్నారు.సైకిల్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తుందన్నారు. ఇక వర్క్‌షాపులో రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు.

దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బిజెపితో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టిడిపితో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఎపి సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాండ్‌మైండ్‌తో ఆలోచించాలని సిఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని విమర్శించారు. వైసీపీ హయాంలో సిపిఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు.. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం >>2



సిఎం చంద్రబాబుతో రాజ్యసభ అభ్యర్థులు చింతకాయల విజయ్, సానా సతీశ్, భాష్యం రామకృష్ణ

# టిడిపి రాజ్యసభ అభ్యర్థులు వీరే

### భాష్యం రామకృష్ణ, సానా సతీశ్, చింతకాయల విజయ్ ఖరారు, రేపు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల కసరత్తు కొలిక్కి వచ్చింది. భాష్యం రామకృష్ణ, సానా సతీశ్, చింతకాయల విజయ్ పేర్లు ఖరారయ్యాయి. సిఎం రాజ్యసభ అభ్యర్దుల ఎంపిక విషయంలో ఆచితూచి ఎంపిక చేసారు.ఆయా అభ్యర్థులకు అధినేత చంద్రబాబు నుంచి పిలుపువచ్చింది. టిడిపి రాజ్యసభ అభ్యర్థులపై అధికారిక ప్రకటన రాత్రి పొద్దుపోయిన తరువాత వెల్లడించారు, టిడిపి అభ్యర్దులంతా సోమవారం నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.ఇప్పటికే కూటమి భాగస్వామి పక్షం జనసేన అభ్యర్ది లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేసారు.

# 'నైరుతి' వచ్చేసింది

### అనంతపురం, చిత్తూరు జిల్లాలను తాకిన రుతుపవనాలు

### 10వ తేదీకల్లా మిగిలిన ప్రాంతాలకు విస్తరణ

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాలను తాకాయి. ఎపిలోని అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలను రుతుపవనాలు తాకినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఐఎండి సమాచారం, ఆర్టీజిఎస్ అవేర్ పోర్టల్ విశ్లేషణ ప్రకారం శనివారం (జూన్ 6) >>2



# ఆర్టీసీ బస్సులో మంటలు

### జగ్గయ్యపేట నుండి విజయవాడ వెళ్తుండగా దుర్ఘటన

### కిటికీలనుంచి దూకేసిన ప్రయాణికులు

**విజయవాడ, జూన్6, ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వద్ద ఈరోజు ఒక భారీ బస్సు ప్రమాదం త్రుటిలో తప్పింది. జగ్గయ్యపేట నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఎపిఎస్ ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఒక పెద్ద >>2







# బ్రహ్మానాయుడుకు రిమాండ్

### చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** నగర శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు నకిలీ పత్రాలు, తప్పుడు జిఒలు సృష్టించిన కేసులో అరెస్టయిన వైసిపి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడుకు రాజేంద్రనగర్ కోర్టు శనివారం రెండు వారాల రిమాండు విధించింది. అనంతరం ఆయనను నార్సింగి పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. గత నెల 23వ తేదీన వెలుగు చూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నేరగాళ్లు అరెస్టవగా ఆ తరువాత మరో >>2

# మాస్కోలో టీచర్లులేని స్కూలు

### స్కూలు-21ను సందర్శించి ప్రతినిధులతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

### తోటి విద్యార్థులే అధ్యాపకులు, ప్రాజెక్టు ఆధారిత పాఠాలు



శనివారం మాస్కోలో స్కూల్ 21ని సందర్శించి అక్కడి ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:** మాస్కోలో స్బేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న విభిన్నమైన పాఠశాల స్కూల్ 21ను ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలమంత్రి నారా లోకేష్ సందర్శించారు. సాంప్రదాయ విద్యావిధానానికి భిన్నంగా అక్కడ అనుసరిస్తున్న విధానాలను నిర్వాహకులు, విద్యార్థుల ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్కూల్ 21 అనేది రష్యాలో స్బేర్‌బ్యాంక్ ప్రారంభించిన ఉచిత ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విద్యా కార్యక్రమం. ఇక్కడ విద్యార్థుల నుంచి ఎటువంటి ట్యూషన్ ఫీజు వసూలు చేయరు. ఇది ఇంటర్నేషనల్ 42 నెట్‌వర్క్‌లో సభ్యత్వం కలిగి, స్వతంత్రంగా పనిచేస్తుంది, ఫ్రెంచ్ కోడింగ్ స్కూల్ అయిన ఎకోల్ 42 రూపొందించిన వినూత్నమైన "భవిష్యత్ పాఠశాల" విద్యా పద్ధతులను అనుసరిస్తుంది.

**స్కూల్ 21 ప్రధాన ప్రత్యేకతలు..**

**సాంప్రదాయ విద్యావిధానం లేదు**

ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక ఉపన్యాసాలు, సంప్రదాయ గ్రేడ్‌లు ఉండవు. సహచర విద్యార్థుల ద్వారా అభ్యసనం, విద్యార్థులు పూర్తిగా గేమిఫైడ్, ప్రాజెక్ట్‌ఆధారిత సహకార పనుల ద్వారా నేర్చుకుంటారు, ఒకరి కోడ్‌ను మరొకరు మూల్యాంకనం చేసుకుంటారు.

స్బేర్‌బ్యాంక్ ఈ ప్రోగ్రామ్‌కు పూర్తిగా నిధులు సమకూరుస్తుంది, దీనివల్ల ఎంపికైన అభ్యర్థులు ఎటువంటి ఖర్చులేకుండా ఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చదవడానికి అవకాశం కలుగు >>2

## ఎపి పర్యాటకానికి మరో అరుదైన గౌరవం

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి పర్యాటక రంగానికి మరో జాతీయ స్థాయి అరుదైన గౌరవం లభించింది. ఇండియా టుడే నేషనల్ సర్వేలో దేశంలోనే నంబర్1 రూట్‌గా విశాఖ అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం నిలిచింది. ఇండియన్ రూట్స్ ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో విస్టాడోమ్ రైలు అగ్రస్థానంలో ఉంది రాష్ట్రంలో పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవడంతో పాటు కొత్త అవకాశాలు సృష్టించుకోవడం, అభివృద్ధి వైపు అడుగులు వేయడమనే విధానాన్ని అనుసరిస్తోంది.

ఎపికి సహజంగా ఉన్న అనుకూల తల్ని ఆదాయ వనరులుగా మార్చుకోవటంపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే పెట్టుబడుల ఆకర్షణ, నూతన ప్రాంతాలకు ప్రాచుర్యం, మోలిక వసతులపై దృష్టి సారించి అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. దీంతో ఇవి మంచి సత్ఫలితాల నిస్తున్నాయి.ఈ మేరకు జూన్ 15న గోవాలో ప్రతిష్టాత్మక 'ఇండియా టుడే టూరిజం సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవం జరుగనుంది.

## వీఆర్వో ఆత్మహత్య

**కర్నూలు రూరల్, జూన్ 6, ప్రభాతవార్త:** కర్నూల్ మండల పరిధి వెంకయ్ పల్లె ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న. మహమ్మద్ హుస్సేన్ (48) శనివారం తెల్లవారుజామున తన స్వగృహం ముందు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య కాజా మున్నిస, ఒక కూతురు,ఇద్దరు కుమారులు ఉన్నారు. వివరాల్లో కెళితే... గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు ఆత్మహత్యకు పాల్పడినవీఆర్వో గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విపరీతమైన నడుము నొప్పి, మోకాళ్ల నొప్పులతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

**కలకలం రేపిన సూసైడ్ నోట్**

మృతి చెందిన వీఆర్వో రాసిన సూసైడ్ లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా. పైఅధికారులు అయినటువంటి కర్నూల్ రూరల్ అర్బన్ తహసిల్దార్ రవికుమార్, ఎలక్షన్ డ్యూటీ డిప్యూటీ తాసిల్దార్ ధనుంజయ. తనకు పనిఒత్తిడి తగ్గించాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా.. పని ఒత్తిడితగ్గించలేదని అందువల్లనే తను చనిపోతున్నానని.. సూసైడ్‌నోట్‌లో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కర్నూల్ తాలూకా పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



శనివారం కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, ఎమ్మెల్యే ఉగ్ర నర్సింహారెడ్డి తదితరులు

# దేశ చిత్రపటంలో ఎపికి ప్రత్యేక గుర్తింపు

### ఐటి, టెక్నాలజీతో పాటు సీఫుడ్స్ ప్రాసెసింగ్‌లోను రాష్ట్రం టాప్

### కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవలకు మరింత సహకారం

### కనిగిరిలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్

**కనిగిరి, జూన్ 6, ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు దేశ ప్రజలందరికి ఆదర్శప్రాయంగా నిలవాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు. మార్కాపురం జిల్లా కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శనివారం ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన >>2

# ఉపాధి అవకాశాల 'సీమ'

### పెట్టుబడులకు కేంద్రంగా రాయలసీమ అభివృద్ధి

### మౌలిక సదుపాయాలు పుష్కలం

### కాలుష్యరహిత వ్యవసాయంలో సీమ రైతుకు గుర్తింపు: మంత్రి టిజి భరత్



శనివారం కడపలో 'రైజింగ్ రాయలసీమ' సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్

ప్రాంతంగా కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్ స్పష్టం చేశారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాయలసీమ ప్రాంత అభ్యున్నతి, పారిశ్రామిక వికాసం, పెట్టుబడుల ప్రోత్సాహం, నవకల్పనలపై చర్చించేందుకు సమర్థ్ రీసెర్చ్ అండ్ రిసర్జెన్స్ ఆధ్వర్యంలో 'రైజింగ్ రాయలసీమ ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్" సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖమంత్రి టిజి భరత్, ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది >>2

# కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

### కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్,నిరసనలతో దద్దరిల్లిన జంతర్ మంతర్

2లో

07-06pg2fBPGOL.qxd:07-06pg2fBPGOL.qxd 1/1/02 7:15 AM Page 1





శనివారం రాజ్యసభ ఎంపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న లింగమనేని రమేష్

# రాజ్యసభకు లింగమనేని నామినేషన్ దాఖలు

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపి అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు శనివారం అమరావతి అసెంబ్లీ భవనంలో లింగమనేని రమేష్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి అందచేశారు. ఈ నామినేషన్ దాఖలు ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు.

# ఆర్టీసీ బస్సులో మంటలు

>> ప్రాణనష్టం తప్పి, అందరూ సురక్షితంగా బయటపడ్డారు. బస్సు గొల్లపూడి ప్రాంతానికి చేరుకోగానే, ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడు. వెంటనే అలర్ట్ అయిన ఆయన బస్సును రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులను కిందకు దిగిపోవాల్సిందిగా గట్టిగా కేకలు వేశాడు. బస్సు తలుపు వైపు మంటలు వ్యాపించే ప్రమాదం ఉండటంతో తీవ్ర ఆందోళనలో ఉన్న ప్రయాణికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సు కిటికీల గుండా బయటకు దూకేశారు. ఒకరికొకరు సాయం చేసుకుంటూ అందరూ క్షణాల వ్యవధిలో బస్సు నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో చెలరేగిన మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై ఆర్టీసీ, పోలీస్ అధికారులు స్పందిస్తూ... కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. బస్సులో మంటలు చెలరేగడానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏదైనా మెకానికల్ ఫెయిల్యూర్ లేదా షార్ట్ సర్క్యూట్ లాంటి సాంకేతిక సమస్యల వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# 'నైరుతి' వచ్చేసింది

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ రాయలసీమ జిల్లాల్లోని కొన్నిప్రాంతాలు తాకినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రానున్న 23 రోజులు రాష్ట్రంలో మరింత విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో కురిసే మొత్తం వర్షపాతం సాధారణ స్థాయి కంటే కొంత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అయితే, స్థానిక వాతావరణ మార్పుల వల్ల కురిసే వర్షాలు ఈ లోటును కొంత మేరకు భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. కాకపోతే, ఈసారి రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అంటే కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసి, మరికొన్ని రోజుల పాటు వాతావరణం పొడిగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతులు ఈ మార్పులను గమనించి, తదనుగుణంగా తమ పంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నైరుతి పవనాల తరుణం జూన్ నుంచి సెప్టెంబరు వరకు గమనిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని చాలా జిల్లాల్లో ముఖ్యంగా పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కర్నూలు, నంద్యాల, మార్కాపురం, అనంత పురము, వైఎస్ఆర్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు**

శనివారం కృష్ణా జిల్లా పెదపారుపూడి, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 43.9, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 43.4, అనకాపల్లి జిల్లా మాకవరపాలెం, నెల్లూరు జిల్లా గూడూరు, తిరుపతి జిల్లా ఓజిలిలో 43.2, మన్యం జిల్లా నవగాంలో 43.1, బాపట్ల జిల్లా కారంచేడు, విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలసలో 43డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డు అయిందని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఎఐతో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలు గుర్తించేలా మొబైల్ యాప్

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఎఐతో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలు గుర్తించేలా మొబైల్ యాప్ తయారు చేసినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. మొబైల్ ద్వారా శిశువు బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలత నమోదు చేయవచ్చని ఆయన అన్నారు. ఆశా యాప్‌తో 'శిశు మాపన్' యాప్ అనుసంధానం చెయ్యాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఆశాలు, ఎఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఫలితాలు చూసి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు అమలు చెయ్యాలని సూచించారు.

## అహర్నిశల శ్రమకు గుర్తింపు
### రాజ్యసభకు చింతకాయల విజయ్

**విశాఖపట్నం, జూన్ 6, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన ముగ్గురు అభ్యర్థుల్లో చింతకాయల విజయ్‌కు చోటు దక్కడం పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలకు కారణమైంది. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిస్వార్థంగా, అంకితభావంతో పనిచేస్తూ వచ్చిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్‌కు రాజ్యసభ సభ్యత్వం రూపంలో సముచిత గుర్తింపు లభించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయాల్లో పదవుల కోసంకాకుండా పార్టీ బలోపేతం కోసం పనిచేసేనాయకులు అరుదుగాకనిపించే ఈరోజుల్లో, చింతకాయల విజయ్ తన కృషి, విధేయత, క్రమశిక్షణతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ నుంచి సంస్థాగత వ్యవహారాల వరకు నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ విశ్వాసాన్ని సంపాదించారు. ముఖ్యంగా పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలోనూ వెనక్కి తగ్గకుండా, కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ జెండాను భుజాన వేసుకుని పనిచేసిన నాయకుడిగా విజయ్ గుర్తింపు పొందారు. అందుకే రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో ఆయన పేరు చోటు చేసుకోవడం సహజ పరిణామంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 50శాతం పచ్చదనం మన లక్ష్యం

>> నిర్వహించిన డిఎస్సీ 2025పై బురద జల్లారని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలాదుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డిఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని అసహనం వ్యక్తం చేసారు.

**డిఎస్సీపై ఆరోపణలకు ఆధారాలతో సహా కౌంటర్ ఇచ్చాం**

డిఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శృతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టిడిపికి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టిడిపికి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టిడిపి గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేష్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేష్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టిడిపికి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టిడిపి శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు.

# మాస్కోలో టీచర్లులేని స్కూలు

>> తుంది. క్యాంపస్‌లు నిరంతరం పనిచేస్తాయి, దీనివల్ల విద్యార్థులు తమ సొంత అధ్యయన వేగాన్ని, షెడ్యూల్‌లను నిర్వహించుకోవచ్చు. స్కూల్ 21లో ప్రవేశం కోసం ఎంపిక ప్రక్రియ వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. గత విద్యా ప్రతిభ, డిగ్రీలు లేదా ముందస్తు కోడింగ్ పరిజ్ఞానాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోరు. సాధారణ నమోదుకు ముందు దరఖాస్తుదారులు ఆన్‌లైన్ కాగ్నిటివ్ పరీక్షను పూర్తి చేయాలి. దాని తర్వాత, సమస్య పరిష్కార నైపుణ్యాలను, అనుకూలతలను అంచనా వేయడానికి 'పిసిన్' (స్విమ్మింగ్ పూల్) అని పిలువబడే, అనేక వారాల పాటు జరిగే ఒక ఇంటెన్సివ్ ఆన్‌సైట్ ఎంపిక శిబిరంలో పాల్గొనాలి. అక్కడ వారు ఇచ్చిన టాస్క్ లపై ప్రత్యక్షంగా ప్రదర్శించిన తెలివితేటలను బట్టి ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

**స్బేర్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్..**

మాస్కోలోని స్బేర్ సిటీని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. స్బేర్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఆల్బర్ట్ ఎఫిమోవ్ స్బేర్ సిటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఎవ్జెనియ్ చులానోవ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇలియా పుల్నర్ మంత్రి లోకేష్ బృందానికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వ్యాధినిర్ధారణ, ఇతర ఆవిష్కరణలతో కూడిన స్బేర్ బ్యాంక్ ఎటిఎంను పరిశీలించి, పనితీరును అడిగి తెలుసుకున్నారు. తర్వాత స్బేర్ సిటీ ప్రతినిధులు అక్కడి ఆర్‌డి, క్వాంటం టెక్నాలజీ సెంటర్, ఎఐ ఆధారిత సేవలు, డిజిటల్ హెల్త్ కేర్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్, డిజిటల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అత్యంత విశ్వసనీయమైన ఎంటర్‌ప్రైజ్ హార్డ్‌వేర్ అప్‌టైమ్‌ను నిర్ధారించడం, అంతర్గత సాఫ్ట్‌వేర్ ఎకోసిస్టమ్‌లను అమలు చేయడం, స్థానికీకరించిన కార్పొరేట్ టెక్ ఆధునీకరణను ముందుకు నడపడంపై తాము దృష్టిసారించినట్లు వారు తెలిపారు. ఆటోమేటెడ్ మౌలిక సదుపాయాలు, స్మార్ట్ పరికరాల నెట్‌వర్క్‌లు, విస్తృతమైన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ గ్రిడ్‌ల అధికలోడ్ డిమాండ్‌లను నిర్వహించగల వినూత్న విద్యుత్ వ్యవస్థలను అమలు చేయడం తమ లక్ష్యమని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కృతమైన స్బేర్ సిటీ భవిష్యత్ టెక్నాలజీకి వారధిగా నిలుస్తుందని మంత్రి లోకేష్ కొనియాడారు.



శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజలనుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

# బ్రహ్మానాయుడుకు రిమాండ్

>> ఇద్దరు పట్టుబడడం తెలిసిందే.

ఈ కేసులో అసలు నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడు అజ్ఞాతంలో వెళ్లి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేయడం విదితమే. దీని తరువాత ఆయన కోసం సైబరాబాద్ పోలీసులు ఎపిలోని పలుచోట్ల గాలించి చివరకు తమిళనాడు కాంచీపురంలో తలదాచుకున్నచోట శుక్రవారం నాడు అరెస్టు చేశారు. అనంతరం అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారంట్‌పై శనివారం ఉదయం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. అనంతరం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆయనను అధికారులు మూడు గంటలకు పైగా విచారించారు. గండిపేట్ మండలంలోని సర్వే నంబర్ 18లో గల పదెకరాల సర్కారు భూమిని కాజేసేందుకు జరిగిన కుట్రలో బ్రహ్మానాయుడుతో పాటు వున్న ముఖ్యుల గురించి ఆయనను ప్రశ్నించారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో కడపతో పాటు రాయలసీమకు చెందిన కొందరు వైసిపి నాయకుల పాత్ర వుందని అనుమానిస్తున్న పోలీసులు దీనిపైనా బ్రహ్మానాయుడును ప్రశ్నించారు. బ్రహ్మానాయుడును విచారించిన తరువాత నేరుగా ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో ఈ కేసును విచారిస్తున్న నార్సింగి పోలీసులు సాయంత్రం ఐదు గంటల సమయంలో హాజరు పరిచారు. అనంతరం ఈ కేసును విచారించిన న్యాయమూర్తి బ్రహ్మానాయుడుకు రెండు వారాల రిమాండు విధించారు. దీని తరువాత ఆయనను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

కాగా గండిపేట్‌లో సర్కారు భూమి కాజేసేందుకు జరిగిన కుట్రలో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు సూత్రధారిగా పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండు రిపోర్టులో వెల్లడించారు. తనకు తెలిసిన న్యాయవాదులు, రియల్టర్ల సహాయంతో బ్రహ్మానాయుడు తప్పుడు పత్రాలతో పాటు నకిలీ జిఒలు సృష్టించారని, ఇందుకోసం తన అనుచరులకు ఎనిమిది కోట్ల రూపాయలను చెల్లించారని పోలీసులు తెలిపారు. అనంతరం ఐదు వందల కోట్ల రూపాయలకు పైగా విలువచేసే ఈ భూమి తనదంటూ బోర్డులు పాతేందుకు యత్నించి, ఏకంగా మరో వ్యక్తికి అమ్మేందుకు సిద్ధమయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరికొందరు అరెస్టు కావాల్సి వుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం బ్రహ్మానాయుడును కస్టడీకి కోరేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఆయనను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పో లీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని తెలిపింది,

# ఉపాధి అవకాశాల 'సీమ'

>> నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, సమర్థ్ కన్వీనర్ శ్రీధర్ హాజరయ్యారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్‌లు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ప్రాంతంగా అవతరించేందుకు అవసరమైన అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. నీటి భద్రత, ఇంధన భద్రత, ఆర్థిక వనరులు, పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ఆయన చర్చిస్తూ... ప్రతి వ్యక్తికి తన ప్రాంతం పట్ల అభిమానం ఉండాలని, రాయలసీమ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా "రైజింగ్ రాయలసీమ వంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలకు నాయకత్వం వహించే మేధోసంపత్తి, యువశక్తి రాయలసీమకు ఉన్న గొప్ప సంపద అని మంత్రి అన్నారు. కాలుష్యరహిత వ్యవసాయం, నాణ్యమైన ఉద్యాన పంటల ఉత్పత్తిలో రాయలసీమ రైతులు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందారని కొనియాడారు. అలాగే ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక వైభవం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ చారిత్రక, ఆధ్యాత్మిక, సహజ వనరులతో సమృద్ధిగా ఉన్న కడప జిల్లా రాయలసీమ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారే సామర్థ్యం కలిగి ఉందని అన్నారు. కడప జిల్లా చరిత్ర, ఆధ్యాత్మిక వారసత్వం, సహజ వనరులు, వ్యవసాయ సంపదను ప్రస్తావించిన మాధవ్.. దేవుని కడప, పుష్పగిరి పీఠం, గండి, అత్తిరాల, నందలూరు వంటి క్షేత్రాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. అలాగే గండికోట, సిద్ధవటం కోట వంటి చారిత్రక కట్టడాలు జిల్లాకు వైభవాన్ని చాటుతున్నాయని అన్నారు. జిల్లాలో యురేనియం, మంగంపేట బైరైటీస్, సున్నపురాయి, గ్రానైట్ వంటి ఖనిజ సంపద పుష్కలంగా ఉందని, ఇవి పారిశ్రామికాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని చెప్పారు. అరటి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, పసుపు, మిర్చి, వేరుశనగ వంటి పంటల ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమలు, ఫుడ్ పార్కులు, కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో దేవుని కడప, గండికోట, సిద్ధవటం, పుష్పగిరి ప్రాంతాలను కలిపి ప్రత్యేక ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పర్యాటక రంగంలో భారీగా ఉపాధిఅవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి కడప అనుకూల ప్రాంతమని, పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు.

## వారం - వర్జ్యం

**07-06-2026, ఆదివారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం,** రోహిణి కార్తె
సప్తమి రా. 3.23
ధనిష్ఠ ఉ. 7.54
వర్జ్యం : మ. 3.28 -సా. 5.08
దు.సా. 4.49-సా. 5.41
శుభసమయం : ఉ. 7.30-8.00
రాహుకాలం - సా. 4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులకు మీ వంతు సహాయం అందిస్తారు. చిన్న పనికీ పెద్దపనికీ ఒకే విధంగా శ్రమ చేయవలసి ఉంటుంది.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కొత్త ఒప్పందాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం జాగ్రత్త.

**మిథునం:** జీవిత భాగస్వామితో విభేదాలు రాకుండా తగు జాగ్రత్తలు పాటించడం చెప్పదగినది. నూతన విద్యావకాశాలు.

**కర్కాటకం:** ఆరోగ్య సమస్యలు తీరుస్తాయి. అప్రయత్నంగా అవకాశాలు లాభిస్తాయి. స్థిరాస్థి వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి.

**సింహం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. కష్టానికి ఫలితం దక్కుతుంది. విద్యావకాశాలు లాభిస్తాయి.

**కన్య :** సహోదర, సహోదరీ వర్గంతో మాట పట్టింపులు రాకుండా జాగ్రత్తలు పాటించండి. ఋణాలు తీరుస్తారు.

**తుల :** నిష్కారణ వైరాలు పొంచి ఉన్నాయి. జాగ్రత్త వహించండి. ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** పనులలో తొందరపాటు వద్దు. రాజకీయరంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** గతంలో మీకు సహాయం చేసిన వారికి ఇప్పుడు మీకు సహాయం చేయవలసి వస్తుంది. విద్యావకాశాలు పొందుతారు.

**మకరం:** ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ఓర్పు, నేర్పులలో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** వివాదాస్పద అంశాలు, పుకార్లు ప్రాధాన్యతను సంతరించుకొనకుండా జాగ్రత్తలు వహించండి. వ్యాపారంఅభివృద్ధి.

**మీనం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ధర్మేంద్రను తొలగించండి
## కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్
## నిరసనలతో దద్దరిల్లిన జంతర్ మంతర్

**న్యూఢిల్లీ, జూన్ 6:** జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో వెల్లువెత్తిన అక్రమాలు, అవినీతి, లీకేజిలను కట్టడిచేయాలని, నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌రాజీనామాచేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కొత్తగా ఆవిర్భవించిన కాక్రోజ్ జనతాపార్టీ సీజెపికి అనూహ్యమద్దతు లభించింది. దేశ రాజధానిలోని జంతర్ మంతర్‌వద్ద శనివారం జరిగిన ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలనుంచి భారీ ఎత్తున యువత తరలివచ్చారు. నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు కేంద్రానిదే బాధ్యత అని, వెంటనే ఆశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను పదవినుంచి తప్పించాలని డిమాండ్‌చేస్తూ జైభీమ్ అంటూ జంతర్‌మంతర్‌వద్ద నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థులు, యువత డిమాండ్లను పరిష్కరించాల్సిందిపోయి తమ సంస్థ సోషల్‌మీడియా కార్యకలాపాలపై కేంద్రం నిఘా పెట్టడంపై అభిజీత్ దిప్కే మండిపడ్డారు. సోషల్‌మీడియాసాయంతో మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ఱు రాజీనామాచేయాలని డిమాండ్‌చేస్తూ ఉద్యమం నెలరోజుల నుంచి చేస్తున్నామని, చర్యలు తీసుకోడానికి బదులు మా సోషల్‌మీడియా ఖాతాలను హ్యాక్‌చేయడం, మాపోస్టులు డిలీట్‌చేయించడం వంటి వాటిపై శ్రద్ధపెడుతున్నారని ఆరోపించారు.

మా సోషల్‌మీడియా పోస్టులు డిలీట్ చేయగలరేమోకానీ క్షేత్రస్థాయి పోరాటం కట్టడిచేయలేరని కేంద్రాన్ని దిప్కే హెచ్చరించారు. శనివారం జరిగిన తొలిప్రదర్శన విజయవంతం కావడంతో కాక్రోచ్‌జనతాపార్టీ తన తదుపరి పోరాటానికి ప్రణాళిక సిద్ధంచేసింది. జూన్ 23న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తున మరో నిరసన ప్రదర్శన, సభను నిర్వహిస్తామని ప్రకటించింది. ఇదిలా ఉంటే సీజెపి నిరసనకు లడక్ ప్రజాహక్కుల నాయకుడు సోనమ్ వాంగ్‌ఛుక్‌కూడా మద్దతు ప్రకటించారు. మంత్రి ప్రధాన్ తన రాజీనామాచేయనిపక్షంలో తాను కూడా నేరుగా నిరసనలో భాగస్వామినవుతానని అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిలదీయడమే నిరసన ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.

# ఎపికి ప్రత్యేక గుర్తింపు

>> బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. కనిగిరి ప్రజలంతా ఐక్యంగా ముందుకొచ్చి అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అంబేద్కర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యాహక్కులు, రాజ్యాంగ పరిరక్షణకు జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. దేశంలో అనేక రాజకీయ పార్టీలు అంబేద్కర్ పేరును వినియోగిస్తున్నప్పటికీ, ఆయన ఆశయాలను పూర్తి స్థాయిలో ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దళితులకు తగిన న్యాయం జరగలేదని, ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఏ వర్గానికి అన్యాయం జరగకుండా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, దేశ చిత్రపటంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్నిహిత మిత్రుడని గుర్తు చేశారు. ఐటీ, టెక్నాలజీ రంగాలతో పాటు మెగా సీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖల నుంచి అభివృద్ధి కార్యక్రమాలను కనిగిరి ప్రాంతానికి తీసుకురావడంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కేంద్ర మంత్రి ప్రశంసించారు. కనిగిరి ప్రాంతానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కృషి వల్ల కనిగిరి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలం ప్రతి ఒక్కరి నరనరాల్లో ఉండాలని అన్నారు. అంబేద్కర్ విగ్రహాలు సాధారణంగా పట్టణాల శివార్లలో ఉంటాయని, అయితే కనిగిరి పట్టణ నడిబొడ్డున విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో అన్ని వర్గాల ప్రజలు కలిసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

## భూసేకరణచట్టం, 2013లోని సెక్షన్ 93 (1) ప్రకారం
### (ఉపసంహారణ)

2013 భూసేకరణచట్టంలోని సెక్షన్ 93లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ప్రభుత్వం, బుట్టాయిగూడెం మండలం, దొరమామిడి గ్రామంలోని ఆర్.ఎస్.నెం.లోని మొత్తం Ac.7.47సెంట్లు భూమి క్రింద పేర్కొన్న షెడ్యూల్లోని భూములు భూ సమస్యలు ఉన్నవి, కావున ఇందు మూలంగా ఉపసంహరించుకుంటుంది. పోలవరం ఇరిగేషన్ప్రాజెక్ట్క్రింద ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం ద్వారా 2013 నాటి భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకతచట్టం 30 యొక్క సెక్షన్-11(1) క్రింద ప్రాథమిక ప్రకటన నోటిఫికేషన్మొత్తం Ac.72.53సెంట్లు విస్తీర్ణంలో సర్వేనెం.7 మొ..అంటే, పోలవరం ఇరిగేషన్ప్రాజెక్ట్క్రింద వారి నుండి సేకరించిన భూములకు బదులుగా పునరావాసం మరియు పునరావాసం కింది వి.ఆర్.పురం మండలంలోని శబరిరావిగూడెం గ్రామంలోని గిరిజన భూమిని కోల్పోయిన వారికి ప్రజాప్రయోజనం కోసం భూమిని కేటాయించడం కోసం అవసరమైనట్లుగా రెండు దినపత్రికలలో మరియు ఆంధ్రప్రదేశ్రాష్ట్రఅసాధారణ గెజిట్నం. PIP/37/2025, తేది: 17.09.2025లో ప్రచురించబడింది.

**షెడ్యూలు**

| జిల్లా:ఏలూరు | | | మండలం:బుట్టాయిగూడెం | | | గ్రామం : దొరమామిడి | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | PN ప్రకటనలో క్రమ సంఖ్య | సర్వేనెంబరు | భూసేకరణక్రింది విస్తీర్ణం (య.సెంట్లు) | భూమితరగతి | సంబంధితఆసామి పేరు/భూమితో సంబంధం ఉన్న వ్యక్తి పేరు /ఆసక్తి గల వారు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లుకట్టడములు ఇతరముల వివరములు |
| | | | | | | ఉ | ద | తూ | ప | |
| 1 | 5 | 24-1 | 0.54 | మెరక | పాయం గొరయ్య | అటవీ భూమి | 25 | 23 | 75 | ......... |
| 2 | 8 | 275 | 6.60 | మెరక | కాయిత పద్మ రాజ్ గౌడ్ | 270 | 274 | 272 | 276 | టేకు చెట్లు-3 పామాయిల్ చెట్లు-10, బోరు-1 |
| మొత్తం | | | 7.14 | | | | | | | |

వి. అభిషేక్, IAS
స్పెషల్ కలక్టర్ (భూసేకరణ)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు
రాజమహేంద్రవరం

కె. ఆంజనేయులు
భూసేకరణ అధికారి &
ప్రత్యేక ఉప కలక్టరు (భూసే),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు
వి.ఆర్.పురం యూనిట్-II, చింతూరు

## భూసేకరణచట్టం, 2013లోనిసెక్షన్93 (1) ప్రకారం

### (ఉపసంహరణ)

2013 భూసేకరణచట్టంలోనిసెక్షన్93లోనిసబ్-సెక్షన్ (1) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ప్రభుత్వం,బుట్టాయిగూడెం మండలం, గణపవరం గ్రామంలోనిఆర్.ఎస్.నెం.లోనిమొత్తంAc.101.73సెంట్లుభూమి క్రిందపేర్కొన్నషెడ్యూల్లోనిభూములు భూ సమస్యలు మరియు కోర్టు కేసు పెండింగ్ లో ఉన్నవి, కావునఇందుమూలంగాఉపసంహరించుకుంటుంది. పోలవరంఇరిగేషన్ప్రాజెక్ట్కిందప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరంద్వారా2013 నాటిభూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత చట్టం 30 యొక్క సెక్షన్-11(1) క్రింద ప్రాథమిక ప్రకటన నోటిఫికేషన్మొత్తం Ac.218.69సెంట్లు విస్తీర్ణంలో సర్వే నెం.1, 37-1B మొ..అంటే, పోలవరం ఇరిగేషన్ప్రాజెక్ట్కింద వారి నుండి సేకరించిన భూములకు బదులుగా పునరావాసం మరియు పునరావాసం కింది కూనవరం మండలంలోని కుదలిపాడు గ్రామంలోని గిరిజన భూమిని కోల్పోయిన వారికి ప్రజాప్రయోజనం కోసం భూమిని కేటాయించడం కోసం అవసరమైనట్లుగా రెండు దినపత్రికలలో మరియు ఆంధ్రప్రదేశ్రాష్ట్ర అసాధారణ గెజిట్నం. PIP/24/2025, తేది: 26.07.2025లో ప్రచురించబడింది.

### షెడ్యూలు

జిల్లా: ఏలూరు | మండలం: బుట్టాయిగూడెం | గ్రామం : గణపవరం

| క్రమ సంఖ్య | PN ప్రకటన లో క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూసేకరణ క్రింద విస్తీర్ణం (య.సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు/భూమితో సంబంధం ఉన్న వ్యక్తి పేరు /ఆసక్తి గల వారు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరము | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లుకట్టడ ములు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 | 1 | 5.00 | మెరక | గద్దె విజయలక్ష్మి | 2 | RF | RF | 50 | |
| 2 | 2 | 37-1B | 1.65 | మెరక | పుసులూరిమోహన్ రహిత | 36-1C | 38 | 37-1B | 37-1C | |
| 3 | 3 | 37-1C | 0.25 | మెరక | పుసులూరిమోహన్ రహిత | 36-2 | 38 | 37-1C | 37-2 | |
| 4 | 4 | 38-1B | 6.00 | మెరక | గద్దెవిజయ లక్ష్మి | 29 | 42 | 38-1A | 38-2 | |
| 5 | 9 | 50-1 | 1.26 | మెరక | గద్దెనాగ చంద్ర రావు | 50-2 | R F | 12 | 51,53 | |
| 6 | 10 | 51-1 | 5.00 | మెరక | గద్దెమాధవి బి.పి శ్రీనివాస్ చౌదరి | 50-2 | R F | 12 | 51,53 | |
| 7 | 11 | 63-5 | 4.00 | మెరక | పుసులూరిరజిత | 83 | 63-4 | 83 | 65 | |
| 8 | 12 | 66-3 | 1.00 | మెరక | పుసులూరిరజిత | 63-4 | 63-1 | 62 | 64 | |
| 9 | 15 | 115-2A | 0.67 | మెరక | గద్దెమాధవి | 116 | 37 | 115-1A | 114 | |
| 10 | 18 | 190-1 | 5.65 | మెరక | కోనేటికనక దుర్గ | పట్టిశ పాలెం గ్రామం | 199 | 189 | 199 | తాటి -10, వేప-6 |
| 11 | 19 | 198-1 | 10.21 | మెరక | కోనేటికనక దుర్గ | 199 | 197 | 200 | 196 | |
| 12 | 26 | 204 | 2.80 | మెరక | పసుపులేటిధర్మ రాజు | 206 | 203 | 205 | 200 | |
| 13 | 28 | 246 | 2.51 | మెరక | గద్దెశివేణి | 248 | 261 | 255 | 274 | తాటి-10 |
| 14 | 29 | 256-1 | 0.99 | మెరక | పేరంకిబ్రహ్మానందం | 253 | 256-2 | RF | 255 | |
| 15 | 30 | 257-1 | 0.17 | మెరక | గద్దెబుల్లెమయి | 256 | 258 | RF | 257-2B | |
| 16 | 31 | 257-2D | 0.12 | మెరక | గద్దెబుల్లెమయి | 256 | 257-2C | 257-1 | 259 | |
| 17 | 32 | 259 | 3.87 | మెరక | గద్దెబుల్లెమయి | 255 | కాలువ | 257 | 261 | |
| 18 | 54 | 266 | 5.09 | మెరక | నగరనిసత్తి బాబు | [illegible] గ్రామం | 265 | 267 | [illegible] గ్రామం | కొబ్బరి-8 |
| 19 | 60 | 277-9 | 2.90 | మెరక | గద్దెరాజేష్ | 282 | 270 | 277-8 | 279 | |
| 20 | 61 | 278-4 | 0.11 | మెరక | మద్యానపువిష్ణు | 279 | 269 | 277 | 440 | |
| 21 | 62 | 287-3A | 1.00 | మెరక | పల్లంటినాగేశ్వర రావు | 305 | 287-1 | 287-2 | 287-5 | |
| 22 | 63 | 307-1 | 0.65 | మెరక | కార్జులరాములు | 307-3 | 287 | 306 | 307-2 | |
| 23 | 64 | 307-2 | 0.94 | మెరక | కార్జులరాములు | 307-3 | 287 | 307-1 | 431 | |
| 24 | 65 | 313-1 | 1.00 | మెరక | పుట్టవీరభద్రం | 314 | 311 | 314 | 421 | |
| 25 | 70 | 322 | 0.95 | మెరక | పుట్టవీరభద్రం | 355 | 315 | 323 | 321 | |
| 26 | 71 | 323-4 | 1.00 | మెరక | పుట్టవీరభద్రం | 354 | 315 | 320 | 322 | |
| 27 | 72 | 347-1B1 | 0.13 | మెరక | శీలబోయిననాందార మ్మ | 348 | 346 | 212 | 344 | |
| 28 | 73 | 347-2c3 | 4.12 | మెరక | శీలబోయిననాందార మ్మ | 348 | 346 | 212 | 344 | తాటి -10, టేకు-6, కుంకుడు-2, పాల-1,మామిడి-2, వేప-1. |
| 29 | 79 | 355-2D | 1.15 | మెరక | శీలబోయిననాందార మ్మ | 356 | 321 | 357 | 320 | మామిడి -2, టేకు-1, వేప-1, కుంకుడు-1, చిన్న చింత -1. |
| 30 | 80 | 364-1A | 1.50 | మెరక | మద్యానపుహను మంత్ రాధా కృష్ణ | 366 | 372 | పట్టిశపా లెంగ్రా మం | 360 | |
| 31 | 81 | 371 | 3.95 | మెరక | పోల్నాటిదుర్గా రావు | 370 | 378 | 373 | 379 | |
| 32 | 87 | 378-2 | 0.03 | మెరక | మద్యానపువిష్ణు | 379 | 377 | 378-2 | 387 | |
| 33 | 88 | 378-3 | 0.55 | మెరక | మద్యానపువిష్ణు | 379 | 377 | 378-5 | 378-2 | |
| 34 | 89 | 378-4 | 0.11 | మెరక | మద్యానపువిష్ణు | 379 | 377 | 378-2 | 387 | |
| 35 | 92 | 392-1 | 0.60 | మెరక | తుమలపల్లిదుర్గమ్మ | 386 | 393 | 391 | 393 | |
| 36 | 93 | 392-1 | 0.61 | మెరక | దుద్దుగవరమ్మ | 386 | 393 | 391 | 393 | |
| 37 | 94 | 392-1 | 0.30 | మెరక | పమిశెట్టిసత్యనారా యణ | 386 | 393 | 391 | 393 | |
| 38 | 95 | 392-1 | 0.30 | మెరక | పమిశెట్టిసిద్ద రావు | 386 | 393 | 391 | 393 | |
| 39 | 96 | 392-2 | 0.28 | మెరక | తుమ్మలపల్లిదుర్గ మ్మ | 386 | 393 | 391 | 393 | |
| 40 | 97 | 392-2 | 0.28 | మెరక | దుద్దుగవరమ్మ | 386 | 393 | 391 | 393 | |
| 41 | 98 | 392-2 | 0.14 | మెరక | వామిశెట్టిసత్యనారా యణ | 386 | 393 | 391 | 393 | |
| 42 | 99 | 392-2 | 0.14 | మెరక | వామిశెట్టిసిద్ద రావు | 386 | 393 | 391 | 393 | |
| 43 | 100 | 392-3 | 0.97 | మెరక | తుమ్మలపల్లిదుర్గ మ్మ | 386 | 393 | 392-2 | 393 | |
| 44 | 101 | 392-3 | 0.98 | మెరక | దుద్దుగవరమ్మ | 386 | 393 | 392-2 | 393 | |
| 45 | 102 | 392-3 | 0.49 | మెరక | వామిశెట్టిసత్యనారా యణ | 386 | 393 | 392-2 | 393 | |
| 46 | 103 | 392-3 | 0.49 | మెరక | వామిశెట్టిసిద్ద రావు | 386 | 393 | 392-2 | 393 | |
| 47 | 104 | 392-3 | 1.75 | మెరక | పుసులూరిమోహన్ రజిత | 386 | 393 | 391 | 393 | |
| 48 | 105 | 393-1 | 0.05 | మెరక | మద్యానపుహను మంత్ రాధా కృష్ణ | 391 | 395 | 390 | 394 | |
| 49 | 106 | 393-1 | 0.80 | మెరక | రాజనాలపెద్రాజు | 391 | 395 | 390 | 394 | |
| 50 | 107 | 393-2 | 1.00 | మెరక | మద్యానపుహను మంత్ రాధా కృష్ణ | 391 | 395 | 390 | 394 | |
| 51 | 108 | 393-3 | 0.20 | మెరక | మద్యానపుహను మంత్ రాధా కృష్ణ | 391 | 395 | 390 | 394 | |
| 52 | 109 | 406 | 2.00 | మెరక | పోలిశెట్టివిష్ణు వర్ధన్ రావు | 402 | 408 | 403 | 490 | |
| 53 | 127 | 431-1A | 1.62 | మెరక | గంధ్రాలరామచంద్ర శేఖర్ | 308 | 286 | 307 | 429 | |
| 54 | 128 | 431-2 | 0.53 | మెరక | యడ్లపల్లినాగమ్మ | 308 | 286 | 307 | 429 | |
| 55 | 129 | 431-2 | 1.10 | మెరక | యడ్లపల్లికోరయ్య | 308 | 286 | 307 | 429 | |
| 56 | 130 | 462-2 | 0.51 | మెరక | మరిడుసోమరాజు | 426-2 | 448 | 428 | 425 | |
| 57 | 131 | 476-6 | 0.93 | మెరక | సింగులూరిరాములు | 476-7 | 476-5 | 481 | 508 | |
| 58 | 132 | 478-1 | 2.00 | మెరక | చింతలరావునీలమ్మ | 477 | 451 | 479 | 475 | |
| 59 | 134 | 483 | 1.23 | మెరక | దొడ్లసత్యనారాయణ | 484 | 416 | 415 | 487 | |
| 60 | 139 | 49-1 | 5.00 | మెరక | పుసులూరిహిమంత్ కుమార్ | 49-2 | 50 | 2 | 54 | పోక-1, తాటి - 90, వేప -6, చిన్న-1 |
| 61 | 144 | 49-4 | 0.55 | మెరక | పుసులూరిహిమంత్ కుమార్ | 48 | 49-3 | 2 | 55 | |
| 62 | 145 | 510-1C | 0.30 | మెరక | దొడ్లసత్యనారాయణ | 511 | 517 | 508 | 516 | |
| 63 | 17 | 170 | 0.25 | I.పల్లం | నందిన మోహాన రావు | 168 | 171 | 107 | 169 | |
| మొత్తం: | | | 101.73 | | | | | | | |

**వి.అభిషేక్, IAS**
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు
రాజమహేంద్రవరం

**కె.ఆంజనేయులు**
భూసేకరణ అధికారి & ప్రత్యేక ఉప కలెక్టరు (భూసే),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు
వి.ఆర్.పురం యూనిట్-II, చింతూరు

# యుపిక్స్ కేసులో ఆఖరి చార్జిషీటు దాఖలు

## మొత్తం 22మందిపై కేసు నమోదు

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** చలనచిత్రాల్లో యానిమేషన్ పేరుతో విజయవాడ కేంద్రంగా జరిగిన మోసం కేసులో పోలీసులు 22 మంది నిందితులతో ఆఖరి ఛార్జిషీట్ దాఖలు చేసారు. విజయవాడలోని సత్య నారాయణపురంలో 2014లో యుపిక్స్ పేరుతో యాని మేషన్ కంపెనీని కిరణ్ (ఏ1) ఏర్పాటు చేశాడు. హాలీవుడ్ సినిమాలకు గ్రాఫిక్స్ చేస్తున్నామని నమ్మించారు. ఏడా దిలోనే 100 నుంచి 125 శాతం రాబడులు వస్తాయని అందరినీ నమ్మించాడు. సంస్థలో మిట్టపల్లి రాజేంద్ర బాబు, కొత్తూరి వేణుగోపాలరావు, మిట్టపల్లి రాజీవ్ కృష్ణ కలసి ఎక్కువ వడ్డీ ఇస్తామని డిపాజిటర్లకు ఆశచూపిం చారు. ఇలా పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారు. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల చెందిన 350 మంది యుపిక్స్‌లో పెట్టుబడులు పెట్టారు. రూ. లక్ష నుంచి రూ.కోట్ల వరకూ పెట్టారు. పెద్ద మొత్తంలో వచ్చిన సొమ్ము ను పంచుకున్న తర్వాత నిర్వాహకులు చెల్లింపులు చేయ లేక చేతులెత్తేశారు. బాధితులు సగటున రూ. 10 లక్షల నుంచి రూ.10కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు.ఆ మొత్తాలకు యూపిక్స్ గ్రూప్ పేరుతో ఒప్పందాలు కూడా రాసిచ్చాడు. మూడు జిల్లాల పరిధిలో దాదాపు రూ. 450 కోట్ల మేర వసూలు చేశాడు.

మీ సొమ్మును యానిమేషన్, థీమ్ పార్క్ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెడుతున్నట్లు దీని వల్ల మెచ్యూరిటీ నాటికి రెండు, మూడు రెట్లు లాభాలు వస్తాయని ఆశ చూపిం చారు. కొన్ని నెలల పాటు తం ఛనుగా సొమ్మును డిపాజిటర్లకు చెల్లించాడు. ఆతర్వాత నుంచి చెల్లింపులు ఆగిపోయాయి. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రధాన నిందితుడు సాకులు చెప్పి కాలం వెల్ల బుచ్చాడు. చివరకు కార్యాలయానికి తాళాలు వేసి అజ్ఞా తంలోకి వెళ్లాడు. వ్యాపారులు, సామాన్యులు, ఉద్యోగులు పెట్టుబడి పెట్టి మోసపోయిన వారి జాబితాలో ఉన్నారు. ఛార్జిషీట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి దర్యాప్తు అధి.కారి అయిన నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్ ఎంఎస్‌జే కోర్టు లో దాఖలు చేశారు. విజయవాడ నగరంలోని సత్యనారా యణపురం స్టేషన్‌లో బీఎన్ఎస్ 318 (4), 316 (2) సెక్షన్ల కింద శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యా దుల మేరకు కేసులు నమోదు అయ్యాయి.

గత ఏడాది ఏప్రిల్‌లో నమోదైన ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముగించి చివరి ఛార్జిషీట్‌ను ఇన్‌ఛార్జి న్యాయస్థానమైన ఏసీబీ కోర్టులో దాఖలు చేసినట్లు విచారణ బృందం స్పష్టం చేసింది.ఈ కేసులో మొత్తం మొత్తం 22 మందిని నిం దితులుగా చేర్చారు. 92 మందిని సాక్షులుగా చూపారు. అధిక వడ్డీల ఆశ చూపి పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయలు కాజేసిన యుపిక్స్ కుంభకోణం కేసులో తుదిఛార్జ్ షీట్‌ను పోలీసులు దాఖలు చేశారు.





# శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్, ఏపి హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ కుటుంబంతో తిరుమలకు వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గృహనిర్మాణశాఖ గోడౌన్‌లో ఇనుము మాయం

## ప్రొద్దుటూరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**ప్రొద్దుటూరు, జూన్ 6, ప్రభాతవార్త:** ప్రొద్దుటూరు గృహ నిర్మాణ శాఖ గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఐరన్ గల్లంతైన ఘటన కలకలం రేపుతోంది. రాష్ట్ర గృహనిర్మాణ శాఖకు అందిన ఫిర్యాదుల మేరకు విజయవాడకు చెందిన విజి లెన్స్ అధికారులు శనివారం ప్రొద్దుటూరులోని హౌసింగ్ గోడౌన్లను తనిఖీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హ యాంలో జగనన్న ఇళ్ల పథకం కింద ప్రొద్దుటూరు నియో జకవర్గంలో సుమారు 24 వేల మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మం జూరు చేసి, అవసరమైన ఐరన్, సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని సరఫరా చేసింది.

అయితే గోడౌన్లలో నిల్వ ఉంచిన ఐరన్‌లో భారీ మొత్తంలో కొరత ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రహౌసింగ్ శాఖ ఆదేశాల మేరకు విజిలెన్స్ డిఇ చంద్రశేఖర్ రాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం, రాజంపేట ఇఇ మురళీకృష్ణ తనిఖీల్లో పాల్గొన్నారు. గోడౌన్లలోని నిల్వలు,





రికార్డులను పరిశీలించిన అధికా రులు ప్రాథమిక వివరాలను సేకరించారు.

ఈ సం దర్భంగా విజిలెన్స్ డిఇ చంద్రశేఖర్ రాజు మాటా ్లడుతూ గత ఏడాది ఆగస్టులో, సెప్టెంబరులో జిల్లా పీడీ తనిఖీ చేసిన సమయంలో గోడౌన్లలో ఐరన్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన తనిఖీల్లో ఐరన్ కనిపించలేదన్నారు. మొత్తం 270.88 టన్నుల ఐరన్ నిల్వ ఉండాల్సి ఉండగా కేవలం 2.25 టన్నులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని, మిగిలిన 268.63 టన్నుల ఐరన్ గల్లంతైనట్లు వెల్లడించారు. జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం మాట్లాడుతూ మార్కెట్ యార్డు పరిధిలోని రూరల్ హౌసింగ్ గోడౌన్‌లో సుమారు 268 టన్నుల ఐరన్ మాయమైనట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ వ్యవహా రంపై బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా, రూ.1.70 కోట్లకు పైగా విలువైన ఐరన్ మాయమైన ఘటనపై రాష్ట్ర హౌసింగ్ ఎండీ ప్రత్యేక విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ఎస్ఈ కృష్ణయ్య ఆధ్వర్యంలో విచారణ బృందం ఏర్పాటైంది.

# ఉద్యోగుల సంక్షేమ నిధి రాష్ట్రస్థాయి కమిటీని వెంటనే నియమించాలి

## ఎపి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ డిమాండ్

**విజయవాడ, జూన్ 6, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి (ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్)" స్టేట్ లెవెల్ కమిటీని వెంటనే ప్రభుత్వం నియమించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్య నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎం.రమేష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నాటి నుండి అనగా 2014 నుండి నేటి వరకు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సం క్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీని ప్రభుత్వాలు నియ మించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విభజన నాటికి మూ లధనం (కార్పస్ ఫండ్)లో ఏపీకి రావాల్సి న 58శాతం వాటా వచ్చిందో లేదో, ఆ నాటికి మంజూరు చేయబడిన అప్పులు, వాటి చెల్లింపులు, నేటి స్థితి ఆ వివరాలేవీ నాటి నుండి నేటటి వరకు ప్రభుత్వం వెల్లడించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి రూల్స్ 1980 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులతో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీని ప్రతి క్యాలెండర్ సంవత్సరానికి నియమించాల్సి ఉందని, సదరు కమిటీ ద్వారా మాత్రమే ఫండ్ మేనేజ్‌మెంట్ జరగాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా మూ లధనంపై వడ్డీతో పాటు, ప్రభుత్వం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్ మూలధనం ఖాతాకి జమచేయాల్సి



కె.ఆర్.సూర్యనారాయణ

ఉంటుందని పేర్కొన్నారు. మేనేజింగ్ కమిటీ నిబంధనల ప్రకారం ఉద్యోగుల పిల్లలు పెద్ద చదువుల నిమిత్తం, అనా రోగ్య పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయిలో రూ.50 వేలు, జిల్లా స్థా యిలో రూ.5వేలు అర్హతలను బట్టి సదరు రాష్ట్ర కమిటీ ద్వారా మం జూరు కావాల్సి ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర విభజనకు ముందు 2013లో ఏర్పాటు చేసిన కమిటీ తరువాత నేటి వరకు కమిటీ ఏర్పాటు చేయలేదని, సమావేశం నిర్వహించలేదని పేర్కొ న్నారు. సదరు ఫండ్ మేనేజ్‌మెంట్ ఎవరు నిర్వహి స్తున్నారో, ఎలా నిర్వహిస్తున్నారో, అప్పులు ఏమి మం జూరు చేశారో, బాకీలు ఎంత వసూలు చేశారో తదితర విషయాలేవీ బహిర్గతం కాలేదు. ఇది ఉద్యోగుల సొమ్ము. ఏటా ఉద్యోగుల జీతం లోంచి చందాలు వసూలు చేస్తు న్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఏపిఎన్జీవోస్ అసోసియేషన్, ఏపి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపి పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్, ఏపి వెహికల్స్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్, ఏపి స్టేట్ టీచర్స్ యూనియన్ లాంటి కొన్ని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం విశ్రాంత గృహాలు కట్టుకోవడానికి అంటూ ఉద్యోగుల సొమ్ములో నుంచి 6శాతం వడ్డీతో 5ఏళ్ల కాల వ్యవధిలో తిరిగి చెల్లించే షరతు మీద మంజూరు చేసిన మొత్తం సదరు సంఘాలు నేటికీ చెల్లించలేదని, చెల్లించకపోగా, ఉద్యోగుల జీతాల్లో నుంచి మినహాయించుకోమంటూ వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే, ఆ మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉమ్మడి రాష్ట్రంలోని హైకోర్టు చెల్లదని కొట్టివేయడం జరి గిందన్నారు.

సదరు బాకీలను వారికి లోను మంజూరు చేసినప్పుడు చేసిన షరతులతో వారి నుంచే వసూలు చేయాలని తీర్పు ఇచ్చినా, నేటికి వసూలు చేయకపో వడంతో సదరు బాకీలు వడ్డీతో కలుపుకొని ఐదున్నర కోట్ల రూపాయలకు చేరాయని తెలిపారు. ఈ విషయాలన్నీ దాచిపెట్టి ప్రభుత్వం సదరు సంఘాలు, పుష్కరకాలంగా ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ నిధి స్టేట్ లెవెల్ కమిటీ నియమించకుండా, సమావేశం నిర్వహించకుండా మౌనం వహిస్తూ సదరు సంక్షేమ నిధికి చట్టబద్ధమైన హక్కు దారులైన ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా విషయాల్లో ప్రభుత్వం అలసత్వం వహిస్తే ఉద్యోగుల సొమ్ముకు వాటిల్లిన నష్టాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే సదరు అధికారులను బాధ్యులుగా చేస్తూ న్యాయ పోరాటం చేయడానికి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సిద్ధంగా ఉందని హెచ్చ రించారు.

## దేవాన్ష్ ఘాట్‌పై మంత్రి లోకేష్

# తీవ్ర అసహనం

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో 2027లోజరగనున్న గోదావరి పుష్కరాల కోసం ఏర్పాటు చేస్తున్న ఓ ఘాట్‌కు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మనవడు నారా దేవాన్ష్ పేరు పెట్టడం వివాస్పదంగా మారింది. ఈ విషయంపై ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రం అసహనం వ్యక్తం చేసారు. ఇది చాలా హాస్యాస్పదమని వ్యాఖ్యా నిస్తూ, ఆ పేరును వెంటనే తొలగించాలని అధి కారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇలాంటివి తగవని ఆయన స్పష్టం చేశారు. తూర్పుగో దావరి జిల్లా, సీతానగరం మండలం మునికూ డలిలో గోదావరి పుష్కరాల కోసం ఘాట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ఘాట్‌కు దేవాన్ష్ ఘాట్ అని పేరు పెట్టారు.ఈ ఘాట్ వద్ద దేవాన్ష్ పేరుతో ఉన్న బోర్డు ఫొటోలు, వీడి యోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రభుత్వ కార్యక్రమానికి సీఎం కుటుంబ సభ్యుడి పేరు పెట్టడంపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదం మంత్రి నారా లోకేశ్ దృష్టికివెళ్లడంతో ఆయన తక్షణమే స్పందిం చారు.ఏ ఘాట్‌కు కూడా దేవాన్ష్ పేరు పెట్ట కూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం: మంత్రి సవిత

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్. సవిత తెలిపారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు కూడా వస్తున్నాయని అన్నారు. తాడేపల్లిలోని ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో అధిక డిమాండ్ ఉందని, వాటి వల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులులేని సాగును సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు.

**సైకిల్ పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి**

అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలో మీటర్ల దూరంలో ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15



ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధ తులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామ పండను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ నే వినియో గించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డు వద్ద ఉన్న చలివేంద్రం వద్ద ఆగి, మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

**పంజాబ్ నేషనల్ బ్యాంకు**
...విశ్వాసానికి మరో పేరు!

జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004.

**నిద్రాణమైన / నిష్క్రియాత్మక ఖాతాలు మూసివేయుటకు బహిరంగ ప్రకటన**

కొన్ని ఖాతాలలో గత 3 సంవత్సరాలుగా వినియోగదారు ప్రేరేపిత ఆపరేషన్ లేదని మరియు ఈ ఖాతాలలో బ్యాలన్స్ లేదని మా దృష్టికి వచ్చింది. ఈ ఖాతాలు దుర్వినియోగం కాకుండా చూసుకోవడానికి మరియు స్వభావిక నష్టాలను నివారించడానికి, బ్యాంక్ అటువంటి ఖాతాలను మూసివేయాలని నిర్ణయించింది.
అందువల్ల 31-03-2026 నాటికి 3 సంవత్సరాలకు పైగా కస్టమర్ ప్రేరేపిత లావాదేవీలు లేదా ఆపరేషన్ లేని మరియు బాలన్స్ లేని ఖాతాల ఖాతాదారులకు సంబంధిత శాఖలలో తాజా KYC డాక్యుమెంట్లను దాఖలు చేయుట ద్వారా వారి ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేసుకోవాలని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. అలా చేయుటలో విఫలమైతే అటువంటి ఖాతాలు ఒక నెల లేదా ఆ తరువాత ఎటువంటి నోటీసు లేకుండా మూసివేయబడతాయి.
అటువంటి ఖాతాదారులందరూ 15-07-2026న లేదా అలోగా ముందుగా సంబంధిత శాఖలలో KYC డాక్యుమెంట్లను దాఖలు చేయుట ద్వారా అటువంటి ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేసుకోవాలని కోరడమైనది. తద్వారా వారు బ్యాంకుతో నిరంతరాయ బ్యాంకింగ్ సేవలను పొందవచ్చు. యాక్టివేట్ చేసుకోవడంలో విఫలమైతే ఎటువంటి తదుపరి నోటీసులు లేకుండా ఈ ఖాతాలు 16-07-2026న లేదా ఆ తరువాత మూసివేయబడతాయి.
ఏదేని విచారణ/సహాయం అవసరమైతే మీ శాఖను సంప్రదించవలసిందిగా మీరు కోరబడుతున్నారు.
అధీకృత సంతకందారు

7-6pg4.qxd OK:7-6pg4.qxd 1/1/02 7:16 AM Page 1



# ఖరీఫ్‌కు ఎల్‌నినో ముప్పు

ఖరీఫ్ (వానాకాలం సాగు) సీజను ప్రారంభమైంది. అయితే ఈసారి ఖరీఫ్‌పై ఎల్‌నినో ముప్పు పొంచి ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆందోళనవ్యక్తమవుతోంది. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ఖరీఫ్ సీజనుపై రైతులు దృష్టిసారించారు. దేశంలోని మొత్తం వర్షపాతంలో రుతుపవనాల వాటా 80శాతం,ఖరీఫ్‌పంటల విత్తనాలు మొదటి వర్షంపై ఎక్కువగా ఆధార పడి ఉంటాయి. ఈ ఖరీఫ్ సీజనులో వర్షాభావ పరిస్థితులకు ఎక్కువ అవకాశం ఉండటంతో ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రత్యేకించి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, అకస్మికంగా వర్షాలు పడడం, వరదలు, కరవు ఇలా భిన్నవాతావరణ పరిస్థితులు చూడకతప్పేలా లేదు. ఇదే సమయంలో కొందరు శాస్త్రవేత్తల అంచనా ప్రకారం పసిఫిక్ మహాసముద్రం నుంచి భారత భూభాగం సముద్రతీరానికి చేరే సమయానికి ఎల్‌నినో చాలావరకు బలహీనపడుతుంది.ఇండోనేషియా,మలేషియా, ఫిలిప్పైన్స్ వంటి దేశాల్లో ఉన్నంత ప్రభావం భారత్‌లో ఉండకపోవచ్చు అనేది ఒక విశ్లేషణ. అలాగని పూర్తిగా భారత్‌పై ప్రభావం ఉండదు అనుకోడానికీ లేదు. అందుకే కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు పలుసూచనలు చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో రైతులు వరి పంటసాగు తగ్గించుకోవాలన్నది వాళ్ల ముఖ్యసూచన. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి, సేంద్రియ విధానాల్లో అధిక దిగుబడి వచ్చే పప్పు ధాన్యాలు,నూనె గింజలు,చిరుధాన్యాలు పండించాలని సూచిస్తున్నారు.మరోపక్క తగినంత రుణాలను బ్యాంకులు మంజూరుచేయకపోవడం వంటికారణాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత్యంతరం లేక పలువురు రైతులు ముఖ్యంగా కౌలు రైతులు ఆత్మహత్యలను నమ్ముకుంటున్నారు.

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

ఎన్నో కష్టాలు, మరెన్నో నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతలకు ఈ ఖరీఫ్ సీజన్‌లో పెద్ద ముప్పులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఖరీఫ్ మొదలైంది. ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది. అయితే ఈసారి రైతులకు, వ్యవసాయ రంగానికి వాతావరణ శాఖ ఒక పెద్ద హెచ్చరిక జారీ చేసింది. ఈ ఏడాది వర్షాకాలంపై ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందని, సెప్టెంబరు, అక్టోబరు వరకు వర్షాభావ పరిస్థితులు ఎదురుకావచ్చని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని రాబోయే రోజుల్లో తీవ్ర గడ్డు పరిస్థితులు తప్పవని కేంద్రం హెచ్చరించడంతో రాష్ట్రప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఎక్కువ నీరు అవసరమయ్యే వరివంటి పంటల సాగును ప్రోత్సహించకూడదని వ్యవసాయ శాఖ కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రణాళిక, రైతులకు అందే రాయితీలు, పంటల మార్పిడి వ్యూహాలు ఇవన్నీ ఇప్పుడు కీలకం కానున్నాయి. కేంద్ర వ్యవసాయ శాఖ ఇప్పటికే రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర జిల్లా స్థాయిలోనే అత్యవసర సాగు ప్రణాళికలను సిద్ధం చేయాలి. ఇవి కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో అమలు కావాలి. కరవును తట్టుకునేలా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే ప్రత్యేక విత్తనాలను రైతులకు సకాలంలో అందించాలి. రిజర్వాయర్లలోని నీటిని అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వాడుకునేలా చర్యలు చేపట్టాలి. ఈ మేరకు ఆదేశాలు సైతం జారీ చేసింది. వరి సాగుకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బోర్ బావుల కింద, కాలువల కింద వరి వేసే భూములను గుర్తించి, అక్కడ తక్కువ పెట్టుబడి, తక్కువ కాలపరిమితి గల పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను వేయించాలని రాష్ట్రాలకు సూచించింది. ఎల్‌నినో అనేది ప్రకృతి విసిరిన సవాల్. వర్షాలు తక్కువగా ఉన్నప్పుడు సాంప్రదాయకంగా వేసే వరి పంట వైపు వెళ్తే పెట్టుబడి నష్టపోవడమే కాకుండా, నీరందక పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. అందుకే కేంద్రం ముందుచూపుతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును తెరపైకి తెచ్చింది. ఉచిత విత్తనాలు, సబ్సిడీలు, పండించిన పంటను ప్రభుత్వమే కొంటుందనే హామీఉండడం వల్ల రైతులు ఈ ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల వైపు రాష్ట్రాలు అడుగులు వేయడం ఉత్తమం. తెలంగాణలో ఎల్‌నినో ముప్పు తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దీని ప్రభావంతో



నైరుతి రుతుపవనాలకు తీవ్ర ఆటంకం ఏర్పడి, వర్షాభావ పరిస్థితులు, సుదీర్ఘమైన వర్షరహిత రోజులు, ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగే అవకాశం ఉంది. ప్రధాన ఈ ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా చూపనుంది. జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురిసే అవకాశం 80 వరకు ఉందనేది అంచనా. ఫలితంగా వర్షాల లోపం వల్ల భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినా, ఆ తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగి సుదీర్ఘగ్యాప్ ఉండే అవకాశం ఉంది. దీనివల్ల వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. ముందు జాగ్రత్తలు చేపట్టింది. వర్షాలు తగ్గితే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు, తాగునీటి సరఫరా నిర్వహణ, నీటి పొదుపు చర్యలపై అధికారులు ముందస్తు వ్యూహాలు సిద్ధంచేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ అధికారులు వరిపంటకు బదులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను వేయాలని రైతులకు సూచిస్తున్నారు. అలాగే ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాల్వలు, చెరువులు, కుంటలు తదితర చిన్న నీటి వనరుల్లో నీటిని వృథా చేయకుండా, ఆచితూచి వాడుకోవాలనిఅధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా కోటి 34లక్షల 66వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసింది. తగ్గట్టుగా ప్రభుత్వరంగ ఏజెన్సీల ద్వారా 38.21లక్షల క్వింటాళ్ల విత్త నాలు అందుబాటులో ఉంచింది. ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తిని 52లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. నాసిరకం విత్తనాల బెడద అరి కట్టేందుకు ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ బృందాలు సోదాలు,దాడులు విస్తృతం చేస్తున్నాయి. మార్క్‌ఫెడ్, ప్రభుత్వ, ప్రైవేటు కంపె నీల గోదాముల్లో రసాయన ఎరువులు నిల్వలు అందుబాటు లో ఉంచింది.కరవును తట్టుకుని నిలబడే, తక్కువ నీరు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఎక్కువ నీరు వృథా కాకుండా బిందు సేద్యం వైపు మళ్లించాలనీ భావిస్తోంది. పంటమార్పిడిపైనా ఇప్పటికే అధ్యయనాలు మొదలయ్యాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో15జిల్లాల్లో బోర్ల కింద సాగయ్యే 86,000 ఎకరాలను గుర్తించి, అక్కడ వరికి ప్రత్యామ్నాయంగా నూనెగింజలు, మినుము వంటి పంటలను ప్రోత్సహిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 34,000 ఎకరాలు,తూర్పుగోదావరి జిల్లాలో 31,335ఎకరాలను గుర్తించారు.ఇక్కడ మినుము సాగుకు ప్రాధాన్యతను ఇస్తారు. కాలువలకింద నీటిలభ్యత తగ్గనుండడంతో 11 జిల్లాల పరిధిలోని 1.54 లక్షల ఎకరాల్లో పప్పుధాన్యాలు, నూనెగింజల పంట లను సాగు చేయనున్నారు. ఇందుకోసం నంద్యాల జిల్లాలో 54,655 ఎకరాలు, పల్నాడు జిల్లాలో 26,000 ఎకరాలు, ఏలూరు జిల్లాలో 26,600 ఎకరాలను గుర్తించారు. రాష్ట్రంలోని 9 జిల్లాల పరిధిలో సుమారు 15,375ఎకరాల్లో రైతులను పొగాకు సాగు నుంచి లాభ దాయకమైన పప్పుధాన్యాలు, నూనెగింజల సాగువైపు మళ్లించాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వం భారీగా సబ్సిడీలను ప్రకటిస్తోంది.ఇందులో భాగంగా వరికోత ల తర్వాత సాగు చేపట్టడానికి, చేలగట్లపై పండించేందుకు 59,840ఎకరాల్లో విత్తన కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి 100 రాయితీ ఇవ్వనుంది. సుమారు లక్ష ఎకరాలకు కంది, మినుము,శనగ విత్తనాలను 50రాయితీ పై పంపిణీ చేయాలని ప్రణాళికను సిద్ధంచేశారు. పల్స్ మిషన్ ద్వారా రైతులు పండించిన కందులు,మినుములను 100 సేకరిస్తామని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నూనెగింజల కొరతను అధిగమించడానికి,విలువ ఆధారిత క్లస్టర్ల పరిధిలో నూనెగింజలపంటల సాగుకు ప్రణాళిక సిద్ధమైంది. 59,375 ఎకరాల్లో వేరుశనగ, 7,500 ఎకరాల్లో నువ్వులు, 2,500 ఎకరాల్లో సోయాబీన్స్, 2,500ఎకరాల్లో ఆముదం వంటి పంటలకు విత్తనాలను 100శాతం రాయితీపై రైతులకు అందిస్తారు. అంతేకాకుండా, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని సాధించడం ఎలా అనే అంశంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది రుతుపవనాలపై ఆధారపడే ఖరీఫ్ సాగుపై ఈ ఎల్నినో



# దీదీ! ఏదీ దారి!

పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

గోరు చుట్టుపై రోకటి పోటు అంటే ఇదే. నెల రోజుల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కలిగిన ఘోర పరాభవం నుంచి తేరుకునే లోగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ హఠాత్తుగా మరో సంక్షోభంలోకి జారిపోయారు. వరుసగా నాలుగోసారి ముఖ్యమంత్రి కావాలనుకొన్నారు. దేశంలోని ముఖ్యమంత్రులలో సరికొత్త రికార్డు సృష్టించాలనుకొన్నారు. గతంలో రెండుసార్లు ప్రధాని పదవిపై కూడా కన్ను వేసినా, అప్పటి మరో ఇద్దరు సిఎంలు మాయావతి, జయలలిత గట్టి పోటీ ఇవ్వడంతో వెనక్కి తగ్గారు. ఆ తర్వాత రాష్ట్రనాయకత్వంపై మాత్రమే దృష్టి నిలిపి వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రి పదవి అధిష్టించి నాలుగోసారి ఘోరంగా విఫలమయ్యారు. చివరికి అసెంబ్లీలోకి కూడా అడుగు పెట్టలేని దుస్థితి. ఆటలో ఓడిన ప్రత్యర్థిని వేటాడడం తేలిక. అన్నివైపుల నుంచి రెక్కలు కత్తిరిస్తే ఇక ఏ పక్షి అయినా ఎగిరే ప్రయత్నమైనా చేయదు కదా! పార్టీ లోని సీనియర్ నేతలంతా వరుసగా జారుకొనడంతో ఇప్పుడామె దాదాపు ఒంటరిగా నిలబడ్డారనే చెప్పాలి. దాని వెనుక కనిపించే ప్రధాన కారణం అభిషేక్ బెనర్జీ వ్యవహార తీరు. మమత మేనల్లుడుగా ఆయన తృణమూల్ పార్టీలో విశేషమైన పాత్రనే పోషిస్తున్నారు. ఎంత సీనియర్ నేతలైనా ఆయన చెప్పినట్లు వినవలసిందే. మమత రాజకీయ వారసునిగా ప్రచారంలో ఉన్న అభిషేక్ నిరంకుశ వైఖరి వల్లే తృణమూల్ ఇంతటి సంక్షోభాన్ని ఎదర్కొనవలసి వచ్చింద న్నది బహిరంగ రహస్యమే. మమత మేనల్లుడి స్థాయి నుంచి పార్టీ కేంద్ర బిందువుగా మార డమే గాక తన చేతిలో ఆమె కీలుబొమ్మ అనే ప్రచారం కూడా అభిషేక్ ఈమధ్య చేస్తున్నారని వినిపిస్తోంది. 28 సంవత్సరాలుగా తిరుగులేని ఆధిక్యతతో సాగుతున్న తృణమూల్ ఒక్కసారిగా తీవ్రమైన అంతర్గత సంక్షోభంలో కూరుకుపోవ డంతో ప్రత్యర్థులకు మరింత పట్టు చిక్కినట్ట యింది. తాజా ఎన్నికల్లో 80 సీట్లు మాత్రమే రాగా ఆ ఎమ్మెల్యేలలో 58 మంది తిరుగుబాటు పక్షాన నిలిచారు. మరో 20 మంది ఎంపీలు కూడా అదే బాట పట్టినట్లు తెలుస్తోంది. రెబెల్ వర్గం అసెంబ్లీలో తామే అసలైన ప్రతిపక్షంగా గుర్తింపు పొందడం రోకటి పోటు బాధను మరింత పెంచుతోంది. తిరుగుబాటు గ్రూపులో విభేదాలు పొడచూపాయనీ, దానితో పార్టీపై తిరిగి పట్టుసాధించేందుకు మమత ప్రయత్నాలు ముమ్మరం చేశారనీ అంటున్నారు. అయితే ఆమెకు ఇక ఆ అవకాశం లేదనే అంతా భావిస్తున్నారు. అభిషేక్ బెనర్జీ పట్ల పార్టీలో వెల్లువెత్తిన వ్యతిరేకతపై నీళ్ల చిలకరించినట్లుగా ఆయన ప్రాధాన్యత తగ్గించడానికి మమత ఉపక్రమించడం తాజా పరిణామం. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అభిషేక్ ప్రాధాన్యత తగ్గించడానికి మమత మరో ఇద్దరు ఎంపీలను జాయింట్ నేషనల్ సెక్రటరీలుగా నియమించడం సంక్షోభాన్ని కొత్త మలుపు తిప్పుతోంది. ఆ ఇద్దరిలో ఒకరిని తమ వైపు తిప్పుకొనడానికి రెబెల్ వర్గం ప్రయత్నిస్తు న్నదనే ప్రచారం కూడా జరుగుతోంది.మమతకు కీలక మద్దతుదారులైన కొందరు నేతలు కూడా క్రమంగా జారుకోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పదిరోజుల క్రితం తృణమూల్ శాసన సభాపక్ష నేతగా శోభన్ దేబ్ ఛటోపాధ్యాయను నియమిస్తున్నట్లుగా మమత చేసిన ప్రకటనతో ఒక్కసారిగా సంక్షోభం తొంగి చూసింది. ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలు ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం, తర్వాత వారిద్దరినీ మమత సస్పెండ్ చేయడం తో సంక్షోభం మరి కాస్త ముదిరింది. తర్వాత రెండు రోజుల్లోనే అసమ్మతి వర్గం సంఖ్య ఊహించనంతగా పెరిగింది. గత రెండు వారా లలో కనీసం 100 మంది కౌన్సిలర్లు కూడా రాజీనామా చేయడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. తృణమూల్‌లో ఈ హఠాత్పరిణామాలేమిటి? అంటూ అందరు ముక్కున వేలు వేసుకొంటున్నారు. గతంలో మహారాష్ట్ర లోని శివ సేనలో షిండే, ఎన్సీపీలో అజిత్ పవార్ ఇటు వంటి ప్రయోగాలే చేశారు. ఇది మరో ప్రయోగం. లోక్‌సభలో బిజెపి, కాంగ్రెస్ తర్వాత పెద్ద పార్టీ తృణమూల్ కాంగ్రెస్ కావడంవల్ల తాజా పరిణామాలతో రాజకీయ సమీకరణాలు మార వచ్చని కూడా భావిస్తున్నారు. మమతా బెనర్జీ గతవారం పార్టీ ముఖ్య నేతలతో రెండు సార్లు సమావేశాలు జరపగా ఒకసారి 8 మంది, రెండోసారి నలుగురు మాత్రమే హాజరు కావడాన్ని బట్టి పార్టీ పరిస్థితి ఎంత క్షీణించిందో అర్థమవుతోంది. ఇంతకాలం ముస్లిం ఓట్లపై ఎక్కువగా ఆధారపడిన మమత ఇప్పుడు ఆ మద్దతును కూడా పోగొట్టుకొంటోంది. ముర్షిదా బాద్ జిల్లాలో తృణమూల్ తరఫున గెలిచిన 8 మంది మైనారిటీ ఎమ్మెల్యేలు ఇప్పుడు తిరుగు బాటు వర్గంలోనే కనిపిస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత అయిన జావేద్ ఖాన్ కూడా గత శుక్రవారం మమత సమావేశానికిగాక రితబ్రత సమావేశానికి హాజరు కావడాన్ని బట్టి మరికొందరు నేతల దారి కూడా మారవచ్చుని తెలుస్తోంది. తృణమూల్‌లోని 80మంది ఎమ్మెల్యేలలో 34 మంది ముస్లింలే. ఇప్పుడు వారిలో 24మంది తిరుగుబాటు వర్గం లోనే ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామాన్నిటిని చూస్తుంటే తృణమూల్‌లో చివరికి మమత, అభిషేక్ మాత్రమే మిగలవచ్చునే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మూడున్నర దశాబ్దాల లెఫ్ట్ కంచు కోటలు పగులగొట్టిన మమత తన కోటను రక్షించుకోలేని పరిస్థితికి వచ్చారంటే అంతకంటే విచారకరం ఏముంటుంది! ఈ బెడద నుంచి బయటపడడానికి మమత ఏదైనా పటిష్టమైన వ్యూహం రూపొందిస్తారో, లేక నిశ్శబ్దం గా



మమతా బెనర్జీ

# ఆంక్షల చట్రంలో క్యూబా!

క్యూబా

**గన్ని మోహన్**

మొన్న వెనిజులా, ఇప్పటికీ ఇరాన్ కథ ముగుస్తుందను కుంటే మళ్లీ లాటిన్ అమెరికా దేశం కరీబియన్ ద్వీపకల్పం క్యూబాపై అమెరికా కన్నుపడింది. ఈద్వీపాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకుంటామని చెపుతూ వస్తున్న అమెరికా విస్తరణ కాంక్షకు అసలు కారణం ఏమిటి? ఎందుకు క్యూబాపై పగబట్టిందనేందుకు 30ఏళ్లనాటి సంఘటనను తెరపైకి తెచ్చి అప్పటికి అధ్యక్షుడు, రక్షణమంత్రి సైనిక అధికారులపై కేసులు నమోదు చేయడం వంటివేనని చెప్పాలి. వెనిజులా అధ్యక్షుని తరహాలోనే నిర్బంధించి తీసుకురావాలని భావించినా ఇతర దేశాలనుంచి ఎదురయ్యే తిరుగుబాటును చూసే ట్రంప్ వెనకడుగు వేసారు.30ఏళ్ల క్రితం అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో రెండు విమానాలను కూల్చివేయడం అందులో అమెరికన్ పౌరులు మరణించడమే ఈ ఆగ్రహానికి కారణమని తెలుస్తోంది. అమెరికాలోని మయామి క్యూబా ప్రవాసుల సమూహానికి చెందిన ఈ రెండు చిన్న విమానాలు క్యూబా ఫైటర్ జెట్స్ కూల్చివేసాయి. అప్పట్లో అధ్యక్షుడుగా ఉన్న ఫిడెల్ క్యాస్ట్రో రక్షణ మంత్రిగా ఉన్న రౌల్ క్యాస్ట్రోలపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అమెరికా కూడా అన్నిరకాల ఆంక్షలను అమలు చేసింది. ఇప్పటికీ అదేరీతిలో ఆంక్షలు అమలు చేస్తున్న ట్రంప్ సర్కారు క్యూబాకు వెనిజులా నుంచి వచ్చే ఇంధన సరఫరాను నిలిపివేసింది. ఆహార సంక్షోభం ఎదుర్కొంటున్నది. దీనితో ప్రస్తుత క్యూబా ప్రభుత్వంపై ప్రజల నుంచే నిరసన వచ్చేటట్లు చేస్తున్న ట్రంప్ సర్కారు ఎట్టిపరిస్థితుల్లోనూ క్యూబా స్వాధీనంవైపే అన్ని వ్యూహాలను అమలుచేస్తోంది. 2021లోనే క్యూబా అధ్యక్ష బాధ్యతలు, కమ్యూనిస్టు నాయకత్వం నుంచి తప్పుకున్నప్పటికీ అమెరికా వెంటాడుతూనే వస్తోంది. రౌల్ క్యాస్ట్రోపై ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. వెనిజులా మద్దతు కోల్పోయిన తర్వాత క్యూబా తీవ్ర సంక్షోభంలో కూరుకుని పోయింది. ఇంధన, ఆర్థిక, ఆహార సమస్యలు ఎదుర్కొంటున్నదనే చెప్పాలి. ఒకప్పుడుక్యూబాకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచిన సోవియట్ కూలిపోయిన తర్వాత మరింత సంక్షోభం ఎదుర్కొన్నది. ఆ సమయంలోనే ఈ దాడి జరిగింది. నిజానికి 1996 ఫిబ్రవరి 24వ తేదీ మూడు విమానాలు బయలుదేరాయి. వాటిని అనుమానించిన క్యాస్ట్రో సర్కారు వాటిపై దాడిచేయడంతో రెండు విమానాలు కూలిపోయాయి. మూడో విమానం మాత్రం తప్పించుకోగలిగింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి క్యూబా ఈ దాడికి తెగబడిందని అప్పట్లో ప్రపంచ దేశాలు, ఐక్య రాజ్య సమితి సైతం తప్పుపట్టాయి. ఈ దాడికి ఫిడేల్‌క్యాస్ట్రో బాధ్యుడు కాగా ఆనాటి రక్షణ మంత్రి రౌల్‌క్యాస్ట్రో ఈ ప్లాన్ అమలుచేసినట్లు అమెరికా ఇప్పటికీ ఆరోపిస్తూనే ఉంది. అమెరికాతో సంబంధాలు మెరుగుపడకుండా అడ్డుకోడానికే ఫిడేల్‌క్యాస్ట్రో ఈ దాడి చేయించారని అప్పట్లో బలంగా వినిపించింది. అమెరికాతో బంధం బలపడిందంటే క్యూబాలో రాజకీయ ఆర్థిక సంస్కరణలకు దారితీస్తుందని క్యాస్ట్రో అనుమానించారని అందుకే ఈ దాడితో పూర్తిగా సంబంధాలు కూడా తెగిపోయాయని క్యూబాప్రజలు భావించారు. ఈసంఘటనను తీవ్రంగా పరిగణించిన అమెరికా మాత్రం ఆర్థిక ఆంక్షలను కఠినతరం చేయడంతో తమపై అమెరికా దౌత్యపరమైన దాడిచేసిందని క్యూబా ఆరోపించింది. నాటిప్రమాదంలో బాధితులకు పరిహారం చెల్లించేందుకు క్యూబా నిరాకరించడంతో అమెరికాలో స్తంభింప చేసిన క్యూబా ప్రభుత్వానికి చెందిన 93మిలియన్ డాలర్ల ఆస్తుల నుంచి మృతుల కుటుంబాలకు అమెరికా పరిహారం చెల్లించింది. ఈసంఘటన జరిగి 30 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు క్యూబా స్వాధీనానికి అమెరికాకు ఇదొక బ్రహ్మాస్త్రంగా కూడా దొరికినట్లయింది.ద్వీపకల్ప దేశం అయిన క్యూబా జనాభా పరంగా కూడా తక్కువే. 10.5 మిలియన్లకు మించిలేరు. కేవలం పర్యాటకం, గనుల నుంచి లభించే నికెల్ ఇతరవిలువైన ఖనిజాల ఎగుమతుల ద్వారా క్యూబా ఖజానా నింపుకుంటున్నది. కేవలం1.10లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యం మాత్రమే ఉన్న ఈద్వీపం స్వాధీనానికి ప్రధాన కారణం అక్కడ తన రక్షణరంగ స్థావరం ఏర్పాటుచేసుకోవాలని అమెరికా భావించడమే. ఇది చాలదన్నట్లు తాజాగాక్యూబా అధ్యక్షుడుమిగ్యూల్ డియాజ్ కేనల్,ఆయన సతీమణి మరో ముగ్గురు ప్రముఖులపై ఆర్థిక ఆంక్షలు తీవ్రంచేసింది. రౌల్ క్యాస్ట్రో తనయుడు అలెజాండ్రో క్యాస్ట్రో ఎస్పిన్, ఆయన భార్య విల్మా ఎస్పిన్ వీరి తనయుడు రౌల్ అలెజాండ్రో క్యాస్ట్రో కాలిస్‌లనున కూడా ఈఆంక్షల జాబితాలోకి చేర్చింది.అలాగే అమెరికాలో వీరికి ఉన్న ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయాలని కూడా ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీచేసారు.క్యూబాపై చర్యలు తప్పవని, డీల్‌కు రాకుండా స్వాధీనమే ఇక అంటూ ట్రంప్ మరోపక్క చేస్తున్న హెచ్చరికలను ఆదేశ అగ్రనాయకత్వం కూడా సుతరాము లెక్కచేయడం లేదు. దీనితో వెనిజులా తరహా సైనిక చర్య క్యూబాపై అమెరికా ప్రయోగించబోతుందన్నది ఆ దేశ ప్రజలు గ్రహించారు.ప్రజల సంక్షేమాన్ని వదిలిమంకుపట్టు వద్దంటూ మిగ్యూల్ డియాజ్ కేనల్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. అమెరికాకు కావాల్సింది కూడా అదే. ప్రజల నుంచే నిరసన పెల్లుబుకడం ద్వారా కేనల్ ప్రభుత్వాన్ని కూలదోయడం ఆపై తన నియంత్రణలోని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి క్యూబాపై పట్టు ఆధిపత్యం పెంచుకోవాలని అమెరికా చూస్తోంది. ఇందులో భాగంగానే రౌల్‌క్యాస్ట్రో మరికొందరిపై ఛార్జిషీటు దాఖలు చేసి క్రిమినల్ అభియోగాలు నమోదు చేయడమని తెలుస్తోంది. మొత్తంగా చూస్తుంటే ట్రంప్ సమీప భవిష్యత్తులో క్యూబాను కూడా తన దారికి తెచ్చుకుంటారనే భావన అటు క్యూబన్లలోను ఇటుఅమెరికా వ్యతిరేక దేశాల్లో కూడా వ్యక్తం అవుతోంది. సంక్షోభంలో ఉన్న క్యూబా ఇప్పుడు మధ్యేమార్గం అన్వేషించుకోవాల్సిన పరిస్థితులు అలుముకున్నాయని చెప్పకతప్పదు.




రౌల్ క్యాస్ట్రో

# ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో భారత్‌కు తప్పని కష్టాలు

**సుంకవల్లి సత్తిరాజు**

ప్రపంచాన్ని మింగేస్తున్న ఆర్థిక మాంద్యం ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నది. ఇరాన్, అమెరికా యుద్ధం వలన ఏర్పడిన ఇంధన సంక్షోభం వలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైపోతున్నాయి. ఒకరి అహం, ఇంకొకరి ద్వేషం, మరొకరి పగ, ప్రతీకారం యుద్ధానికి సంబంధం లేని ప్రజలకు నరకం చవి చూపిస్తున్నాయి. యుద్ధంలో ఎలాగైనా గెలిచి తీరాలని, లేకపోతే అగ్రరాజ్యమనే హోదాకు భంగం వాటిల్లుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భావిస్తుండగా, ఖమేనీని అంతం చేసిన అమెరికాను ప్రపంచం దృష్టిలో చులకన చేయాలని ఇరాన్ వాంఛిస్తున్నది. అమెరికా ప్రజల్లోను, రిపబ్లికన్ పార్టీలోను ట్రంప్ పట్ల వ్యతిరేకత పెరుగుతుండగా,మరో వైపు మధ్యంతర ఎన్నికల భూతం ట్రంప్‌ను భయపెడుతున్నది. అనవసరంగా యుద్ధాన్ని ప్రారంభించి తప్పు చేసినట్టు ట్రంప్ లోలోపల మధన పడుతున్నా, ఈ విషయం ఒప్పుకోవడానికి ఆయనకు అహం అడ్డువస్తున్నది. ఏదో విధంగా ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, తానే యుద్ధంలో పైచేయి సాధించానని చెప్పుకోవడానికి ట్రంప్ నానా ఇబ్బందులు పడుతున్నాడు. ఇదే సందర్భంలో అమెరికాను ఓడించానని చెప్పుకోవడానికి ఇరాన్ కుతూహలపడుతున్నది. సందట్లో సడేమియా అన్నట్టుగా, ఇజ్రాయిల్, గాజా పైన, లెబనాన్ పైనా తన దాడులను కొనసాగిస్తున్నది. అమెరికా, ఇరాన్ సంఘర్షణలో ఈ విషయం ప్రపంచానికి పెద్దగా తెలియడం లేదు. లెబనాన్ పై ఇజ్రాయిల్ తన దాడులను ఆపాలన్నది ఇరాన్ అమెరికాకు విధిస్తున్న షరతుల్లో ఒకటి. అయితే అమెరికా ఈ విషయానికి పెద్దగా ప్రాధాన్యత నివ్వడం లేదు. ఇరాన్ వద్దనున్న యురేనియం నిల్వలను నిర్వీర్యం చేయాలనే పట్టుదలతో అమెరికా భీష్మించుకు కూర్చున్నది. శాంతియుత ప్రయోజనాలకోసమే యురేనియం శుద్ధి చేస్తున్నామని ఇరాన్ పేర్కొంటున్నా, అణ్వాయుధాల తయారీ కోసమే ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం చేపట్టిందని అమెరికా వాదన. గతంలో కూడా ఇరాక్ పైన, సద్దాం హుస్సేన్ పైన జీవరసాయన ఆయుధాలు తయారు చేస్తున్నరనే నెపంతో, అణ్వస్త్రాల తనిఖీ మిషతో అమెరికా ఇరాక్‌పై ఆరోపణలు చేసి, ఇరాక్‌ను విధ్వంసం చేసింది. సద్దాం హుస్సేన్‌కు ఉరిశిక్ష వేయించి, ఆయనను భౌతికంగా దూరం చేసిన అమెరికా ప్రస్తుతం ఇరాన్ విషయంలోను ఇదే ధోరణితో యుద్ధానికి తలపడింది. ఇరాన్ యురేనియం శుద్ధికార్యక్రమం చేపట్టిందని, ఇది అణ్వాయుధాల తయారీ కోసమేనని ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నది. ఇరాన్ అమెరికాల మధ్య కాల్పుల విరమణ ప్రక్రియ నాటకీయంగామారింది. అమెరికా క్షిపణులు, ఇరాన్ డ్రోన్లదాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. గల్ఫ్‌దేశాలన్నీ భయం గుప్పెట్లో బిక్కుబిక్కు మంటున్నాయి. భారత దేశంతో పాటు అనేక దేశాలు వంట గ్యాస్, పెట్రోల్, డీసెల్ కొరతతో సతమత మవుతున్నాయి. భారత దేశంలో స్వల్ప వ్యవధిలోనే 4 సార్లు పెట్రోల్, డీసెల్ ధరలు పెరిగాయి. రాబోవు రోజుల్లో ఇంధన ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. వంటగ్యాస్‌కు కొరత లేకపోవ డంతో గ్యాస్ కనెక్షన్ లేకపోయినా ఇప్పటివరకు ఎవరూ ఇబ్బంది పడలేదు. అయితే అమెరికా ఇరాన్ మధ్య జరుగు తున్న యుద్ధం కారణంగా భారత్‌లో కూడా ఎల్పీజీ కొరత ఏర్పడింది. వాణిజ్య, గృహ సంబంధిత గ్యాస్ ధరలు ఇప్ప టికే పెరిగాయి. కమర్షియల్ గ్యాస్‌ధరలు భారీగా పెరగడం తో అంతిమంగా సామాన్య వినియోగదారులపై భారీగా భారంపెరిగింది. ఇంధన కొరతవలన నిత్యావసర వస్తువుల తోపాటు వ్యవసాయరంగం మీద కూడా పెనుభారం పడింది. సామాన్య ప్రజలు పెరిగిన ధరలను మోయలేకపోతున్నారు. ఇంధన సంక్షోభంతో పలువురు ఉపాధి కోల్పోతున్నారు. ఇతరదేశాలతో పోల్చిచూస్తే భారత్ కొంతవరకు ఆర్థికంగా సుస్థిరంగానే ఉందని చెప్పవచ్చు.ఇరాన్,అమెరికాల మధ్య యుద్ధ విరమణకు సంబంధించి, రాజీకుదరకపోతే,





యుద్ధంఇలాగే కొనసాగితే భారత్‌కూడా సమీప భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కోక తప్పదు.ప్రపంచం ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభం సమసిపోవాలంటే యుద్ధ విరమణ చర్యలు వేగ వంతం చేయాలి. స్ట్రయిట్ ఆఫ్ హార్ముజ్‌ను ఎలాంటి షర తులు లేకుండా ఇరాన్ పునః ప్రారంభించాలి.హార్ముజ్‌గుండా పయనించే నౌకలపై టోల్ విధించి,తద్వారా ధ్వంసమైన ఇరాన్‌ను పునర్నిర్మాణ దిశగా నడిపించాలనే ఇరాన్ ప్రతిపాదనకు అమెరికా అంగీకరించబోదు.అంతర్జాతీయ చట్టాల ననుసరించి స్వేచ్ఛగానౌకలు హార్ముజ్ గుండా ప్రయాణం చేయాలి. హార్ముజ్‌పై ఇరాన్ తన అధికారాన్ని చెలాయిస్తున్నది. తమ అనుమతి లేకుండా స్ట్రయిట్ ఆఫ్‌హార్ముజ్ గుండా ఎలాంటి నౌకలు ప్రయాణించినా, పేల్చి వేస్తామని, అమెరికా ఈ విషయంలో వెనక్కి తగ్గకపోతే హార్ముజ్ జల సంధి క్రింద అమర్చిన సీమైన్స్‌తో తగిన బుద్ధి చెబుతామని ఇరాన్‌కుచెందిన ఐఆర్జీసీ చేసిన ప్రకటనతో అమెరికా నావికా దళం ఇందుకు ప్రతిగా ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధించి, ప్రపంచాన్ని తీవ్ర ఇంధన సంక్షోభంలో ముంచె త్తింది. గల్ఫ్‌దేశాల్లో చమురు నిల్వలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే చమురు వెలికితీతను ఆపక తప్పదు.చమురు తవ్వకాలను నిలిపి వేస్తే, తిరిగి ప్రారంభించడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతా యి. గల్ఫ్‌లో చమురు నిల్వలు పెరిగిపోతుంటే, చాలా దేశాలు చుక్క చమురు దొరక్క అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.ఇదొక విచిత్రమైన వైపరీత్యం. యుద్ధకాంక్ష వలన తలకెక్కిన పైత్యానికి అమెరికా ఇరాన్‌ల మధ్యశాంతి ఒప్పందమే ఏకైక పరిష్కారం. యుద్ధాన్ని విరమించకపోతే ఇప్పటికే తీవ్ర ఆర్థికసంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచం అల్లకల్లోలంగా మారే అవకాశముంది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ప్రారంభమై 3నెలలు దాటి నాల్గవనెలలోకి ప్రవేశించినా ఇంకా పరిస్థితిలో మార్పురాలేదు. అమెరికా ఆశించినట్టుగా ఇరాన్‌లో రెజీమ్ మార్పు జరగలేదు.యుద్ధం వలన గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు దెబ్బతిన్నాయి. అమెరికా యుద్ధ విమానాలు, క్షిపణులు ధ్వంసమయ్యాయి. యుద్ధంవలన అమెరికాకు 25బిలియన్ డాలర్ల నష్టం వాటి ల్లినట్టు సమాచారం.అయితే ఈనష్టం 100బిలియన్ డాలర్ల కు పైగా ఉండవచ్చని అంచనా.ఏదిఏమైనప్పటికీ ఆర్థికంగా పతనమైన అమెరికాకు ఈ యుద్ధం మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగామారింది.డాలర్‌వ్యవస్థ మాత్రమేఅమెరికాను కాపాడుతున్నది. చమురుతోపాటు ఇతర వాణిజ్య ఒప్పందాలు డాలర్‌తో కాకుండా ఆయా దేశాల కరెన్సీతో జరిగితే అమెరికా ఆర్థికంగా అధోగతిపాలై ఉండేది.ఇరాన్ షరతులను అమెరికా అంగీకరించలేదు. అమెరికా చెప్పినట్టు ఇరాన్‌నడుచుకోలేదు. ఇలాంటి సందిగ్ధత నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో హార్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛవాణిజ్యం జరిగేలా ఇరాన్ అంగీకరించాలి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేయకుండాచూడాలి.ఇరాన్‌కు చెందిన యురేనియం నిల్వలను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నిర్వీర్యం చేయాలి. గాజాలోను, లెబనాన్‌పైన ఇజ్రాయిల్ తనదాడులకు స్వస్తి చెప్పాలి. ఈనిబంధనలను అంగీకరించేలా అమెరికా, ఇరాన్ దేశాలను ఐక్యరాజ్యసమితి, ఇతరదేశాలు ప్రయత్నం చేయాలి. ఇతరదేశాల్లో మాదిరిగానే అమెరికాలో కూడా ద్రవ్యోల్బణం పెరిగింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.విలాసవంతమైన జీవితాన్నిగడిపే అమెరికా పౌరులకు యుద్ధం శరాఘాతంలా తగిలింది.ఈ కారణంగానే ట్రంప్‌పై అమెరికా ప్రజల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. యుద్ధం తలకుమించిన భారంగా మారిన నేపథ్యంలో ఇరాన్ షరతులను అంగీకరించలేక, రిపబ్లికన్ల వత్తిడిని అధిగమించలేక ట్రంప్ ఉక్కిరిబిక్కిరి కావడం చూస్తున్నాం. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో అమెరికా కూడా అన్ని విషయాలను పక్కనబెట్టి, ఇరాన్ యురేనియం నిల్వలను తమకు అప్పగిస్తేచాలని అమెరికా కోరుకుంటున్నది. తద్వారా యుద్ధంలో తామే గెలిచామని చెప్పుకోవడానికి అవకాశం దొరుకుతుంది. అప్పుడే ట్రంప్ అహం సంతృప్తి

ong-5_ong-5.qxd 6/6/2026 11:06 PM Page 1



## అంబేద్కర్ ఆశయ సాధనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- హోంమంత్రి వంగలపూడి అనిత**



**దర్శి, జూన్ 6, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రెండేళ్లుగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. దర్శి ప్రాంతంలో కూడా ఈ రెండేళ్లలో శాంతిభద్రతలు ప్రజల స్వేచ్ఛ జీవితం తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ చేస్తున్న అభివృద్ధి కృషిని ఆమె అభినందించారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి అభిమానించాలని కోరారు. త్వరలో దర్శి లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీతో కలిసి పర్యటిస్తానని తెలియజేశారు. గత ఐదేళ్ల రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు గురి చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు మహిళలు, వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, ఎస్సీ సోదరులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ సోలార్ యూనిట్లతో విద్యుత్ ఛార్జీలు ఆదాయం

*- సూర్యఘర్ పథకం ద్వారా బీసీ,ఓసీ వినియోగదారులకు సబ్సిడీ*

*- పీఎం సూర్యఘర్ సోలార్ యూనిట్లను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి*



**జె. పంగులూరు, జూన్ 6, ప్రభాతవార్త**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పంగలూరు మండలంలో అరికట్లవారిపాలెం గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన 28 రూఫ్ టాప్ సోలార్ యూనిట్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం పథకం లబ్ధిదారుల ఇళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ సోలార్ యూనిట్ల వినియోగంతో విద్యుత్ ఛార్జీలు ఆదా అవుతాయని, ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రెండు కిలోవాట్ల రూఫ్ టాప్ యూనిట్లను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే అందిస్తుందన్నారు. రెండు కిలోవాట్ల యూనిట్ తో నెలకు సుమారు 240 యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని సంబంధిత కాంట్రాక్టర్లు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచడంలో భాగంగా బీసీ, ఓసీ వినియోగదారులకు కూడా ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుందన్నారు. మూడు కిలోవాట్ల యూనిట్ కు బీసీ వర్గాలకు రూ.98 వేలు, ఓసీలకు రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని మంత్రి వివరించారు. రూఫ్ టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి కాంట్రాక్టర్లు ఖచ్చితమైన నాణ్యత నిబంధనలు, ప్రమాణాలు పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉన్నాం రవి, మాగులూరి రమేష్, మాగులూరు రాంబాబు, మాగులూరు వీరాంజనేయులు, తాని కొండ దయా శేఖర్, సుసన్న, ఉన్నం పొలేస్, సుప్రియ, రావు రమేష్ బాబు, అల్లమనేని బ్రహ్మానంద స్వామి, గుర్రం శేఖర్, చింతల సహదేవుడు, నార్నే సుబ్బారావు, జనసేన, తెలుగుదేశం పార్టీ పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## జూన్ 8న ఐటిఐ ఉత్తీర్ణులకు అప్రెంటిస్ మేళా

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ఒంగోలులో ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా (పీఎంఎన్ఏఎం) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మరియు సహాయ అప్రెంటిషిప్ అడ్వైజర్ సి.హెచ్.ఎస్.వి. ప్రసాద్ బాబు తెలిపారు. ఒంగోలుగుంటూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ (బాలురు) ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా జరగనుంది. జిల్లాలోని ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు మారుతి సుజుకి, టాటా మోటార్స్, హ్యుందాయ్, మహీంద్రా కంపెనీల ప్రతినిధులతో పాటు కాంచీపురానికి చెందిన ఎల్ అండ్ టి సంస్థ, హైదరాబాద్‌కు చెందిన హెటెరో ఫార్మాస్యూటికల్స్ సంస్థల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఐటీఐలో అన్ని ట్రేడ్లలో ఉత్తీర్ణులైన అభ్యర్థులతో పాటు వృత్తి విద్య (వొకేషనల్) కోర్సులు పూర్తి చేసిన వారికి కూడా ఈ మేళాలో అవకాశాలు కల్పించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అప్రెంటిషిప్ విధానాల ప్రకారం శిక్షణతో పాటు శిక్షణాభృతి అందజేయబడుతుందని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9703165456 నంబర్‌లో అప్రెంటిషిప్ అడ్వైజర్‌ను సంప్రదించాలని తెలిపారు. అలాగే అభ్యర్థులు"అప్రెంటిషిప్ ఇండియా డాట్ ఓఆర్‌జీ" (అప్రెంటిషిప్ ఇండియా వెబ్‌సైట్) లో ముందస్తుగా నమోదు చేసుకుని మేళాకు హాజరుకావాలని సూచించారు.

## ఉద్యోగాల పేరుతో మోసాలు.. అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలు, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్లు, నకిలీ జాబ్ పోర్టల్స్ ద్వారా ఆకర్షణీయమైన ఉద్యోగ ప్రకటనలు ప్రచారం చేస్తూ యువతను వలలో వేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా విదేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు, ప్రముఖ బహుళజాతి కంపెనీల్లో నియామకాలు, వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు, తక్షణ నియామకాలు అంటూ తప్పుడు ప్రకటనలు చేస్తూ అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగం ఖరారు చేయడం, వీసా ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర పేర్లతో ముందస్తు చెల్లింపులు కోరే వ్యక్తులు లేదా సంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. చాలా సందర్భాల్లో నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ ఇమెయిల్ ఐడీలు, ప్రముఖ కంపెనీల పేర్లతో రూపొందించిన ఫేక్ ప్రొఫైళ్ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే ముందు సంస్థ వివరాలు, అధికారిక వెబ్‌సైట్, సంప్రదింపు వివరాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన నియామక సంస్థలు సాధారణంగా ఉద్యోగాల కోసం వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు చెల్లించాలని కోరవని ఎస్పీ స్పష్టం చేశారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేయాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ కోరారు. ఉద్యోగ అవకాశాల కోసం ప్రయ త్నించే యువత తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా పూర్తి సమాచారం తెలుసుకుని మాత్రమే ముందుకు సాగాలని, అప్రమత్తతే సైబర్ మోసాల నుంచిరక్షణ కల్పిస్తుందని హర్షవర్ధన్ పేర్కొన్నారు.

## ప్రజాభిప్రాయ సేకరణకు పౌరరిజిస్టర్లు

**- పాలనలో పారదర్శకత, జవాబుదారితనం పెంచేలా స్వర్ణ గ్రామాలు, వార్డుల్లో ఏర్పాటుకు నిర్ణయం**

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రత్యక్ష అభిప్రాయాలను సేకరించడానికి అన్ని స్వర్ణ గ్రామాలు వార్డు(ఎస్‌జీఎస్‌డబ్ల్యూ)లో తప్పనిసరిగా పౌరుల అభిప్రాయాల రిజిస్టర్ నిర్వహించాలని ఎస్‌జీఎస్‌డబ్ల్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కలెక్టర్, డీఎస్‌జీఎస్‌డబ్ల్యూఓ, మున్సిపల్ కమీషనర్, ఎంపీడీవోలు, ఎంఎస్‌జీవోలు, యుఎస్‌డబ్ల్యూఓలకు ఆ శాఖ డైరక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రతి ఇంటి వద్దకే సేవలు సంక్షేమ పథకాలు అందించేందుకు స్వర్ణ గ్రామాలు, వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

దీనిలో భాగంగా జిల్లాలో మొత్తం 717 స్వర్ణ గ్రామాలు, వార్డులు ఏర్పాటు చేశారు. పౌర కేంద్రిత పాలన బలోపేతం చేయడం, సేవలు మెరుగుపరచడం, పారదర్శకత, జవాబుదారితనం నిర్ధారించడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు పౌరుల అభిప్రాయాల రిజిస్టర్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ రిజిస్టర్ ఎస్‌జీడబ్ల్యూ కార్యాలయాలు సందర్శించే ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు, ప్రశంసలు నమోదు చేసుకునేందుకు ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుందని భావిస్తుంది. సేకరించిన అభిప్రాయాల్లో లోపాలు గుర్తించి పాలన మెరుగుపరిచి సంతృప్తి స్థాయిలో పెంచవచ్చని ఆలోచిస్తుంది. బీఎస్‌జీ ఎస్‌డబ్ల్యూఓ, ఎంఎస్‌జీవోలు, యుఎస్‌డబ్ల్యూవోలు ప్రతి 15రోజులకు ఒక సారి అందిన అభిప్రాయాలపై సమీక్షించాలి. రిజిస్టర్‌లో పరిశీలించి తగిన చర్యలు తీసుకున్నారో లేదో నిర్ధారించాలి. అవసరమైన చోట సరిదిద్దే చర్యలు చేపట్టాలి. ఈ రిజిస్టర్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తారు. ప్రతి స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల్లో విధిగా పౌరుల అభిప్రాయాల రిజిస్టర్ నిర్వహించాలి. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రజలకు అందుతున్న సేవలు, ఫిర్యాదుల పరిష్కారం, ఉద్యోగుల అందుబాటు, ప్రవర్తన, స్పందనపై అభిప్రాయాలను నమోదు చేసుకోవచ్చు.


# ప్రకాశం వార్త



తెలుగు జాతీయ దినపత్రిక


## జీప్ నుంచి జారిపడి యువకుడు మృతి



**కొరిసపాడు, జూన్ 6, ప్రభాతవార్త**

జీప్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది .మేదరమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి కిచెందిన ఆశిక్ తన స్నేహితుడైన సాజిద్‌తో కలిసి ఓపెన్ టాప్ జీపులో శుక్రవారం మద్దిపాడు మండలంలోని ఒక దాబాలో పార్టీ చేసుకొని పొద్దుపోయిన తర్వాత అద్దంకి బయలు దేరారు. వాహనాన్ని నడుపుతున్న సాజిత్ జీప్‌నునిరక్ష్యంగా, అతివేగంగా నడపడంతో జీపు నుంచి ఆశిక్ జారి క్రింద పడ్డాడు. గాయాలైన ఆశిక్ ని వైద్య చికిత్సకై ఒంగోలు తరలించారు. చికిత్స పొందుతూ ఆశిక్ వయసు 19 సంవత్సరాలు మరణించాడు. హాస్పటల్ వారిచ్చిన సమాచారం మేరకు ఆశిక్ మృతిపై మేదరమెట్లపోలీసులు శనివారం నాడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అంబేద్కర్ ఆశయాలే దేశ ప్రగతికి దిక్సూచి







**కనిగిరి, జూన్ 6, ప్రభాతవార్త**

**- కనిగిరిలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్**
**- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవలకు సహకారం**
**- ఎమ్మెల్యే ఉగ్ర కృషిపై ప్రశంసలు**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు దేశ ప్రజలందరికి ఆదర్శప్రాయంగా నిలవాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు. మార్కాపురం జిల్లా కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శనివారం ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. కనిగిరి ప్రజలంతా ఐక్యంగా ముందుకొచ్చి అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. ఈ కార్య క్రమానికి ఆహ్వానించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అంబేద్కర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యాహక్కులు, రాజ్యాంగ పరి రక్షణకు జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. దేశంలో అనేక రాజకీయ పార్టీలు అంబేద్కర్ పేరును వినియోగిస్తు న్నప్పటికీ, ఆయన ఆశయాలను పూర్తి స్థాయిలో ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దళితులకు తగిన న్యాయం జరగలేదని, ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఏ వర్గానికి అన్యాయం జరగకుండా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, దేశ చిత్రపటంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్నిహిత మిత్రుడని గుర్తు చేశారు. ఐటీ, టెక్నాలజీ రంగాలతో పాటు మెగా సీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖల నుంచి అభివృద్ధి కార్యక్రమాలను కనిగిరి ప్రాంతానికి తీసుకురావడంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కేంద్ర మంత్రి ప్రశం




సించారు. కనిగిరి ప్రాంతానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కృషి వల్ల కనిగిరి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలం ప్రతి ఒక్కరి నరనరాల్లో ఉండాలని అన్నారు. అంబేద్కర్ విగ్రహాలు సాధారణంగా పట్టణాల శివార్లలో ఉంటాయని, అయితే కనిగిరి పట్టణ నడిబొడ్డున విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరువతో అన్ని వర్గాల ప్రజలు కలిసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాం జనేయస్వామి మాట్లాడుతూ విద్య ద్వారానే అసమానతలను తొలగించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, కార్పొరేట్ స్థాయి విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ ప్రభావిత, వెనుకబడిన ప్రాంతమని పేర్కొన్నారు. నీటి కొరత కారణంగా ఉద్యాన పంటల సాగు ఎక్కువగా జరుగు తోందన్నారు. కనిగిరి అభివృద్ధికి ఫుడ్ ప్రాసెసింగ్ మెగా క్లస్టర్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే సేవల విస్తరణ అత్యవసరమని కేంద్ర మంత్రిని కోరారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని, యువత రాజ్యాంగ విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలను ఇతర తదితర ప్రముఖులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అంబేద్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి కార్యాలయం నుంచి పామూరు బస్టాండ్ మీదుగా ఒంగోలు బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులు, వివిధ సంఘాల ప్రతి నిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జైభీమ్ నినాదాలతో కనిగిరి పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బీఎన్ విజయ్ కుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మీ, గూడూరి ఎరిక్షన్‌బాబు, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, జిల్లా కలెక్టర్ విజయ సునీత, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పల్లె నిద్ర ఓ చారిత్రాత్మక కార్యక్రమం










*- ప్రజలతో నేరుగా మమేకమయ్యే వేదిక*

*- చిన్న చిన్న సమస్యలను కూడ స్వయంగా పరిశీలించవచ్చు*

*- ప్రభుత్వ సేవల పట్ల ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోవచ్చు*

*- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు*

**అద్దంకి, జూన్ 6, ప్రభాతవార్త :**

పల్లె నిద్ర ఓ చారిత్రాత్మక కార్యక్రమం అని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. శనివారం అద్దంకి మండలం, తిమ్మాయిపాలెం గ్రామంలో పల్లెనిద్ర అనంతరం గ్రామంలో పర్యటించి, చివరిగా పత్రికల వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా అధికారులను కలవడానికి, తమ సమస్యలను తెలియజేయ డానికి ఒక మంచి వేదికగా వుందని, ఆయన అభిప్రాయ పడ్డారు. జిల్లా కలెక్టర్‌నుండి దిగువ స్థాయి అధికారి దృష్టికి రాని చిన్న చిన్న సమస్యలను కూడ ప్రజలు మా దృష్టికి తెస్తున్నారని, వాటిని స్వయంగా పరిశీలించే పరిస్థితి ఈ కార్యక్రమం ద్వారా ఒక అవకాశంగా వుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల, ప్రజలలో ఎటువంటి అభిప్రాయం వుంది అనేది కూడ, స్వయంగా తెలుసుకునే పరిస్థితి వుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధికార యంత్రాంగం, పనితీరు సంతృప్తిగా వుందని, ఆయన వెల్లడించారు. అదే విధంగా పలెనిద్రలో ప్రజలు తమకు అందుతున్న సేవల విషయమై ఇప్పటికి జరిగిన ఈ కార్యక్రమం ద్వారా, అధికార యంత్రాంగం అభిప్రాయాలను తెలుసుకోగ, ప్రజలు సంతృప్తిగా వున్నట్లు వెల్లడి అయ్యిందని ఆయన అభిప్రాయ పడ్డారు. శుక్రవారం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా అనేక సమస్యలుపై, అర్జీలు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు ఉదయాన్నే, అధికార యంత్రాంగం అంతా ఆయా సమస్యల వద్దకు వెళ్ళి పరిశీలించి, పరిష్కరించినట్లు ఆయన వివరించారు. పల్లె నిద్ర ద్వారా చిన్న చిన్న సమస్యలు, ఆర్ధిక పరమైనవి కాని వన్నీ, పరిష్కరించాడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఆర్ధిక విషయాలను, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి, నిధులను తెప్పించి, పరిష్కరించ నున్నట్లు కూడ ఆయన వివరించారు. అదేవిధంగా తిమ్మాయిపాలెం గ్రామంలో వందల ఎకరాల భూముల వైపు వెళ్ళె డొంక దారి సమస్య తన దృష్టికి వచ్చిందని, దానిని పరిశీలించి, సర్వేచేసి ఆ సమస్యను పరిష్కారించాలని, ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోను, మండల కేంద్రంలోను, ప్రజా వినతులను స్వీకరిస్తున్నట్లు దీనికి తోడు ప్రతి శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోను, మండల కేంద్రంలోను, గ్రామాలలోను, సంబంధిత అధికారులు, ప్రజా వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు, వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. తమ దృష్టికి వచ్చిన వినతులపై పల్లెనిద్ర అనంతరం వేకువజామునే కలెక్టర్ పి.రాజాబాబు ప్రజల చెంతకు వెళ్ళారు. చెత్త సంపద కేంద్రాన్ని, త్రాగునీటి సరఫరాను, గ్రామంలోను ఎత్తిపోతల పథకాన్ని, రాష్ట్రీయ గోకులమిషన్ ద్వారా ఏర్పాటు చేసిన లేగదూడల కేంద్రాన్ని, వాటర్ ట్యాంకు వద్ద నీటి టెస్టింగ్ విధానాన్ని, స్వచ్ఛ రథాన్ని, ఎస్‌సి కాలనీలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను, ఎస్‌సి కాలనీ స్మశాన వాటికను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట అన్నీ శాఖల జిల్లా, మండల అధికారులు, గ్రామ ప్రజలు వున్నారు.

# 150 ఏళ్ల ఒంగోలును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్ రాజాబాబు పిలుపు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

150 సంవత్సరాల చారిత్రక వారసత్వం కలిగిన ఒంగోలు నగరాన్ని రాష్ట్రంలోనే అత్యంత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్, ఒంగోలు నగర కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పి. రాజాబాబు పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో ఒంగోలు నగర స్థాపనకు 150 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని నగర రూపురేఖలను మార్చే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. గత నెల 23వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నాలుగు వారాలపాటు దశలవారీగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొదటి దశలో చెత్త అధికంగా పేరుకుపోయే రెడ్, యెల్లో స్పాట్ల తొలగింపు, రెండో దశలో కాలువలు, డ్రైనేజీల శుభ్రత, మూడో దశలో నివాస, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత, నాలుగో దశలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా మరుగుదొడ్లు, ఇతర ప్రజా ప్రదేశాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్-2026 నిబంధనల ప్రకారం తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు పనిచేసే 1800425238 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు.



నగరంలో త్వరలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు, ప్రధాన కాలువ అయిన పోతురాజు కాలువను ఆధునీకరించడంతో పాటు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, పార్కులు, ప్రభుత్వ భవనాల పరిసరాలను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యసాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, ఎంహెచ్‌ఓ వైష్ణవి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

6:6.qxd 6/6/2026 11:49 PM Page 1



# వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం



**రాచర్ల, జూన్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రాచర్ల గ్రంథాలయంలో శనివారం గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు 40 రోజులపాటు చదరంగం క్విజ్ డ్రాయింగ్ వ్యాసరచన సెమినార్ డస్టర్ గేమ్ లుక్ స్నేక్ అండ్ లాడర్ త్రీ వన్ ఇన్ కబడ్డీ మొదలగు కార్యక్రమాలు ఆటలు పాటలు నేర్పించడం జరిగిందన్నారు. జ్ఞానాభివృద్ధికి పుస్తకాలు చదవాలని అన్నారు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు తెలిపారు విద్యార్థులు ప్రతిరోజు దిన వార పక్ష మాస త్రికలతోపాటు కథలు నాటకాలు సైన్స్ గణితం జనరల్ అవేర్నెస్ జనరల్ నాలెడ్జ్ ఆధ్యాత్మిక విజ్ఞాన వినోద పుస్తకాలు తప్పకుండా చదవాలన్నారు. గ్రంథాలయానికి వెళ్లాలని ఆసక్తి విద్యార్థుల్లో పెరగాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ గ్రంథ పాలకుడు వై పాండు, పాఠకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆవులూరి యలమంద కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ మాగుంట

### - యలమందను ఓదార్చిన ఒంగోలు ఎంపీ, టీడీపీ నేతలు



**పొదిలి, జూన్ 6, ప్రభాతవార్త**

కేథార్‌నాథ్ యాత్రలో అనుకోని విధంగా అకాల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఆవులూరి నాగేశ్వరి కుటుంబ సభ్యులను ఒంగోలు ఎంపీ మాగుంటశ్రీనివాసులురెడ్డి శనివారం పరామర్శించారు. భర్త సీనియర్ టీడీపీ నాయకులైన ఆవులూరి యలమందను ఓదార్చారు. టీడీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పొదిలిలోని విశ్వనాథపురంలో ఉన్న నాగేశ్వరి నివాసానికి ఎంపీ మాగుంట, టీడీపీ నాయకులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా యాత్రలో చోటు చేసుకున్న ఈ విషాధ ఘటనకు సంబంధించిన వివరాలను యలమందను అడిగి తెలుసుకున్న మాగుంట, తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నాగేశ్వరి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. పార్టీ కోసం ఎంతో సేవ చేసిన ఈ కుటుంబానికి ఈ కష్ట సమయంలో టీడీపీ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ స్థాయిలకు చెందిన పలువురు ముఖ్య టీడీపీ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. వారంతా యలమంద కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గుంటక



**వెలిగండ్ల, జూన్ 6, ప్రభాతవార్త**

శనివారం మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన గాలిమోటు రోశయ్య కుమారుని వివాహ కార్యక్రమానికి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు వెలిగండ్ల జడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు గజ్జల వెంకటరెడ్డి, నాయకులు పల్లా వెంకట సుబ్రహ్మణ్యం, కటికల వెంకటరత్నం, జేమ్స్, బొబ్బా వెంకటరెడ్డి, ఎలికా నారాయణ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## గుడ్లూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు



**గుడ్లూరు, జూన్ 6, ప్రభాతవార్త**

గుడ్లూరులో ఎర్రా ప్రగడశాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి 40 రోజులుగా 6వ తేదీ వరకు వేసవి శిక్షణా తరగతులు జరిగాయి. గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శనివారం కార్యక్రమం ముగింపు సందర్భంగా వేసవిశిక్షణా తరగతులకు క్రమం తప్పకుండా వచ్చిన విద్యార్థులకు ప్రభాకర్‌రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు.

# నవచేతన యాప్‌పై ఓరియంటేషన్ శిక్షణ



**కొనకనమిట్ల, జూన్ 6, ప్రభాతవార్త**

మండలంలోని పెద్దారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నవచేతన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 6 సంవత్సరాల లోపు పిల్లల అభివృద్ధికి తోడ్పడే విధంగా నూతనంగా ప్రవేశపెట్టిన ఏఐ సాంకేతికత గురించి వివరించారు. పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి 5 డొమైన్‌ల ఆధారంగా స్క్రీనింగ్ నిర్వహిస్తారని, అలాగే నవచేతన యాప్ వినియోగం, దాని ప్రయోజనాల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పీడీ పద్మావతి,పొదిలి సీడీపీవో సుధా మారుతి, సూపర్‌వైజర్ ప్రసన్న పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు

**గుడ్లూరు, జూన్ 6, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలంలోని పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని విత్తనాలు పొందాలని ఏవో రవి కుమార్ తెలిపారు. జీలుగలు పూర్తి ఖరీదు రూ.16000 ఉండగా సబ్సిడీ రూ.8వేలు పోను రైతు వాటా రూ.8వేలు ఉంటుంది. జనుములు పూర్తి ధర రూ.15,400 ఉండగా 50 శాతం సబ్సిడీ పోను 7,700 చెల్లించాలి. పిల్లిపెసర రూ.19,600 ఉండగా రైతు రూ.9,800 చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు.

## విద్యార్థుల్లో విజ్ఞాన దీప్తి నింపిన వేసవి శిబిరం



**కనిగిరి, జూన్ 6, ప్రభాతవార్త**

విద్యార్థులు జ్ఞాన సముపార్జనను జీవిత లక్ష్యంగా చేసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని ఎంఈఓ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి సూచించారు. శనివారం కనిగిరి శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు గ్రంథపాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. విద్యార్థులు దేశభక్తి, సామాజిక బాధ్యతతో ఎదిగి భవిష్యత్తులో మంచి సమాజ నిర్మాణానికి సారథ్యం వహించాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు గయాజ్ భాషా మాట్లాడుతూ శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించిన రిసోర్స్ పర్సన్లను అభినందించారు. అలాగే శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు, బహుమతులను రామిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ఖాజా హుస్సేన్, శ్రీనివాసులురెడ్డి, కేటీపీ పాపారాయుడు, నరేంద్ర, శ్రీనివాసులు రాయుడు, అనుపల్లవి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో విజ్ఞానశక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరం విజయవంతంగా ముగిసింది.

## అభివృద్ధిపనులను త్వరితగతిన పూర్తిచేయాలి - ఎమ్మెల్యే

### - నాణ్యతాప్రమాణాలలో రాజీపడొద్దు



**కందుకూరు జూన్ 6, ప్రభాతవార్త**

అభివృద్ధిపనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో రాజీ పడొద్దన్నారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఆధ్వర్యంలో కందుకూరు మున్సిపాలిటీలో సుమారు రూ.90లక్షలకుపైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆర్టీసీడిపో, వినాయకుని గుడి, అభ్యుదయ పాఠశాల, పాతూర్యాంకు బజార్, పోలేరమ్మస్వామి గుడి, కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా ఆయన గమనించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల నుంచి అంకమ్మ దేవాలయం వరకు పాత బైపాస్ రోడ్డును అభివృద్ధి చేయబోతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. రోడ్డ వెడల్పు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. రోడ్డుకు తూర్పువైపు కాలువపై స్లాబ్ వేసి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా మార్చుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు దామచర్లశ్రీధర్‌రావు, బెజవాడ ప్రసాద్, వడలాల కొండయ్య, షేక్ సలాం, శ్రీను, రాయపాటి శ్రీనివాసరావు, కొత్తూరి వెంకట సుధాకర్, మురారిశెట్టి శ్రీకాంత్, గౌండి నర్సింగరావు, వడ్లెళ్ల రవిచంద్ర తదితరులు ఉన్నారు.

# చేనేత ఉద్యమ నేత మాచర్ల మోహన్‌రావుపై దాడి

### - వేటపాలెం మండలం సిదూర్ కాలనీలో ఘటన
### - భూమి సర్వేలో ఉద్రిక్తత ఘర్షణ.. ఆపై దాడులు
### - ఏరియా వైద్యశాలలో చేరి రెండు వర్గాలు ఫిర్యాదులు
### - మోహన్‌రావుపై దాడిని ఖండించిన సీపీఎం





**చీరాల టౌన్, జూన్ 6, ప్రభాతవార్త**

వేటపాలెం మండలం అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని సిదూరు కాలనీలో కొనసాగుతున్న వ్యూవర్స్ ప్రాజెక్టు భూ వివాదం శనివారం ఉద్రిక్తతకు దారితీసింది. కోర్టు ఆదేశాల మేరకు భూమి సర్వే, కొలతల ప్రక్రియ జరుగుతున్న సమయంలో భూ వివాదం నేపథ్యంలో సామాజిక కార్యకర్త, రాష్ట్ర జనచేనేత ఉద్యమనాయకులు మాచర్ల మోహన్‌రావుపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తలకు గాయమైన మోహన్‌రావు స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై మాచర్ల మోహన్‌రావు మీడియాతో మాట్లాడుతూ భూమి కొలతల కోసం కోర్టు కమీషనర్ ఆదేశాలు జారీ కావడంతో ప్రతి వాదులు కాలనీలో ఇంటింటికి తిరిగి దావా ఉపసంహరించుకున్నట్లు తెల్లకాగితాలపై సంతకాలు చేయించాలని ఒత్తిడి తెచ్చారని కాలనీ వాసులు తమ దృష్టికి తెచ్చారు అన్నారు. ఈ నేపథ్యంలో కాలనీ ప్రజలకు ధైర్యం చెప్పేందుకు తాను ప్రజా సంఘాల నాయకులు దుడ్డు విజయ్ సుందర్‌తో కలిసి సిదూర్ కాలనీలోని మహాలక్ష్మీ ఆలయం వద్దకు వెళ్లిన సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి అన్నారు. దీంతో తమను నెహెమ్యా, కొర్నేలు, ఎలిచర్ల నవీన్, కట్టా శ్రీనివాసరావు పలువురు చుట్టుముట్టి నెట్టుకుంటూ వెనుక నుంచి రాడ్డుతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని మోహన్‌రావు తెలిపారు. కాగా తాము కేవలం చేనేత కుటుంబాలకు ధైర్యం చెప్పేందుకు వెళ్లామని, భూమి కొలతల ప్రక్రియ కోర్టు పరిధిలోనే జరుగుతోందని ప్రజలకు వివరించామని మోహన్‌రావు చెప్పారు. అయితే ఉద్దేశపూర్వకంగానే కుల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి దూషణలకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతలు బలహీనులు కాదు. ఆత్మగౌరవం విషయంలో వెనుకడుగు వేయం అని స్పష్టం చేశారు. 32 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూములపై ఇప్పుడు జీపీఏ రద్దు చేశామని చెప్పడం అన్యాయమని ఆయన విమర్శించారు. పేద చేనేతల సంక్షేమం కోసం ప్రభుత్వం, విదేశీ సంస్థల సహకారంతో ప్రాజెక్టు అమలైందని పేర్కొన్నారు. భూ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి పోలీసు రక్షణ కోరినా స్పందన లేకపోయిందని, కోర్టు ఆదేశాలు తెచ్చుకోవాలని మాత్రమే అధికారులు చెబుతున్నారని ఆరోపించారు. సమస్యను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలనుకుంటున్నామని తెలిపారు. ఇది ఇలా ఉండగా తమపై కూడా దాడి చేశారని, మరో వర్గం హాస్పిటల్‌లో చేరగా ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సీఎస్‌పురంలో వేసవి శిబిరం ముగింపు



**సీఎస్‌పురం, జూన్ 6, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సీఎస్‌పురం శాఖా గ్రంథాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞాన వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, గణితం, తెలుగు వ్యాకరణం, నీతి కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు తదితర అంశాల్లో శిక్షణ అందించారు. అలాగే ఆటల పోటీలు, పాటల నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు రిటైర్డ్ ఉద్యోగి పిట్టా రంగస్వామి ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులోరాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, గ్రంథాలయాన్ని వినియోగించుకునే అలవాటు పెంపొందించుకోవాలని భాస్కరరావు సూచించారు. అనంతరం శిబిరం విజయవంతానికి సహకరించిన బోధన సిబ్బందికి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈర్ల లక్ష్మీ నారాయణ, సీహెచ్ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి దేవస్థానంలో పూజలు చేసిన కదిరి పార్థసారధి



**సీఎస్‌పురం, జూన్ 6, ప్రభాతవార్త**

సీఎస్‌పురం గ్రామంలోని డీజీపేట రోడ్డులో వెలసిన శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం మూడవ వార్షికోత్సవ వేడుక శనివారం జరిగింది. ఈ వేడుకల్లో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారధి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు పార్థసారధికి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మేకల శ్రీను, గుంటయ్య, ఇర్ల వీరాంజనేయులు, మేకల బాలు, చిరంజీవి, నిమ్మల శ్రీనివాసులు, ఆలా చిన్న వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 8న గురుకులలో మిగిలిన ఐదో తరగతి,
## ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్

**కొనకనమిట్ల, జూన్ 6, ప్రభాతవార్త**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లు భర్తీకి ఈనెల 8న చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల, కళాశాల(బాలికల)లో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించటం జరుగుతుందని వెలుగొండ గురుకులం ప్రిన్సిపాల్ ఇబ్రహీం తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలకు ప్రవేశ పరీక్ష రాసి సీటు కేటాయించబడని విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇంకాసీట్లు మిగిలి ఉంటే ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులను చేర్చుకునే అవకాశం కల్పించబడును. ఐదవ తరగతి ప్రవేశాలకు ఉదయం 9.30గంటలకు,ఇంటర్ మొదటిసంవత్సరం ప్రవేశాలకుమధ్యాహ్నం2గంటలకుకౌన్సిలింగ్ ఉంటుందని, ఐదవ తరగతిలో ఎస్సీగ్రేడ్ 3-20 జూనియర్ ఇంటర్‌లో (బైపీసీ) ఎస్టీ-03 ఖాళీల ఉన్నట్లు తెలిపారు.

# 9న రాస్తారోకోను జయప్రదం చేయండి



**పామూరు, జూన్ 6, ప్రభాతవార్త**

పెరిగిన పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గ్యాస్, నిత్యవసర ధరలకు నిరసనగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూన్9న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాస్తారోకోను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పోతన ప్రభాకర్,సీపీఎం నాయకులు కొమ్ములపాటి మాల్యాద్రి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గుజ్జుల యలమందారెడ్డి భవన్‌లో రాస్తారోకోకు సంబంధించిన ప్రచార కరపత్రాలను వామపక్ష పార్టీలనాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పోతల ప్రభాకర్ మాట్లాడుతూ 2014లో లీటర్ పెట్రోల్‌రూ.65 ఉంటే నేడు రూ.117.64 కు , డీజిల్ రూ.56 నుంచి రూ.105.23లకు , గ్యాస్ రూ.410 ఉంటే రూ.937.50కు పెరిగిందని తెలిపారు. పన్నుల రూపంలో కేంద్రం వసూళ్లు రూ.52,537 కోట్ల నుంచి రూ.4లక్షల కోట్లకు చేరాయని, కార్పొరేట్లకు రూ.71.52లక్షల కోట్ల రాయితీలు ఇచ్చారని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, సీఎన్జీ ధరలు తగ్గించాలి, కేంద్ర, రాష్ట్ర పన్నులు తగ్గించాలి, స్వదేశీ చమురు ఉత్పత్తి పెంచాలి, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలి, గృహ సిలిండర్ ధర తగ్గించాలని కోరారు. జూన్ 9న జరిగే రాస్తారోకోలో ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోతల ప్రభాకర్, ఇర్రి వెంకటరెడ్డి, సూరిబాబు, పాలపర్తి మస్తాన్‌రావు, ఖాదర్ భాష, మాల్యాద్రి, వజ్రాల సుబ్బారావు, మహేష్, కిషన్ సింగ్, దేవకుమార్, సీపీఐ సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో నవచేతన యాప్‌ను వినియోగించాలి

### - ఐసీడీఎస్ పీడీ పద్మావతి



**పామూరు, జూన్ 6, ప్రభాతవార్త**

ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్ నిర్వహణపై ఒక రోజు శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు పామూరు కేజీబీవీలో కనిగిరి సీడీపీవో సరోజిని అధ్యక్షతన నిర్వహించారు. శిక్షణ కేంద్రాన్ని జిల్లా మహిళా,శిశు సంక్షేమశాఖ పీడీ ఎం.పద్మావతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్‌వాడీలో ప్రవేశపెట్టిన నవ చేతన యాప్ ద్వారా 0-6 సంవత్సరాల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను సమగ్రంగా, ఈసీడీ స్క్రీనింగ్ చేయవచ్చన్నారు. సీడీపీవో సరోజిని మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లల బాల్య వికాసం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయంతో ప్రభుత్వం నవచేతన యాప్ ప్రవేశపెట్టారని దాని ప్రాధాన్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బొట్లగూడూరు వైద్యాధికారి దాదా షరీఫ్, స్వయం కృసి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జి.పద్మావతి, ఎంపీఎస్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### - అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేస్తాం : చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు
### - ఈ నెల 24 నుండి జూలై 5 వరకు బ్రహ్మోత్సవాలు
### - భక్తులుకు సౌకర్యాలు, శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి





**సింగరాయకొండ, జూన్ 6, ప్రభాతవార్త**

దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో ఈవో కృష్ణవేణి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుద్ధం, బయో టాయిలెట్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండపం, ఆలయ ప్రాంగణంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానంగా రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించి,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలనీ పోలీస్ అధికారులుకు పలు సూచనలు చేశారు. దేవస్థానం ఈవో కృష్ణవేణి మాట్లాడుతూ అన్నిశాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎన్‌వీబీ రాజేష్, ఎంపీడీఓ డి. జయమణి, సీఐ హాజరత్తయ్య, ఎస్సై సుదీర్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు, అర్చకులు ఉదయగిరి వెంకట శేషా లక్ష్మీ నరసింహచార్యులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, వైద్యాధికారులు వంశీ, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

# భాషా, గణిత నైపుణ్యాల పెంపే లక్ష్యం

### - రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారి కల్పనా



**సింగరాయకొండ, జూన్ 6, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించడమే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి కల్పన తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆరు రోజుల ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. 140 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభమైన, ఆసక్తికరమైన పద్ధతుల్లో బోధన అందించాలని సూచించారు. కరికులర్ లక్ష్యాలకు అనుగుణంగా భాషా,గణిత నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని, గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ అమలులో ప్రకాశం జిల్లా రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించి, వారు రూపొందించిన టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. మోడల్ పాఠాలను నిర్వహింపజేసి బోధనా విధానాలపై సూచనలు చేశారు. శిక్షణా కేంద్రంలోని వసతులు, భోజన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తున్న కోర్స్ డైరెక్టర్ ఆవుల శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎంఓ నాగేంద్ర నాయక్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మసనం జాలరత్నం, మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీలపై తనిఖీ తహశిల్దార్ ఆకస్మిక తనిఖీ



**గిద్దలూరు, జూన్ 6, ప్రభాతవార్త**

మండల పరిధిలోని గ్యాస్ ఏజెన్సీలపై తహశిల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా గ్యాస్ సిలిండర్ల నిల్వ,పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణ, వినియోగదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈసందర్భంగా తహశిల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్యాస్ ఏజెన్సీలు పనిచేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ఎలాంటి అక్రమాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు వైపి రంగయ్య , రంగస్వామి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పొలానికి ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి

**గిద్దలూరు, జూన్ 6, ప్రభాతవార్త**

త్వరలో అన్నదాత సుఖీభవ పీయం కిసాన్ పథకం 2026-27 మొదటి విడత లబ్ది విడుదల ఉంటుంది కావున దీనికి సంబంధించి కొత్తగా వెబ్ ల్యాండ్‌లో ఆధార్ మ్యాప్ చేయించుకున్నవారి వాలిడేషన్ రాష్ట్ర స్థాయిలోనే చెయ్యడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి వై విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఇంకా ఎవరైనా పొలానికి ఆధార్ లింక్ చేసుకోవాల్సిన వారు ఉంటే త్వరగా రెవిన్యూ శాఖ వారిని సంప్రదించి లింక్ చేసుకున్న యెడల ఈ పథకంలో లబ్ధిదారులు అవుతారని అన్నారు. గత సంవత్సరం మొదటి విడత తరువాత బతికివున్నాకూడా డెత్ అని వచ్చినవారి వివరాలు, ఇన్కమ్ టాక్స్ అని రిజెక్ట్ చేయబడి ఇన్కమ్ టాక్స్ కట్టని వారి వివరాలు మాత్రం గ్రామ స్థాయి నుండి సేకరించి, జిల్లా స్థాయి డిఏఓ ద్వారా కమిషనరేట్‌కు పంపించడం జరుగుతుందన్నారు. కావున అటువంటివారు రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి మీ వివరాలు ఇచ్చినయెడల ఆ జాబితా పై అధికారులకు పంపించి మీరు ఈ పథకంలో లబ్ధిదారులు అయ్యే విధంగా చూడటానికి అవకాశం ఉంటుందన్నారు.

## మోపాడులో ఘనంగా రాములవారి కళ్యాణ మహోత్సవం



**పామూరు, జూన్ 6, ప్రభాతవార్త**

మండలంలోని మోపాడు గ్రామంలో శనివారం శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు, మేడసాని రమణయ్య, దారపనేని సుబ్బారావు, కోటపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## బోధిధర్మ స్కూల్ వ్యాన్‌తో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



**కనిగిరి, జూన్ 6, ప్రభాతవార్త**

బోధిధర్మ స్కూల్ వ్యాన్‌ను నడి రోడ్డుపైనే నిలిపివేయడంతో సుమారు గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్కూల్‌వ్యాన్ డ్రైవర్,యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రహదారిపై వాహనాల రాకపోకలు మందగించి ట్రాఫిక్ సమస్య తలెత్తినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రద్దీగా ఉండే ప్రాంతంలో వ్యాన్‌ను రోడ్డుపైనే పార్కు చేయడంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు,ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు చాలా సేపు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడ్డారు. అత్యవసర పనులపై వెళ్లే వారికి కూడా తీవ్ర అసౌకర్యం కలిగినట్లు తెలిపారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థుల రవాణా వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన ప్రదేశాల్లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రహదారులను పార్కింగ్ స్థలాలుగా మార్చకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు కూడా పర్యవేక్షణ పెంచాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కనిగిరి తరలివెళ్లిన టీడీపీ నేతలు

### - అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే



**కందుకూరు జూన్ 6, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలో శనివారం జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కందుకూరు నుంచి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు పలువురు టీడీపీ నేతలు తరలివెళ్లారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, డోలా బాల వీరాంజనేయస్వామి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు రాయపాటి శ్రీనివాసరావు,రెబ్బవరపు మాల్యాద్రి,బద్దిపూడి శిఖామణి,సుదర్శిశ్యామ్,పులి నాగరాజు, చనుమాల శ్రీధర్,మెండా లెనిన్,ఈదర నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

7:7.qxd 6/6/2026 11:54 PM Page 1



# నవచేతన యాప్‌పై అవగాహన




**నాగులుప్పలపాడు, జూన్ 6, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన నాగులుప్పలపాడు జడ్పీహెచ్ఎస్‌లో మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నవచేతన యాప్‌పై ఏడబ్ల్యూడబ్ల్యూలకు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో, అమ్మనబ్రోలు పీహెచ్‌సీ వైద్యులు, ఐసీడీవెస్ సూపర్‌వైజర్ పాల్గొని మాట్లాడారు. నవచేతన యాప్, 1000 రోజుల సంరక్షణ గురించి, పిల్లల్లో వచ్చే జన్యు లోపాలు, వాటి నివారణ గురించి, డీఈఐసీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడబ్ల్యూడబ్ల్యూలు పాల్గొన్నారు.



# మార్కాపురం వార్త

## శ్రీ రంగనాయక స్వామి క్షేత్రంలో ఘనంగా ప్రత్యేక పూజలు





**రాచర్ల, జూన్ 6 ప్రభాతవార్త**
మండలంలోని జెపి చెరువు నల్లమల అటవీ ప్రాంతంలో గల శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్వామివారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలోని కాపుబలిజ యాదవ కాశీనాయన యోగివేమన రెడ్ల సత్రాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

# కాలుష్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలి
- కలెక్టర్ విజయ సునీత




**మార్కాపురం, జూన్ 6, ప్రభాతవార్త**
కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఇళ్ల నుంచి వచ్చే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత సూచించారు. మార్కాపురం పట్టణంలోని బృందావనం అపార్ట్మెంట్స్‌లో శనివారం నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని రకాల చెత్తను ఒకే డబ్బాలో వేయడం వల్ల భూ, జల, వాయు కాలుష్యాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా అందులోని కొంత భాగాన్ని సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించవచ్చని తెలిపారు. భావితరాల భవిష్యత్తును కాపాడాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలను ప్రజలందరూ విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలు నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రభుత్వ సూచనలను పాటించి ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకే తొలి ప్రాధాన్యత

- మార్కాపురం జిల్లా పోలీసులకు హోం మంత్రి అనిత ఆదేశం
- గంజాయి నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- అంబేద్కర్ విగ్రహావిష్కరణకు భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**మార్కాపురం జిల్లా, జూన్ 6, ప్రభాతవార్త**
మహిళలు, బాలికల భద్రత మరియు రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీసు అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పోలీసు అధికారులతో కనిగిరిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా భౌగోళిక పరిస్థితులు, పోలీసు పరిపాలనా విభజన, శాంతిభద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించిన మంత్రి, మహిళలపై జరుగుతున్న నేరాల్లో 17 శాతం తగ్గుదల సాధించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణలో సమర్థవంతమైన చర్యలు చేపట్టిన జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు పనితీరును అభినందించారు. మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపట్టాలని, పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి న్యాయం అందించాలని సూచించారు. ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర నియంత్రణలో మరింత విస్తృతంగా వినియోగించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని, సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేసి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో శిక్షల శాతం పెరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేసినట్లు, శక్తి టీమ్స్, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తూ, పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితుల అరెస్టులో కూడా పురోగతి సాధించామని వివరించారు. అంతకుముందు కనిగిరిలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.





# వెలిగొండ వెలుగుల నేలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అడుగులు

- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడి



**మార్కాపురం టౌన్, జూన్ 6, ప్రభాతవార్త**
నల్లమల నడుమ ప్రకృతి పరిమళాలు వెదజల్లే నేల..వెలిగొండ జలాలతో భవిష్యత్తు వెలుగులు నింపుకునే నేల..చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికత, వ్యవసాయ సంపదల సంగమంగా వెలుగొందుతున్న నేల.. అదే మార్కాపురం జిల్లాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అడుగిడుతున్నారని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి ఆకాంక్షల నేలపై మాధవ్ అడుగుపెట్టడం జిల్లాకు శుభపరిణామమన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పడిన అనంతరం తొలిసారిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పీవీఎన్ మాధవ్ జిల్లాకు విచ్చేస్తుండటం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న మాధవ్ నాయకత్వం బీజేపీకి మరింత బలం చేకూరుస్తోందని కొనియాడారు. జిల్లా అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ముఖ్యంగా వేలాది మంది రైతుల జీవితాలను మార్చివేసే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, కేంద్ర ప్రభుత్వ సంస్థల పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మార్కాపురం జిల్లా అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ పీవీఎన్ మాధవ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల బీజేపీ మార్కాపురం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పీవీ కృష్ణారావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు పీవీఎన్ మాధవ్‌జిల్లాకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై బీజేపీ బలాన్ని చాటాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. మార్కాపురం జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, రైతుల సంకల్పాలకు ప్రతీకగా నిలిచే నూతన యుగానికి ఈ పర్యటన నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

- పాల్గొన్న దామచర్ల సత్య



**టంగుటూరు, జూన్ 6, ప్రభాతవార్త**
కనిగిరిలో శనివారం నిర్వహించిన భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక సమరయోధుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కేంద్ర ఆహార శుద్ధిపరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్, జోనల్ కో- ఆర్డినేటర్ దామచర్ల సత్య పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**టంగుటూరు, జూన్ 6, ప్రభాతవార్త**
టంగుటూరులోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మద్దిరాల కిరణ్ కుమార్, శశికళ కుమారుడు మద్దిరాల నాగ ప్రజ్వత్ జన్మదిన వేడుకల సందర్భంగా యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనాధలకు, ఒంటరి వృద్ధులకు, మానసిక వికలాంగులకు, నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, ఇత్తడి వినయ్, గరికముక్కల మూర్థ, కొమ్ము బుజ్జి, కొమ్ము అనిల్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం
# అమలులో నాణ్యత పాటించాలి

**సీఎస్‌పురం, జూన్ 6, ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో కుకింగ్ ఏజెన్సీలు జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఈవో ఎం.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కుకింగ్ ఏజెన్సీల మహిళలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు డిప్యూటీ డీఈవో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమలులో లేనంత నాణ్యమైన మెనూ మన రాష్ట్రంలోనే అమలవుతుందన్నారు. వారానికి ఐదు కోడిగుడ్లు, చిక్కీలు, రాగి జావతో పాటు రోజుకొక మెనూ అమలు చేస్తున్నామన్నారు. పరిశుభ్రమైన ప్రాంతంలోనే విద్యార్థులకు ఎండీఎం అమలు చేయాలని సూచించారు. వంట చేసే ప్రాంతం విద్యార్థులు తినే ప్రాంతం చాలా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పోషకాహార లోపం లేకుండా చూడాలన్నారు. కుకింగ్ ఏజెన్సీల మహిళలు చాలా పరిశుభ్రంగా ఉండేలా భోజనం పిల్లలకు అందించాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో ఎంఈఓలు జే.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, సిబ్బంది దీప్తి, ప్రవీణ్ కుమార్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.



## పేకాట శిబిరంపై దాడి



**నాగులుప్పలపాడు, జూన్ 6, ప్రభాతవార్త**
మండలంలోని తిమ్మసముద్రం గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహించినట్లు సమాచారం రావడంతో నాగులుప్పలపాడు ఎస్సై బీబీ మహేంద్ర తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.21,020 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 5 బైకులనుస్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు. ఎవరైనా పేకాట, ఇతర జూదాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేంద్ర హెచ్చరించారు.

## 10న సర్వసభ్య సమావేశం

**కంభం, జూన్ 6 ప్రభాతవార్త**
స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఎంపిపి అధ్యక్షతన ఈనెల 10వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు కంభం మండల సర్వసభ్య సమావేశం జరుగునని ఎంపీడీవో వీరభద్ర చారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణనీటిసరఫరా, పారిశుధ్యం, పౌర సరఫరాల శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ ఇంకాపలు శాఖలపై సమీక్ష సమావేశం జరుగుతుందని, మండలస్థాయి అధికారులు, జడ్పిటిసి, ఇతర ప్రజాప్రతిని ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

## కంభంలో ఏఐ ఆధారిత స్క్రీనింగ్‌పై మండల స్థాయి శిక్షణ



**కంభం, జూన్ 6 ప్రభాతవార్త**
కంభంలోని స్థానిక ప్రభుత్వ కళాశాలలో శనివారం ఆరు సంవత్సరాలలోపు పిల్లల కోసం రూపొందించిన ఏఐ ఎనేబుల్డ్ ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్‌పై మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఈఓ అబ్దుల్ సత్తార్ పాల్గొని మాట్లాడుతూ ఈ సందర్భంగా చిన్నారుల అభివృద్ధి దశలను, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించడం లక్ష్యంగా ఈ శిక్షణలో అంగన్ వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ కుమారి, సూపర్‌వైజర్ గాలెమ్మలు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణా తరగతులు

- పాల్గొన్న ఎంఈఓలు





**యర్రగొండపాలెం, జూన్ 6, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని మధ్యాహ్న భోజన కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులకు టాటా ట్రస్టు వారి ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా జరిగింది. ఒక్క రోజు శిక్షణ తరగతులకు ఎంఈఓలు ఆంజనేయులు, మల్లు నాయక్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కార్యక్రమాలు పాటించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు తయారు చేయాలని, యూనిఫామ్ యాప్రాన్, తలకు క్యాప్ వాడాలని సూచించారు. వంట పాత్రల పరిశుభ్రత చాలా ముఖ్యమని, మూతలు ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలియజేశారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వాహకులు వండిన వంటలను రుచి చూడాలని తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలను ఆరగించి తగు సూచనలను అందించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, పిల్లలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాఠశాలకు హుషారుగా వచ్చి చదువుకోగలుగుతారని, మెనూ ప్రకారం భోజనాలు రుచికరంగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలతో పాటు నిర్వాహకులు, టాటాట్రస్టు వారు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

# పేదల ఇంటి కల సాకారం.. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

- మంత్రి స్వామి, దామచర్ల సత్య





**పొన్నలూరు, జూన్ 6, ప్రభాతవార్త**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా పూర్తి చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శనివారం మండలంలోని చెన్నిపాడు గ్రామంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ చెన్నిపాడు గ్రామంలోని పేదలకు ఇళ్ల పట్టాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే కృషి చేస్తుండగా కొందరు కోర్టులను ఆశ్రయించి ఆటంకాలు కల్పించారని, చివరకు పేద ప్రజలే విజయం సాధించారని అన్నారు. సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు 164 కోట్ల నిధులు కేటాయించి టెండర్ దశకు తీసుకొచ్చామని తెలిపారు. అలాగే 3.24 కోట్లవ్యయంతో సంగమేశ్వర దేవస్థానాన్ని పునర్నిర్మిస్తున్నామని వెల్లడించారు. మండలంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగాయని అన్నారు. గతంలో పేదలకు ఒకటిన్నర సెంటు స్థలం మాత్రమే ఇచ్చారని, ప్రస్తుతం మూడు సెంట్ల విస్తీర్ణంలో స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేస్తున్నామన్నారు. కొత్త కాలనీలకు విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు ఇస్తే ఏడాది తరువాత గొడ్డలి పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని వారికి అధికారులే సమాధానం చెబుతున్నారని ఎద్దేవ చేశారు. టీచర్లకు సీపీఎస్ రద్దు, ఇద్దరి పిల్లలకు డబ్బులు ఇస్తామని ఒకరికే ఇచ్చిన వారు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు. అదేవిధంగా దామచర్ల సత్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. చెన్నిపాడు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ మంత్రి స్వామి కృషితో పేదల సొంత ఇంటికల నెరవేరుతోందన్నారు. సంగమేశ్వరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి టెండర్ దశకు తీసుకురావడంలో మంత్రి పాత్ర కీలకమని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లు వేగంగా అమలవుతున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు జరగలేదని విమర్శించారు. రానున్న మూడు సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను పూర్తి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీలను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంపిడివో డాక్టర్ సుజాత, మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మండల పార్టీ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, మండవ మురళీమోహన్, తానికొండ మహేంద్ర, దాసరి కృష్ణారావు, గుమ్మళ్ల వెంకటరావు, పల్లపోతు ప్రసాద్, మన్నెం మల్లికార్జున, వడ్డే మాల్యాద్రి, దాసరి తిరుపతయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# వేసవిలోనూ తీరుతున్న దాహార్తి

- ఇంటింటికి తాగునీటి సరఫరాతో గ్రామ ప్రజలు హర్షం









**పెద్దదోర్నాల, జూన్ 6, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం బోడే నాయక్ తండలో మండుతున్న ఎండల మధ్య కూడా తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందుతుంది. తండాలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాల ద్వారా ప్రతి ఇంటికి ప్రతి బజారుకు కుళాయి కనెక్షన్లు అందుబాటులో ఉండటంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇటువైపు అటువైపు తొట్లు నిర్మించి పశువులకు కూడా సమృద్ధిగా నీరు అందిస్తున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉన్నప్పటికి గ్రామంలో తాగునీటి కొరత లేకపోవడం విశేషం. గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా పనిచేయడంతో మహిళలు, వృద్ధులు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇచ్చి ఇంటింటికి కుళాయి కనెక్షన్లు కల్పించాలని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి బజార్‌కు నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవడంతో ప్రస్తుతం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని వినియోగిస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కారమవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఎప్పుడో మరమ్మత్తులకు గురైన నీళ్ల ట్యాంక్ ఉంది. దాని మరమ్మత్తులకు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే గ్రామంలో అదనపు వసతి కలుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తాగునీటి పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని, బోడే నాయక్ తండ ఇందుకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

ong-8_ong-8.qxd 6/6/2026 11:07 PM Page 1



## గ్రంధాలయంలో ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

**సంతనూతలపాడు, జూన్ 6, ప్రభాతవార్త**



సంతనూతలపాడులోని శాఖా గ్రంధాలయంలో శనివారం నాడు ఘనంగా వేసవి విజ్ఞాన తరగతులు ముగిశాయి. విద్యార్థులకు గత నెల 28వ తేదీ నుండి ఈనెల 6వ తేదీ వరకు 26 రోజులు పాటు విద్యార్థులకు వివిధ రంగాల పట్ల తెలియజేశారు. గ్రంధపాలకుడు కే.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. పి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులచే దేశభక్తి గీతాలు ఈ సందర్భంగా ఆలపించారు. కథలు చదవడం, చెప్పడం, రాయడం, క్యారమ్స్, చెస్, లూడో, స్నేక్స్ అండ్ లాడర్స్ తదితర ఆటలు ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానాన్ని సృజనాత్మకతను, ఆలోచనశక్తిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టినట్లు గ్రంధపాలకులు కే.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులకు వివిధ రంగాలపై శిక్షణ ఇచ్చిన పి.శివరామకృష్ణను గ్రంధపాలకుడు సత్యనారాయణ ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ

**సంతనూతలపాడు, జూన్ 6, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాడు మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చిన్నారుల అభ్యున్నతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నవచేతన యాప్ ఈసీడీ స్క్రీనింగ్‌కు సంబంధించి 0-6 సంవత్సరాల లోపు పిల్లలకు వివిధ రంగాలకు సంబంధించి వారి అభ్యున్నత నిమిత్తం స్కీనింగ్ పరీక్షలకు గాను అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల అభ్యున్నతకు అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేకంగా పాటుపడాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంపీపీ బుడంగుంట విజయ తమ తమ ప్రసంగాల్లో కోరారు. ఈ శిక్షణ ద్వారా చిన్నారులను అన్ని విధాల అభివృద్ధి పరచాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సావిత్రి, సీహెచ్ నాగరాజా, జి.జ్యోతి, జి.పద్మావతి, పీహెచ్‌ఎన్ ప్రభావతి, సీహెచ్‌ఓ మాధవరావు, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. మొదట ఎంపీడీవో సురేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన గావించారు.

## మన డబ్బులు మన లెక్కలపై సంతనూతలపాడులో ర్యాలీ

**సంతనూతలపాడు, జూన్ 6, ప్రభాతవార్త**



సంతనూతలపాడు కేంద్రంలో శనివారం నాడు మన డబ్బులు-మన లెక్కలపై వెలుగు శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కారక్యక్రమానికి మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు అధ్యక్షత వహించారు. ముఖ్యంగా సూపర్ నారి యాప్‌పై ప్రతి ఒక్క గ్రూపు మహిళకు అవగాహన కల్పించాలని మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వెలుగు సిబ్బంది, వీఓఏల ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలో ప్రతి ఒక్క గ్రూపు సభ్యులకు సూపర్ నారి యాప్ డౌన్లోడ్ చేసి పొదుపులు, రుణాలు, వారి స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకొనే విధంగా అవగాహన కల్పించాలని ఆయన కోరారు. వెన్నెల, చందమామ, సాయిబాబా, దివ్య స్నేహిత వీవోలో జరుగుతున్న కార్యక్రమానికి హాజరై యాప్ అవసరాన్ని ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ సీహెచ్ శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది, వీఓఏలు, సూపర్ నారీ సభ్యులు పాల్గొన్నారు.

## మాలకొండ దేవస్థానం అధికారిగా పి. శ్రీనివాసులురెడ్డి

**వలేటివారిపాలెం. జూన్ 6, ప్రభాతవార్త**



మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం డిప్యూటీ కమీషనర్‌గా పి. శ్రీనివాసులు రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెంచలకోన పెనిశిల లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం అధికారిగా పనిచేస్తూ మాలకొండకు బదిలీపై వచ్చారు. మాలకొండలో డిప్యూటీ కమీషనర్‌గా పనిచేస్తున్న ఎస్.చంద్రశేఖర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం శ్రీశైలంకు బదిలీఅయ్యారు.

## మాలకొండ ఆదాయం రూ.15,03,690

**వలేటివారిపాలెం, జూన్ 6, ప్రభాతవార్త**



మండలంలోని మాలకొండ శ్రీ లక్ష్మీనరసింహా స్వామికి శనివారం భక్తుల ద్వారా రూ. 15,03,690లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరానికి రూ.7050, కుంకుమార్చన రూ.20,200,తలనీలాలకు రూ.77,775 ,వాహనాలపూజలకు రూ. 4120, ప్రత్యేక దర్శనాలకు రూ.4,17,500 స్థలపురాణం పుస్తకాల అమ్మకాలకు రూ. 200,రూము అద్దెలకు రూ. 30,860, కవర్లకు రూ. 13,000,లడ్డు ప్రసాదానికి రూ. 3,34,900,అన్నదానానికి 567737,విరాళాలు రూ.30348 ద్వారా వచ్చినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

## ఆటిజంపై అంగన్వాడీలకు అవగాహన

**బల్లికురవ జూన్ 6( ప్రభాతవార్త)**



చిన్నారులలో ఆటిజం లక్షణాలు గుర్తించడంపై మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు శనివారం స్థానిక విద్యా వనరుల భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిడిపిఓ సుధా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులలో ఆటిజం లక్షణాలను గుర్తించవచ్చని, తద్వారా తల్లిదండ్రులలో అవగాహన కల్పించి విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందే విధంగా కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు. వైద్యాధికారి రవితేజ మాట్లాడుతూ 18 నుండి 24 నెలల వయసులోనే చిన్నారులలో ఆటిజం లక్షణాలను గుర్తించగలుగుతామన్నారు. పిలిచిన పలకక పోవటం, కంటిచూపు కలపకపోవడం, తోటి పిల్లలతో కలవకపోవటం లాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. ఆటిజం లక్షణాల వల్ల చిన్నారులు ఇతరులతో తమ భావోద్వేగాలను పంచుకోటంలో ఇబ్బంది పడతారన్నారు. ప్రత్యేక అవసరాల చిన్నారులను చిన్నచూపు చూడకుండా వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సలోమి ,విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## సజ్జలను కలిసిన మైనారిటీ సంఘ నేతలు

**బల్లికురవ జూన్ 6( ప్రభాతవార్త)**



వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డిని షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో మండల మైనార్టీ సంఘ నేతలు కలిశారు. శనివారం తాడేపల్లిలో జరిగిన రాష్ట్ర మైనార్టీ విభాగ సమావేశానికి వీరు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రత్యేక వినతి పత్రాన్ని వీరు అందజేశారు.

## అంధకారంలో బల్లికురవ మండల కేంద్రం

**బల్లికురవ జూన్ 6( ప్రభాతవార్త)**



రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇలాఖలో, బల్లికురవ మండల కేంద్రంలో ప్రతిరోజు అనధికార విద్యుత్ కోత కొనసాగుతుంది. శనివారం సాయంత్రం గంటకుపైగా విద్యుత్ కోత విధించడం తో మండల కేంద్రం గాఢాంధకారంలో మునిగిపోయింది. విద్యుత్ లైన్ల మరమ్మత్తులను సాకుగా చూపుతూ అధికారులు సమస్యలను దాటవేస్తూ ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారు. గత 15 రోజులుగా మండల కేంద్రమైన బల్లికురవలో వీధిలైట్లు వెలగడం లేదంటే అధికారుల పనితీరు ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రధాన రహదారిలో వీధిలైట్లను ఏర్పాటు చేసి, గ్రామం లోని ప్రతి వీధి దీపాలు మరవడంతో, నడిచేటప్పుడు అంధకారాన్ని గ్రామస్తులు అలవాటు చేసుకు న్నారు. ప్రచండ భానుడి ప్రతాపం కారణంగా ,తీవ్రమైన తాపానికి విష సర్పాలు సైతం రోడ్లపై చేరుతున్నాయి. చీకట్లో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గోశాలకు దానా వితరణ

**అద్దంకి, జూన్ 6, ప్రభాతవార్త :**



రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఎంఆర్‌ఎఫ్ షోరూమ్ వెనుక వైపు గల హరిహరగోశా లనకు గోవులకు దానా నిమిత్తం తొమ్మిది వేల రూపాయలు వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ట్రస్ట్ చైర్మన్ చుండూరి మురళి సుధాకర్ రావు, రోటరీ ప్రెసిడెంట్ బాచిన సోదర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, సంధి రెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, ఊటుకూరు రామకోటేశ్వరరావు, గూడా మహాలక్ష్మి రెడ్డి, కరి రామయ్య, పువ్వాడ రామకోటేశ్వరావు, గోశాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## బంగూర్ నాణ్యతలో మేటి

**అద్దంకి , జూన్ 6, ప్రభాతవార్త :**



బంగూర్ సిమెంటు నాణ్యతలో మేటి అయ్యిందని టెక్నికల్ ఇన్‌చార్జి రమేష్ పేర్కొన్నారు. రాఘవేంద్ర ట్రేడర్స్ అధినేత పరమేశ్వరరెడ్డి, శుభాష్‌రెడ్డిల ఆధ్వర్యంలో బిల్డర్స్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అటు ఉత్తర భారతదేశంలోను, దక్షిణ భారతదేశంలోను సిమెంటు రంగంలో బంగూర్ అగ్రగామిగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిల్డర్స్, కాంట్రాక్టలు, పాల్గొన్నారు. కంపెనీ మేనేజర్ ప్రతాప్ తదితరులు హాజరు అయ్యారు.

## జయలక్ష్మికి పలువురు నివాళి

**అద్దంకి, జూన్ 6, ప్రభాతవార్త**




కూనం జయలక్ష్మి ఇటీవల మృతిచెందగా, ఆమె దశదిన కార్యక్రమం అభినంద్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు హాజరు అయ్యి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వీరిలో బాపట్ల జిల్లా వైసిపి రైతు విభాగ అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి, మణికేశ్వరం సొసైటీ మాజీ అధ్యక్షులు సోమా శ్రీనివాసరెడ్డితో పాటు జయలక్ష్మి కుటుంబసభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

## ముఖమండపానికి డాక్టర్ దుర్గాప్రసాద్ లక్ష విరాళం

**అద్దంకి, జూన్ 6, ప్రభాతవార్త :**



శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామివారి రాతి ముఖమండప నిర్మాణానికి అద్దంకి వాస్తవ్యులు పోతురాజు గండి వద్ద గల కళ్ళ హాస్పిటల్ డాక్టర్ కుందుర్తి శివ దుర్గాప్రసాద్ వారి ధర్మపత్ని శైలజ లు 1,00,116రూపాయలు విరాళం స్వామివారి దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకర్ రావుకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి చిత్రపటం, శేష వస్త్రం, స్వామివారి ప్రసాదం అర్చకులు సుదర్శనం సీతారామాంజనేయులు అందజేశారు. శనివారం పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో సింగరకొండకు తరలివచ్చారు. వాహన పూజలు, ఆకుపూజలతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. అదే విధంగా నిత్యాన్నదానానికి చీమకుర్తి మండలం చంద్రపాడు వాస్తవ్యులు కంచి సీతారామరెడ్డి, ధర్మపత్ని రామాంజమ్మలు రు.10116లను విరాళముగా అందజేశారు.

## సాగర్‌బాబుకు చింతలపూడి పరామర్శ

**బల్లికురవ, జూన్ 6, ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదంలో గాయపడి నరసరావుపేటలోని వివేకానంద సూపర్ స్పెషాల్టీ హాస్పటల్‌లో కంభంపాటి సాగర్ చికిత్స పొందుతుండగా, అద్దంకి వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ శనివారం పరామర్శించారు.ఆయన వెంట ఆయ్యప్పరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితులు వున్నారు.

## బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టు అక్రమం : డాక్టర్ చింతలపూడి

**అద్దంకి, జూన్ 6, ప్రభాతవార్త :**



వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టు అక్రమమని అద్దంకి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ అరెస్ట్ జరిగిందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు వ్యక్తిత్వాన్ని, ఆయన రాజకీయ ప్రస్థానాన్ని కొనియాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, స్వయంకృషితో అంచలంచెలుగా ఎదుగుతూ, ప్రజాసేవే పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చిన మహోన్నత వ్యక్తి బొల్లా బ్రహ్మనాయుడు అని ఆయన అన్నారు. వ్యాపారవేత్తగా ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఆయనపై ఇలాంటి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అన్నారు.

## చందలూరు గంగవరం బీటీ రోడ్డు ప్రజలకు అంకితం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**జె.పంగలూరు, జూన్ 6, ప్రభాతవార్త**



మండలంలోని చందలూరు గ్రామంలో చందలూరు నుంచి గంగవరం వరకు రూ.2 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి గొట్టిపాటి శనివారం ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధి, రవాణాకు, ప్రయాణాలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తారు రోడ్లను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుంటుందన్నారు. అనంతరం చందలూరు సెంటర్లో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తాసిల్దార్ పి. సింగారావు, ఎంపీడీవో కె. స్వరూప రాణి, ఎంఈఓ జి. వీరాంజనేయులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు కరి వెంకట సుబ్బారావు, చింతల సహదేవుడు, రావు రమేష్ బాబు, బురెడ్డి ఓబుల్ రెడ్డి, గుర్రం శేఖర్, కొమ్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నార్నె సుబ్బారావు, బత్తుల వెంకట్రావు, గరిమిడి జగన్మోహన్రావు, ఇనికిపాటి శ్రీనివాసరావు, పూనాటి సింగర్, గొట్టిపాటి కాజా, అల్లమనేని బ్రహ్మానంద స్వామి, ఎస్సై వినోద్ బాబు, కూటమి నేతలతో పాటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పాల్గొన్నారు.

## బొప్పూడి వెంకయ్య చిత్రపటానికి చింతలపూడి నివాళులు

**జె.పంగులూరు, జూన్ 6, ప్రభాతవార్త**



బొప్పూడి వెంకయ్య మృతి చెందటం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరంలోటని అద్దంకి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో బొప్పూడి వెంకయ్య పెద్ద కర్మకు శనివారం ఆయన హాజరై వారి చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను అశోక్‌కుమార్ పరామర్శించి మరణాన్ని గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైకాపా బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ పులికం కోటిరెడ్డి, నాయకులు జంపాని రవిబాబు, హరిబాబు, కరణం ఆంజనేయులు, స్వయంపు సురేష్, పురుషోత్తం, బొప్పూడి వెంకన్న బాబు, రాయిని స్టాలిన్, బుల్లి రెడ్డి, సంది పోగు రవీంద్ర పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు మొక్కలు దోహదం

**దర్శి, జూన్ 6, ప్రభాతవార్త**



ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా దర్శి పట్టణం, పొదిలి రోడ్డులోని 6వ వార్డులోని అమృత సాయి శ్రీ అపార్టుమెంట్‌లో ప్రజానీకంతో మాట్లాడి.. మొక్కలు నాటి, సమస్యలు అడిగి తెలుసుకున్న దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్రంలో పట్టణాలు, నగరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం చేపట్టిన బృహత్తర కార్యక్రమం ఆపరేషన్ క్లీన్ స్వీప్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వారి సంరక్షించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మానవ మనుగడకు మొక్కలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మున్సిపల్ కమీషనర్ కే.అర్జున్‌రావు, వైస్ చైర్మన్ తలారి కోటయ్య, గర్నిపూడి స్టీవెన్, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, ఆరవ వార్డులోని టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## ఎన్నెస్పీ సమ్మర్ స్టోరేజ్ చెరువుని పరిశీలించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, జూన్ 6, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలోని శివరాజ్ నగర్ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ చెరువును శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, దర్శి డిప్యూటీ ఎంపీడీవో ఏ.సుధాకర్, దర్శి పట్టణం టీడీపీ అధ్యక్షులు చిన్నా, స్థానిక నాయకులు ఉన్నారు.

## ఆదర్శ జీవి చంద్ర రాజేశ్వరరావు

- సీపీఐ దర్శి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఆర్.కరుణానిధి

**దర్శి, జూన్ 6, ప్రభాతవార్త**



కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు జీవితం ఆదర్శప్రాయమని సీపీఐ దర్శి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఆర్.కరుణానిధి అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. ముందుగా సీఆర్ చిత్రపటానికి సీపీఐ దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ జమీందారి వంశంలో జన్మించి చదువుకునే రోజుల్లోనే కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రామారావు, సీపీఐ సీనియర్ నాయకులు జనరాజుపల్లి యలమంద, ఏఐటీయుసీ నాయకులు వెంకటేశ్వర్లు, నరసింహారావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అపార్టుమెంట్ వాసులతో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాటమంతి

**దర్శి, జూన్ 6, ప్రభాతవార్త**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును స్ఫూర్తిగా తీసుకొని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి పట్టణంలోని 6వ వార్డులో సైకిల్‌పై పర్యటించారు. నా దేశం నా బాధ్యతగా ప్రతి ఒక్క పౌరులు పర్యావరణాన్ని ఆరాధిస్తూ ఇంధన పొదుపును పాటించాలని పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు పర్యావరణ పరిరక్షణ ప్రజల్లో చైతన్యం కలిగించారు. స్థానికులతో మాట్లాడుతూ.. నా కుటుంబ సభ్యులతో కలుసుకున్నట్లు అనిపిస్తుందని, మీరే నా బంధువులు మీరు నన్ను ఒక ఆడ బిడ్డగా మీ ఇంటికి పిలిచి ఆదరిస్తున్నారు, అభిమానిస్తున్నారు, ఇదే స్ఫూర్తితో దర్శిలో ప్రతి వార్డులో ప్రతి ఇంటికి వెళ్తానని, ప్రతి ఒక్కరి సమస్య తెలుసుకుంటానని డాక్టర్ గొట్టిపాటి అన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించాలని కోరారు.

## మధురకవి విగ్రహ స్థాపనకు కృషి

**చీమకుర్తి, మే 6, ప్రభాతవార్త**



చీమకుర్తి పట్టణ సాంస్కృతిక చిహ్నంగా గుర్తింపు పొందిన మధురకవి మలవరపు జాన్ మాస్టారు విగ్రహ ప్రతిష్టకు అందరూ సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ప్రముఖ పద్యకవి, అభినవ బాణ, కవిభూషణ, సువర్ణ కంకణ విభూషిత, భాషా ప్రవీణ వారు గుర్తింపు తెచ్చుకున్నారని సభ్యులు వెల్లడించారు. మల్లవరపు జాన్ గారి శత జయంత్యోత్సవాలు (19272027) పురస్కరించుకుని చీమకుర్తి పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ మల్లవరపు జాన్ విగ్రహ స్థాపన కమిటీ ప్రతినిధులు చీమకుర్తి పట్టణ మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్యకు మరియు మండల డిప్యూటీ తహసిల్దార్ కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ముప్పూరు చలమయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాట్రగడ్డ రమణయ్య, యూనిట్ ఇన్‌చార్జులు యడ్లపల్లి రాంబ్రహ్మం, గొల్లపూడి కోటేశ్వరరావుతో పాటు విగ్రహ స్థాపన కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ బి. జవహర్, అధ్యక్షులు తప్పెట ఇస్సాకు, ఉపాధ్యక్షులు మల్లవరపు కోటేశ్, కార్యదర్శి వై. విజయ్ కుమార్, సహ కార్యదర్శి మల్లవరపు బాలు, ట్రెజరర్ అత్యాల దావీదు మరియు కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల గంగయ్య, తప్పెట బాబూరావు, మట్టిగుంట రామాంజనేయులు, బూదాల యలమంద బాబు, కర్ణ ప్రసాద్, నల్లమల మాణిక్యం పాల్గొన్నారు


## ఖతార్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఖతార్ దేశంలోని దోహా నగరంలో హోమ్‌కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం నర్సింగ్ అర్హతతో పాటు రిజిస్ట్రేషన్ అనంతరం కనీసం రెండేళ్ల అనుభవం కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 5,250 ఖతార్ రియాల్స్ (సుమారు రూ.1.30 లక్షలు) వేతనం అందించనుండగా, ఉచిత వసతి, వైద్య సేవలు, రవాణా సౌకర్యం, వీసా, విమాన ప్రయాణ ఖర్చులను యజమాని భరిస్తారని వెల్లడించారు. అదనంగా సంవత్సరానికి 20 రోజుల సెలవు కూడా కల్పించబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రయాణికుల భద్రతే లక్ష్యం..ఆటోలకు ప్రత్యేక స్టిక్కర్లు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలో ఆటో రిక్షా ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక గుర్తింపు స్టిక్కర్ల అమలు కార్యక్రమాన్ని పోలీసులు వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంపై ఆర్ఎస్ఐ సుబ్బా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఆటోకు ప్రత్యేక సీరియల్ నంబర్‌తో కూడిన స్టిక్కర్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నా, ఫిర్యాదులు చేయాల్సి వచ్చినా లేదా విలువైన వస్తువులు పోగొట్టుకున్నా సంబంధిత ఆటోను సులభంగా గుర్తించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. స్టిక్కర్లు లేని ఆటోలు, పోలీసు శాఖ వద్ద రికార్డులు నమోదు చేయించని వాహనాలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రికార్డులు నమోదు చేయించకుండా వాహనాలు నడిపే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఎస్ఐ సుబ్బా ప్రసాద్ హెచ్చరించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఎస్ఐలు శ్రీనివాసరావు, కోటయ్యతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి

**దర్శి, జూన్ 6,ప్రభాతవార్త**

ఎస్ఐఆర్ పై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ మెంబర్ పత్తి రవిచంద్ర అన్నారు. శనివారం దర్శి పార్టీ ఆఫీసులో దర్శి పట్టణ, మండల బీఎల్‌ఏలకు ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ జూన్ 15వ తేదీ నుంచి ఎస్ఐఆర్ జరుగుతుందని, ప్రతి ఒక్క బీఎల్‌ఏ ఇంటింటికి వెళ్లి బీఎల్‌ఓతో కలిసి పని చేసి మన ఓట్లను తీసి వేయకుండా చూసుకోవాలని, డబల్ ఓటర్లను చనిపోయిన వారి ఓట్లను తీసి వేయాలని అన్నారు.

7-6Pg7exHMNWJQE.qxd:7-6Pg7exHMNWJQE.qxd 1/1/02 7:41 AM Page 1



## మరో ఐదు సంఘాలకు ఒడి సౌకర్యం

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో ఐదు సంఘాలకు అదర్ డ్యూటీ(ఒడీ) సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జెఎస్‌సీ)లో రొటేషన్ బేసిస్‌లో సభ్యత్వం ఉన్న సంఘాల అధ్యక్షులకు 2026 సంవత్సరానికి అదర్ డ్యూటీ(ఒడీ) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (రాష్ట్ర స్థాయి) లో సభ్యుల అధ్యక్షులకు రొటేషన్ పద్ధతిలో 2026 క్యాలెండర్ సంవత్సరానికి అదర్ డ్యూటీ(ఒడీ) సౌకర్యం కల్పిస్తూ సాధారణ పరిపాలన (సేవలు, సంక్షేమం) శాఖ జి.ఓ.ఆర్.టి.నెం.799ను జారీ చేసింది. గుర్తింపు లభించే వరకు, తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (రాష్ట్ర స్థాయి)లో 2026 క్యాలెండర్ సంవత్సరానికి 5 సంఘాల అధ్యక్షులకు రొటేషన్ పద్ధతిలో ఒడీ సౌకర్యాన్ని కల్పించారు. అందులో డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్ల సంఘం (టిజిటిఏ), తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుఎస్), పాఠశాల ఉపాధ్యాయుల సమాఖ్య (ఎస్‌టిఎఫ్), ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(జిజేఎల్ఏ) సంఘాలకు ఒడీ సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## మంత్రుల ప్రాంగణ సముదాయం వద్ద పిడిఎస్‌యు ఆందోళన

### మంత్రి తుమ్మల కారును అడ్డగించిన విద్యార్థులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 6, ప్రభాతవార్త:** పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ బంజారాహిల్స్‌లోని మంత్రుల ప్రాంగణ సముదాయం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలోనే అటుగా వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కారును అడ్డగించడం తో ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఫీజుల వ్యవహారంలో పీడీఎస్‌యూ మంత్రుల ప్రాంగణ సముదాయ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ పోలీసులు ముందస్తుగా ఇక్కడ పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి అనీల్ ఆధ్వర్యంలో దాదాపు 40 మందికి ఇక్కడికి చేరుకొని ముట్టడికి యత్నించారు. పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో సముదాయం నుంచి బయటకు వస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కారును అడ్డుకొనేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే పీడీఎస్‌యూ విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అనీల్‌తోపాటు మరో 38 మందిని అరెస్ట్ చేసి ఫిల్మ్‌నగర్, ఎస్సార్‌నగర్ ఠాణాలకు తరలించారు.



బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌తో సమావేశమైన ఎంపి ఆర్.కృష్ణయ్య

## లోపభూయిష్టమైన రోస్టర్ విధానాన్ని సవరించాలి

### జాతీయ బి.సి. సంక్షేమ సంఘం

### బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌తో బి.సి. నాయకుల చర్చలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన ఉద్యోగ నియామకాల కోసం ప్రవేశపెట్టిన కొత్త రోస్టర్ విధానం లోపభూయిష్టంగా, అశాస్త్రీయంగా ఉందని, దీనివల్ల వెనుకబడిన తరగతుల (బి.సి) అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై శనివారం జాతీయ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బి.సి. నాయకుల ప్రతినిధి బృందం బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌ను కలిసి సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ పోస్టులను భర్తీ చేసేటప్పుడు మొదటి 10 పోస్టుల వరకు కేటాయించే రోస్టర్ పాయింట్ల ఫిక్సేషన్ విధానం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. నిబంధనల ప్రకారం బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, మహిళలకు 33 శాతం సమాంతర రిజర్వేషన్లు ఉన్నప్పటికీ.. గ్రూప్1, గ్రూప్2 పోస్టులలో డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ కోటా జోనల్, జిల్లా కేటగిరీలలో విభజించినప్పుడు పోస్టుల సంఖ్య తగ్గిపోతోందని, తద్వారా ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల బీసీలకు దక్కాల్సిన పోస్టులు దక్కడం లేదని పేర్కొన్నారు. రోస్టర్ 1 నుండి 10 వరకు ఫిక్స్ చేసిన విధానంలో 10 పోస్టులు ఉన్నప్పుడు బీసీలకు 3 పోస్టులు రావాల్సి ఉండగా, కేవలం 2 పోస్టులు మాత్రమే వస్తున్నాయని, చివరన 80 నుండి 100 రోస్టర్ పాయింట్లలో బీసీలకు 4 పోస్టులు ఇచ్చి బ్యాలెన్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానంలో ఎలాంటి శాస్త్రీయ బద్ధత లేదని, దీనివల్ల దాదాపు 20 పోస్టుల వరకు బీసీలు నష్టపోయారని, వాటిపై విచారణ జరిపి బ్యాక్‌లాగ్ పోస్టులుగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్, ఎస్సీ/ఎస్టీ కమిషన్ ఛైర్మన్లతో తక్షణమే ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి, లోపాలను సరిదిద్ది నూతన రోస్టర్‌ను తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. బి.సి. నాయకుల విజ్ఞప్తిపై బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ సానుకూలంగా స్పందించారు.

## ఆర్టీసీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

### యాజమాన్యం వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి.. ఎండికి ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ)లో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని టిఎస్‌ఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్ చేసింది. సమస్య పరిష్కారం కోసం ఆర్‌టీసీ యాజమాన్యం వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టీసీ ఎండీకి వారు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 22 నుండి 24 వరకు జరిగిన సమ్మె అనంతరం ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య కుదిరిన అంగీకారాలను అమలు చేసే దిశగా చర్చలు జరపాలని వీరాంజనేయులు, వి.ఎస్.రావులు డిమాండ్ చేశారు. సమ్మె విరమణ సందర్భంగా కార్మిక సంఘాలు సమర్పించిన వినతిపత్రాలలోని అంశాలను పరిశీలించేందుకు ఆర్‌టీసీ యాజమాన్యం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీతో మే 21న జరిగిన సమావేశంలో కొన్ని అంశాలపై సానుకూల చర్చలు జరిగి, కొన్నింటిపై అంగీకారం కూడా కుదిరిందన్నారు. తదుపరి సమావేశాలు నిర్వహించకుండా ఆలస్యం జరుగుతున్నందున కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. సమ్మె విరమించి ఆరు వారాలు గడుస్తున్నప్పటికీ, అంగీకరించిన అంశాల అమలుపై స్పష్టమైన పురోగతి కనిపించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం ఇచ్చిన హామీలను గౌరవిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే చర్చలు ప్రారంభించి నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగీకరించిన అంశాల అమలులో జాప్యం కొనసాగితే కార్మికుల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని, ఇది సంస్థకు కూడా మంచిది కాదని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సంస్థ అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా

# సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

### ఏర్పాట్లను సమీక్షించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించనున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ తెలిపారు. ఈ నేపథ్యంలో సనత్ నగర్‌లో నిర్మించిన అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి శనివారం పరిశీలించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ హాస్పిటల్‌ను ప్రజలకు అంకితం చేయనున్న నేపథ్యంలో హాస్పిటల్ సంసిద్ధతపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. హాస్పిటల్‌లోని ఏ, బి, సి బ్లాకులను మంత్రి పరిశీలించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డయాగ్నస్టిక్స్, ల్యాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, వైద్య సేవల నిర్వహణ వ్యవస్థలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ ప్రారంభానికి ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యం, సెక్యూరిటీ, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేయాలని సూచించారు. ఓపీ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్కులు, ఫార్మసీ సేవలు, వెయిటింగ్ ఏరియాలను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ఈ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించగల అత్యుత్తమ వైద్య సంస్థగా టిమ్స్ నిలవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వహణ, వైద్య సేవలు, మానవ వనరులు, నాన్ మెడికల్ సర్వీసులు, భద్రత, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చేసిన అప్పుల వడ్డీలకు ప్రభుత్వ ఆదాయం చెల్లు

### నెలకు రూ.6500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం

### బిజెపితో బిఆర్ఎస్ కలవడాన్ని చంద్రబాబు ఒప్పుకోవడంలేదు: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** కెసిఆర్ హయాంలో చేసిన అప్పులకు కూడా డిప్యూటీ సిఎం భట్టి బాధపడుతున్నారనీ నెలకు రూ 6,500 కోట్లను అప్పుల మీద వడ్డీలకు చెల్లిస్తున్నామనీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆవేదన చెందారు. సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ చేసిన అప్పులు చెప్పుకోడానికి మోహం లేకనే కెసిఆర్ బయటకు రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకున్నాడనీ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవుతోందనీ, సొంత ఇంట్లో నుంచి కవిత బయటకు వెళ్లి పార్టీ పెట్టుకుందన్నారు. హరీశ్‌రావు బిజెపి వైపు చేస్తున్నాడనీ ముఖ్యమంత్రి కావాలని ఆయనకు కూడా ఉందని అన్నారు. తానే తరువాత ముఖ్యమంత్రిని అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారం చేయించుకుంటున్నాడనీ, కెటిఆర్ కూడా ముఖ్యమంత్రి అని తన అనుచరులతో అరిపించుకుంటున్నాడనీ చెప్పారు. కెసిఆర్ పోవాలి, మళ్లీ కాంగ్రెస్ రావాలని జనం కోరుకుంటున్నారనీ ఆయన వివరించారు. కెసిఆర్‌ను గతంలో పవన్ కల్యాణ్ చాలాసార్లు పొగిడాడనీ అన్నారు.

మేం ఎన్టీఆర్ విగ్రహం పెడితే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శలు చేస్తున్నాడనీ కెటిఆర్ ఎన్టీఆర్ విగ్రహం పెట్టినప్పుడు ఎందుకు మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు ఒప్పుకుంటే బిఆర్ఎస్‌తో బిజెపి కలుస్తాం అంటున్నారనీ బిజెపితో కలవడానికి చంద్ర బాబు ఒప్పుకోకపోవడం వల్లనే చంద్రబాబును బిఆర్ఎస్ టార్గెట్ చేస్తోందనీ తెలిపారు.. తెలంగాణ సెంటిమెంట్ ఇప్పుడులేదు చంద్రబాబును రేవంత్ రెడ్డికి అంటగట్టాలని చూస్తే ఉపయోగం లేదనీ అన్నారు. దేశవ్యాప్తంగా రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తోందని అన్నారు. కెసిఆర్ కుటుంబం కోసం 30 బుల్లెట్ ప్రూఫ్‌కార్లు తయారు చేయించారనీ రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లడంపైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్కసు వెళ్లగక్కుతున్నాడనీ ఆవేదన చెందారు. పాలమూరు రంగారెడ్డి కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సర్వే నిర్వ హించారనీ తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి తన భద్రతను కూడా పక్కన పెట్టారనీ, మూడు వెహికిల్స్ కాన్వాయ్ లో ప్రయాణం చేస్తున్నారనీ తెలిపారు. సింగరేణి బొగ్గు నిల్వలపై హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలనీ కోరారు. బిఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులను అణిచివేశారనీ పదవి పోగానే ఆర్టీసీ, సింగరేణి , కాళేశ్వరం గుర్తుకు వస్తున్నాయనీ ఎద్దేవా చేశారు.

# ఇసుక ఆదాయాన్ని పెంచాలి

### అక్రమ తవ్వకాలు, రవాణాపై పటిష్ట నిఘా ఉండాలి

### టిజిఎండిసి అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి సమీక్ష సమావేశం

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడంతో పాటు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ



సచివాలయంలోని తన ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లభ్యత, ఆదాయం, ఆదాయ వృద్ధికి ఉన్న అవకాశాలు, నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, వ్యవస్థలో తీసుకు రావాల్సిన మెరుగుదలలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. అన్ని కార్యకలాపాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. లారీల కదలికలను నిరంతరం పర్యవేక్షించే బలమైన నిఘా వ్యవస్థ ద్వారా అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. టిజిఎండిసి డైరెక్టర్ అనుదీప్ దురిశెట్టి శాఖ చేపడుతున్న ఆదాయ వృద్ధి చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం, అక్రమ మైనింగ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి మంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో శాఖ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా ఆయన వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కీలక ఖనిజాలు, ఇతర ఖనిజాల అన్వేషణకు సంబంధించి కొనసాగుతున్న కార్యక్రమాలపై అధికారులు మంత్రికి నివేదిక సమర్పించారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రాధాన్యత గల అంశాలపై సమగ్ర నివేదికలను అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే సాండ్ బజార్ల పనితీరు, శాఖ నిఘా వ్యవస్థ, సిబ్బంది అవసరాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఖనిజ వనరుల సమర్థ నిర్వహణ కోసం అమలు వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతోపాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.

# రాకముందే తెరుచుకున్న లిఫ్టు డోరు!

### మహిళ మృతి, మనవడి పరిస్థితి విషమం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 6, ప్రభాతవార్త:** ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో లిఫ్టు రాకముందే డోరు తెరుచుకోవడంతో గమనించిన ఒక మహిళ కాలు వేసి ప్రాణాలు కోల్పోగా ఆమె మనవడు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఇది. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. ఆనంద్‌నగర్ కాలనీలోని భవానీ అపార్ట్‌మెంట్‌లో నివ సిస్తున్న విశాఖపట్నంకు చెందిన కె. రాధ(57) శుక్రవారం సాయంత్రం తన 15 నెలల మనవడు జాయ్‌ని ఎత్తుకొని కిందకు వెళ్లేందుకు లిఫ్టు వద్దకు వెళ్లారు. లిఫ్టు నాల్గో అంతస్థులోనే ఉందని భావించిన రాధ లిఫ్టు డోరు తీయగా అది రావడంతో లిఫ్టు ఉందని భావించిన ఆమె లోపలికి కాలు పెట్టింది. ఒక్కసారిగా మనవడితోపాటు నేరుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్టుపై పడిపోయారు.

విషయం తెలుసుకున్న అగ్నిమాపక, డీఆర్ఎఫ్, ఖైరతాబాద్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. వారిని బయటకు తీసి రాధను నిమ్స్ ఆసుపత్రికి జాయ్‌ను కేర్ ఆసుపత్రికి తరలించారు. కాగా రాధ మృతిచెందినట్లు నిమ్స్ వైద్యులు ధృవీకరించారు. జాయ్‌కు తీవ్ర గాయలవ్వగా ఆసుపత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఇదిలా ఉండగా లిఫ్టులో పడే సమయంలో మనువడి ప్రాణాలను కాపాడేందుకు ఆమె తన చేతులతో గట్టిగా పట్టుకొన్నట్లు గుర్తించామని వారిని లిఫ్టు గుంతలో నుంచి తీసిన అధికారులు తెలిపారు.



## యువత నైపుణ్యాభివృద్ధికి న్యాక్ సేవలు భేష్

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** యువతలో నైపుణ్యాభివృద్ధికి న్యాక్ అధికారగణం చేస్తున్న కృషి సంతృప్తి ఫలితాలు ఇవ్వడమే కాకుండా వారికి అత్యధిక వేతనాలు లభించే విధంగా తోడ్పడుతున్నదని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యా దపూర్వకంగా కలిసి ఆర్‌అండ్‌బి ఇంజినీర్లు విజయాలను పంచుకున్నారు. ఆర్ అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేష నల్ అకాడమీ ఆఫ్ కన్స్రక్షన్‌కు నిర్మాణ రంగంలో 'ఉత్తమ నైపుణ్యా భివృద్ధి కార్యక్రమం' విభాగంలో ప్రతిష్ఠాత్మక ప్లాటినం అవార్డు లభించిన సందర్భంగా అధికారులను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాక్ డైరెక్టర్ జనరల్, సిఇ ఆర్‌అండ్‌బి క్యూసి ఎం. శ్రీనివాసరెడ్డికి ఐఎస్‌డిఎ ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ లో ప్రభుత్వం సేవలో ఆర్ అండ్ బివిభాగంలో అత్యుత్తమ ప్రదర్శనకు గోల్డ్ అవార్డు రావడం గొప్పగా ఉందని అన్నారు..ఎన్ ఎసి బృం దాన్ని, ఎం. శ్రీనివాస రెడ్డిని అభినందిస్తూ, నిర్మాణ రంగంలో నైపు ణ్యాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, నాణ్యమైన శిక్షణ కార్యక్రమాల అమలులో ఎన్ ఎం సి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో న్యాక్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. 2025-26 సంవత్సరంలో 21,016 మందికి వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని దీనితో వారికి మంచి వేతనాలు వస్తోందని మంత్రి అన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర యువతకు మరింత మెరుగైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా న్యాక్ ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. న్యూఢిల్లీలో జూన్ 5న ప్రదానం చేసిన ఈ అవార్డులు తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి రంగానికి దక్కిన గౌరవంగా మంత్రి పేర్కొన్నారు.

## మర్పల్లిలో హోటల్ భవనం పైకప్పు కూలి నలుగురికి గాయాలు

### విచారం వ్యక్తం చేసిన మంత్రి రాజనర్సింహా

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** మర్పల్లిలో హోటల్ భవనం పైకప్పు కూలి నలుగురు గాయపడిన ఘటనపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ విచారం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న హోటల్ భవనం పైకప్పు కూలి నలుగురు గాయపడిన ఘటనలో క్షతగాత్రులను సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికీ తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు స్థానిక ప్రవేట్ ఆసుపత్రికి వెళ్లగా, మిగిలిన ఇద్దరు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితిపై డిఎంహెచ్‌వోను అడిగి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాశనమవుతోన్న విద్యావ్యవస్థ

### రూ.14వేల కోట్లు విడుదల కావాల్సి ఉంది

### ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్ష ్యంతో విద్యావ్యవస్థ నాశనమవుతుందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఇప్పటివరకు విడుదల చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా, గత ప్రభుత్వానికి సంబంధించిన రెండు సంవత్సరాల బకాయిలు, ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించిన మూడు సంవత్సరాల బకాయిలు కలిపి 2022-23, 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించిన సుమారు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటికీ విద్యార్థులకు విడుదల కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నా, గత ప్రభుత్వానికి సంబంధించిన రెండు సంవత్సరాల బకాయిలు, ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించిన మూడు సంవత్సరాల బకాయిలు కలిపి 2022-23, 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సిన అవసరం ఉంది. కానీ గత మూడు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదన్నారు. పేద విద్యార్థులు చదువుకోవడం సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి పెట్టుబడి. బియ్యం, గ్యాస్, ఇతర సంక్షేమ పథకాలు ఒకరోజు ప్రయోజనం ఇస్తాయి, కానీ విద్యపై పెట్టుబడి పెడితే ఆ విద్యార్థి భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదుగుతాడు. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో అనేక ఇంటర్మీడియట్, డిగ్రీ, ఉన్నత విద్యా కళాశాలలు సగానికి సగం మూతపడే పరిస్థితి వచ్చిందని, డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయన్నారు. రాబోయే 10-15 రోజుల్లో ప్రభుత్వం ఫీ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం ఉధృతమయ్యే అవకాశం ఉంది. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే నీట్-2026 పేపర్ లీక్

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్ సి రంగరాజ్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** కేంద్రంలో కొనసాగుతున్న నరేంద్రమోడీ ప్రభుత్వ అసమర్థతతోనే నీట్-2026 పేపర్ లీకేజీ అయిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సి రంగరాజ్ విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం నీట్, సిబిఎస్ఈ పేపర్ లీకేజి ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సి రంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్ లు మాట్లాడుతూ.. మే 3న నిర్వహించిన నీట్-2026 పరీక్షలో దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారని, నీట్ పేపర్ లీకేజీ, భారీ అక్రమాలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది కేవలం ఒక పరీక్ష వైఫల్యం కాదని, మోడీ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. పారదర్శకత, డిజిటల్, ఇండియా, అమృత కాలం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, విద్యార్థులకు కనీస భద్రతతో పరీక్ష కూడా నిర్వహించలేకపోయిందని విమర్శించారు. పరీక్ష రద్దుతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, పేద, మధ్యతరగతి కుటుంబాలు కోచింగ్, హాస్టల్, ప్రయాణ ఖర్చులతో ఆర్థికంగా కుదేలయ్యారన్నారు. 2024లో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైనప్పటికీ, అప్పట్లో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదన్నారు. అదే నిరక్ష ్యం ఇప్పుడు మరింత పెద్ద స్కాంగా మారిందని, ఇది యాదృచ్ఛికం కాదని, పరీక్షా వ్యవస్థను కోచింగ్ మాఫియా, అవినీతివలయం, కార్పొరేట్ ప్రయోజ నాలకు అప్పగించిన కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితమ న్నారు. దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)ను పూర్తిగా ప్రక్షాళన చేసి, అవినీతికి పాల్పడిన అధికారులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్-2026 పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరపాలని, కోచింగ్ మాఫియా, అధికారుల, రాజకీయ సంబంధాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వ విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

7-6Pg6exHMNWJQE.qxdo/p:7-6Pg6exHMNWJQE.qxd 1/1/02 7:44 AM Page 1





# మత్తుపదార్థాల రహిత జిల్లాగా తిరుపతి

## గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక దండయాత్ర

**తిరుపతి,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లోనే తిరుపతిజిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనుమానిత వ్యక్తులకు డ్రగ్స్ టెస్టులు నిర్వహించి, మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.

తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఈగల్ సెల్ సిబ్బంది పాల్గొని తిరుపతి నగరంలోని ఇందిరా మైదానంలో డ్రగ్స్‌పై 'దండయాత్ర' కార్యక్రమంలో భాగంగా మెగా డ్రగ్స్ టెస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులు (సస్పెక్ట్స్) నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులను ఇందిరా మైదానానికి పిలిపించి ప్రత్యేక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. వారి ప్రవర్తన, జీవన విధానం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి చట్టబద్ధమైన జీవితం గడపాలని, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు, కుటుంబ సంక్షేమం, జీవనోపాధి వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

డ్రగ్స్ టెస్టుల్లో పాజిటివ్‌గా గుర్తించిన వ్యక్తులకు చట్టపరమైన చర్యలతో పాటు కౌన్సిలింగ్ అందించి, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972 (ఈగల్),112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# స్వామి ఆశీస్సులతో విజయ్ సిఎం అయ్యారు

## తమిళనాడు సిఎం తల్లి శోభా చంద్రశేఖర్

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కృప, ఆశీస్సులతోనే తన కుమారుడు విజయ్ తమిళనాడు సిఎం అయ్యారని, ఇదీ స్వామివారిపై ఉన్న విశ్వాసమని విజయ్ తల్లి శోభాచంద్రశేఖర్ తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో తిరుమలకు వచ్చి ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నా న్నారు. ఆరోజే తనకుమారుడు విజయ్ రాజకీయప్రస్థానం విజయవంతం కావాలని స్వామి వారిని ప్రార్థించినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ దేవుని ఆశీస్సులతోనే తన కుమారుడు సిఎంగా బాధ్యతలు చేపట్టాడని ఆనందం వ్యక్తం చేశారు. శ్రీవారికి కృతజ్ఞతలు తెలియజేసి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. తమిళనాడు సిఎం తల్లి శోభా చంద్రశేఖర్ తనఅనుచరులతో కలసి శనివారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతంపలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# సేద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ,జూన్ 6, ప్రభాతవార్తప్రతినిధి:** దూరవిద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశించదల్చిన వారు ఈనెల 31వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మణి ఓ ప్రకటనలో కోరారు. జూన్ 2026 నుంచి ప్రారంభం కానున్న ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సులైన సేంద్రియ వ్యవసాయం, మిద్దెతోటలు, పుట్టగొడుగుల పెంపకం వంటి విభాగాల్లో 8వారాల పాటు నిర్వహించే ఈ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందగోరే వారు రూ. 1500 చొప్పున ఫీజు చెల్లించి జూన్ 20తేదీ లోగా వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కోర్సుల పూర్తి వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్సైట్‌ద్వారా లేదా 9441355595, 7036689346, 8096085560 నెంబర్లలో ఉదయం 9నుంచి సాయంత్రం 7గంటల మధ్య ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



# దక్షిణ కొరియా ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల భేటీ

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి మరో ముందడుగు పడింది. ప్రముఖ దక్షిణ కొరియా ఫంక్షనల్ ఫుట్‌వేర్ సంస్థ షూ ఆల్స్ ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రెండోసారి సమావేశమై కీలక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల విస్తరణ, పాదరక్షల ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై సవివరంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రివర్యులు సంస్థ ప్రతినిధులకు వివరించారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ పాదరక్షల సంస్థ షూఆల్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తే, అవసరమైన అన్ని అనుమతులు, మౌలిక వసతులు మరియు ప్రభుత్వ సహకారాన్ని వేగవంతంగా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా, పారిశ్రామికాభివృద్ధికి, ఎగుమతుల వృద్ధికి మరియు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలకంగా దోహదపడతాయని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.



# గంజాయి తరలిస్తున్న ముఠా పట్టివేత

**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త-క్రైమ్:** నెల్లూరు నగరంలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, శనివారం తెల్లవారు జామున 5 నుండి 7 గంటల వరకు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా అటుగా వచ్చిన ఏపీఎస్ఆర్టీసీ బస్సును (నెం.ఏపి05జడ్5308) తనిఖీ చేయగా, అందులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీనితో వెంటనే స్పందించిన పోలీసులు, నిందితులు అనీష్ కుమార్, అమిత్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 8.798 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, నిందితులు రాజమండ్రిలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేశామని, దీనిని తిరుపతికి తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నామని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో సమర్థవంతంగా పనిచేసి నిందితులను పట్టుకున్న ఎస్సై పి.రమేష్ బాబు, జేకేవీఎన్ మురళి కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఎం. కృష్ణయ్య, కానిస్టేబుల్స్ ఎస్కే రఫీ, ఎస్కే అజీజ్ బాషలను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# పైలేరియా సమస్యకు సమష్టి కృషితో చెక్

## రూ.6.18కోట్లతో పెదపెంకి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు, రోడ్లు అభివృద్ధిపనులపై డిప్యూటీ సిఎం పవన్ సమీక్ష

**విజయవాడ జూన్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓ చిన్న గ్రామంలో నెలకొన్న సామాజిక అంతరాల వల్ల, యావత్ గ్రామమంతా భయానక ఫైలేరియా (బోద) వ్యాధి బారినపడిన వైనం 2018లోనే నా దృష్టికి వచ్చింది. గ్రామంలోని మురుగునీరు బయటకు పారకపోవడంతో అక్కడ ప్రమాదకర వ్యాధి వ్యాపించిందని తెలుసుకొని విస్తుపోయానని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. అప్పట్లోనే దీనిపై మాట్లాడాను. అయితే అధికారంలోకి వచ్చాక ఈ సమస్య మీద ప్రత్యేక దృష్టి సారించడంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించే మార్గాలని కనుగొన్నామ్మని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. యంత్రాంగం సమష్టిగా పని చేస్తే ప్రజలకు సంబంధించిన ఏ సమస్యను అయినా సానుకూలంగా, సావధానంగా ఎలా పరిష్కరించవచ్చో పార్వతీపురం మన్యం జిల్లా, పెదపెంకి గ్రామంలో చేపట్టిన సమగ్ర అభివృద్ధి ద్వారా నిరూపించామని చెప్పారు. గ్రామం మొత్తం మీద 197ఫైలేరియా (బోద) కేసులు నమోదై, జాతీయస్థాయికి వెళ్లిన సమస్యను ఓ ప్రణాళిక ప్రకారం యంత్రాంగం అధిగమించిన విధానం సర్వదా అభినందనీయమన్నారు. మొదట అభివృద్ధిని వ్యతిరేకించిన గ్రామస్థులే ఇప్పుడు ఫలితాలను చూసి ప్రభుత్వాన్ని, అధికారులను మెచ్చుకోవడం సాధారణ విషయం కాదు అన్నారు. మన్యం జిల్లా, పెదపెంకిలో భారీగా నమోదు అయిన ఫైలేరియా కేసులు, కూటమి ప్రభుత్వంలో ఆ గ్రామంపై పెట్టిన ప్రత్యేక శ్రద్ధ, సాగుతున్న పనులపై జిల్లా అధికారులతో పవన్ కళ్యాణ్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ సామాజిక అంతరాల వల్ల పెదపెంకి గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లోని మురుగు నీరు బయటకు వెళ్లకుండా ఒకే దగ్గర నిల్వ ఉండిపోయింది. ఫలితంగా క్యూలెక్స్ దోమలు అధికమై గ్రామంలోని వారంతా వ్యాధి బారినపడ్డారు. మురుగు నీరు ఒకే దగ్గర ఉండిపోవడంతో దోమలు పెరిగాయి. ఫలితంగా ఎక్కడా లేనట్లుగా ఒకే ఊరిలో అధికంగా కేసులు నమోదు అయ్యాయి. ఇది ఆరోగ్య హెచ్చరిక అయింది. పెదపెంకి గ్రామంలో వందకు పైగా ఫైలేరియా కేసులు నమోదవటం, తరచూ ప్రజలు ప్రమాదకర జ్వరాల బారిన పడుతుండటంతో పవన్ అక్కడి సమస్యలపై దృష్టి పెట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవటమే అన్ని సమస్యలకు మూలమని అధికరారులు గుర్తించారు. గ్రామంలో కొన్నిచోట్ల కాలువలు అక్రమణలకు గురయ్యాయి. అక్కడి ప్రజలతో మాట్లాడి అక్రమణలు తొలగించి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నట్లు అధికారులు పవన్‌కు వివరించారు. గ్రామస్థుల నుంచి మొదట్లో ప్రతిఘటన ఎదురైనా వారిని ఎలాగోలా ఒప్పించి ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సామాజిక సమస్యలు ఉన్నప్పటికి వాటిని అధిగమించి పనులు ముందుకు తీసుకెళ్లి అధికారులను డి.సిఎం అభినందించారు. ఈనెల 24న పెదపెంకి గ్రామానికి వచ్చి మ్యాజిక్ డ్రెయిన్ల ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తానని తెలిపారు.

# వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

## పోటెత్తిన భక్తులు

## రాబడి రూ.10,98,270లు

**రాపూరు (నెల్లూరు), జూన్ 6, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన ఐదవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, గిరిజనవాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ. 10,98,270 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళాల రూపేణా రూ.1,86,000లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయంద్వారా రూ. 27,750లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 52,500 రూపాయిలు,100 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,80,100లు,దేవస్థానం వసతిద్వారా రూ.39,300లు, తలనీలాలు 3.350 మంది సమర్పించగా తద్వారా రూ. 1,34,000లు,లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3,36,105లు,పులిహోరా విక్రయం ద్వారా రూ.40,590లు,వాహనాల పూజల ద్వారా రూ.1,925లుచొప్పునమొత్తం రూ.10, 98, 270రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# వెనిజులా వైస్ ప్రెసిడెంట్ డెల్సీ రోడ్రిగ్జ్‌కు ఘన స్వాగతం

**శ్రీ సత్య సాయి జిల్లా, జూన్ 6, ప్రభాతవార్త ప్రతినిధి** వెని జులా దేశ వైస్ ప్రెసిడెంట్, తాత్కాలిక ప్రధాని డెల్సీ రోడ్రిగ్జ్ శనివారం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి శ్రీ సత్య సాయి విమానాశ్రయానికి చేరుకు న్నారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా పరిపాలనా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మెనెజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఇతర ఉన్నతాధికారులు వెనిజులా వైస్ ప్రెసిడెంట్‌కు పుష్పగుచ్చాలు అం దించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆమెను పుష్పగుచ్చలు, శాలువతో సన్మానించి సత్కరించారు. సత్య సాయి బాబా చిత్రపటంతోపాటు ధర్మవరం పట్టుచీరను ప్రత్యేకంగా బహూకరించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కుమారుడు వియన్, కుమార్తె వన్స్ లు వెనిజుల తాత్కాలిక ప్రధానిని కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వఅధికారులు తదితరులు పాల్గొన్నారు.



వెనిజులా తాత్కాలిక ప్రధాని డెల్సీ రోడ్రీగ్స్‌కు పట్టుచీర బహూకరిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# వైద్యులు అంకితభావంతో సేవలందించాలి

## ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 6వ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పిలుపు

## 188 మంది ఎంబిబిఎస్ విద్యార్థులకు పట్టాల ప్రదానం

**విశాఖపట్నం, జూన్ 6 ప్రభాతవార్త:** వైద్య విద్య అనేది డిగ్రీతో ముగిసే ప్రక్రియ కాదని, జీవితాంతం నేర్చుకుంటూ సమాజానికి అంకిత భావంతో సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. భీమునిపట్నం మండలం సంగివలసలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్ఆర్ఐఎంఎస్)లో శుక్రవారం నిర్వహించిన 6వ ఎంబీబీఎస్ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 188 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దేశంలో జీవనశైలి వ్యాధులు, అంటువ్యాధులు కాని వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లపై వైద్యులు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆరోగ్య సేవల అంతరాలను తగ్గించేందుకు డిజిటల్ హెల్త్ కార్యక్రమాలు, ఆధునిక వైద్య సాంకేతికతలు దోహదపడతా యని పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీ వంటి అత్యా ధునిక సాంకేతిక పరిజ్ఞానం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని, యువ వైద్యులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొం దించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వైద్య విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తల్లి దండ్రులు, అధ్యాపకులు అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. ఎన్ఆర్ఐ విద్యాసంస్థల చైర్మన్ పి. సుధారెడ్డి మాట్లా డుతూ సంస్థ ఆధ్వర్యంలోని అనిల్ నీరుకొండ ఆసుపత్రి అత్యాధునిక సౌకర్యాలతో ఉత్తరాం ధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజ లకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, యాజమాన్య సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




పట్టాలు పొందిన విద్యార్థులతో గవర్నర్ నజీర్, తదితరులు

# ఘనంగా ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు ప్రారంభం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 6,ప్రభాతవార్త:** ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రారంభమయ్యాయి. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం జి.జి.యులో జరిగిన సభలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణ రాజు (చైత న్య రాజు), ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మన మాతృ భాషను మనమే కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదం డ్రులను అనుసరిస్తారని, అందువల్ల మాతృభాష పరిరక్షణలో తల్లిదండ్రులు ముందుండాలని సూచించారు. తెలుగు భాష మాధుర్యాన్ని, గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం గత మూడు సంవత్సరాలు గా ప్రపంచ తెలుగు మహాసభల ను నిర్వహిస్తున్నామని, అమలాపురంలో జరిగిన మూడవ మహాసభలో తీసుకున్న తీర్మానాలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. అలాగే జి.జి.యులో ఇంజనీరింగ్ విద్యలో తెలుగును ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

తెలుగు భాష మన సాంస్కృతికి సాంప్రదా యాలకు జాతి ఆత్మకు ప్రతీక అని ఆయన అన్నారు. భాష బ్రతికితేనే సంస్కృతి బ్రతుకుతుందని సాహిత్యం కళల వల్లే సమాజం చైతన్యవంతం అవుతుందని తెలుగు సాహిత్య చైతన్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పే ఈ మహాసభలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చైతన్య రాజు అన్నారు. తెలుగు భాషా గౌరవాలను ప్రపంచ స్థాయిలో నిలబెట్టడం ప్రతి తెలుగు వారి బాధ్యత అని ఆయన అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక సీఈవో కత్తి మండ ప్రతాప్, మాట్లాడుతూ ప్రాచీన కవులు, కళాకారుల సాహిత్యాన్ని యువతరానికి అం దించడం సాహిత్య సంస్థల బాధ్యత అని తెలి పారు. ఈ రెండు రోజుల మహాసభలు తెలుగు చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలుస్తాయని పేర్కొ న్నారు. కమాండెంట్, కొండా నరసింహా రావు, మాజీ ఎమ్మెల్సీ, ఆదిరెడ్డి అప్పారావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. శ్రీనివాస రావు, గన్ని కృష్ణ, వెంకట్ ఆళ్ల, చప్పిడి రాజశేఖర్, ఎర్రప్రగడ రామకృష్ణ, జి.ఈశ్వర భూషణం, టీ.పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కొండా నరసిం హారావు దంపతులు శంఖానాదంతో సభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే పలువురు రచయితల పుస్తకాలను విడుదల చేశారు. గిరిజన నృత్యం, కూచిపూడి, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు అమెరికా నుంచి కూడా ప్రతినిధులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల సమస్యలపై తక్షణమే స్పందించిన విపిఆర్



**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త - వైద్యం :** కం దుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మం డలం, చాకిచెర్ల పరిధిలోని పెద్దపట్టపుపాళెం గ్రామానికి చెందిన మత్స్యకార సంఘ నూతన పెద్ద కాపులు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న కొన్ని కీలక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దపట్టపుపాళెం గ్రామ మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం నిత్యం గ్రామ సమీపంలోని సముద్రంలోకి వెళ్లాల్సి ఉంటుందని, అయితే, మార్గమధ్యంలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిందని పెద్ద కాపులు ఎంపీ గారికి వివరించారు.

దీనిపై తక్షణమే స్పందించిన ఎంపీ గారు, మత్స్యకారుల ప్రయోజనాల దృష్ట్యా తన సొంత నిధులతో ఆ బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా గ్రామంలోని ప్రధాన వీధికి సీసీ రోడ్డును మంజూరు చేస్తానని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు.



మద్యం బాటిళ్ళను తీసుకెళ్తున్న స్థానికులు

# వ్యాన్ బోల్తా

## రోడ్డు పాలైన రూ.12 లక్షల మద్యం

## బాటిళ్లను పట్టుకుపోయిన ప్రజలు

**శ్రీరంగరాజపురం, జూన్ 6 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండల పరిధిలో చిత్తూరు-పుత్తూరు రహదారిలో బసివిరెడ్డిపల్లి షికారీ కాలనీ వద్ద శుక్రవారం రాత్రి మద్యం తీసుకెళ్తున్న వ్యాను బోల్తా పడింది. ఒక్కసారిగా అదుపు తప్పి మద్యం వాహనం బోల్తా పడటంతో వాహనంలో వున్న మద్యం బాక్సులు రోడ్డు మీద పడ్డాయి. మద్యం బాక్కులు రోడ్డుపై పడటంతో ఒక్కసారిగా ప్రజలు మద్యం బాటిళ్ళ కోసం ఎగబడ్డారు. దొరిగిన మద్యం బాటిళ్ళను దొరికి నట్లు తీసుకెళ్ళి పోయారు. ఈ ఘటనలో సుమారు రూ.12 లక్షలు విలువైన మద్యం సరుకు నష్టం జరిగిందని ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ వెల్లడించారు. పూతలపట్టు మండలం బండపల్లి వద్ద వున్న మద్యం డిపో నుండి కార్వేటినగరం మండలం కొల్లాగుంట గ్రామం వద్ద వున్న మద్యం షాపుకు మద్య తీసుకెళ్తూ వాహనం ఎస్ఆర్ పురం మండల పరిధిలో బసివిరెడ్డిపల్లి షికారీ కాలనీకి సమీపంలో బోల్తా పడింది. వాహనం బోల్తా పడటంతో వాహనంలో వున్న మద్యం మొత్తం నేలపాలైంది. మద్యం బాక్కులు ఒక్కసారిగా రోడ్డుపై పడటంతో కొన్ని బాక్కులు చినిగిపోయాయి. చినిగిపోయిన బాక్సుల నుండి మద్యం బాటిళ్ళు కన్పించడంతో అప్పటి వరకు ఎదో వాహనం బోల్తా పడిందని పట్టించుకోలని స్థానికులు మద్యం వాహనం బోల్తా పడిందని తెలియడంతో ఒక్కసారిగా పోటెత్తారు. మద్యం వాహనం నుండి సుమారు రూ.4 లక్షల మద్యం వరకు పూర్తి స్థాయిలో స్థానికులు పట్టుకెళ్ళినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేటి నుంచి దుర్గమ్మవారి ఆలయంలో యోగా శిక్షణ

**ఇంద్రకీలాద్రి, జూన్ 6, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం నుండి 14 రోజుల పాటు జరిగే యో గా శిక్షణా తరగతులకు ఆలయ పరిపాలనా విభాగం, ఉద్యోగులు తప్పకుండా హాజరవ్వాలని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్, సభ్యులకు సమాచారం తెలిపి వారు పాల్గొనటానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈయోగా శిక్షణకోసం నిపుణులచే శాస్త్రీయపద్ధతిలో యోగాసనాలు, ప్రాణాయామం వంటివి ఉదయం 7 నుండి 8 వరకు మహా మండపం 6వ అంతస్తులో నేర్పించనున్నామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదం అందిస్తామన్నారు.

7-6Pg5.qxd OK:7-6Pg5.qxd 1/1/02 7:41 AM Page 1



# సద్దుమణిగిన కర్ణాటక వివాదం

## న రామలింగారెడ్డిని బుజ్జగించిన సిఎం డికె - రాజీనామా నిర్ణయం విరమించిన మంత్రి



**బెంగళూరు, జూన్ 6:** కర్ణాటక ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ తర్వాత చెలరేగిన అసమ్మతి సెగలు సద్దుమణిగాయి. శాఖల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సీనియర్ నేత రామలింగారెడ్డి కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగి ఆయనతో జరిపిన సుదీర్ఘ చర్చలు ఫలించడంతో సమస్యకు తాత్కాలికంగా తెరపడింది. శుక్రవారం రాత్రి రాజీనామా ప్రకటనతో కలకలం రేపిన రామలింగారెడ్డిని బుజ్జగించేందుకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. జయనగర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో అర్ధరాత్రి దాటాక రామలింగారెడ్డితో ఆయన భేటీ అయ్యారు. పార్టీకి చెందిన మరికొందరు సీనియర్ నేతల సమక్షంలో జరిగిన ఈ మంతనాల తర్వాత వివాదం సద్దుమణిగినట్లు డీకే శివకుమార్ ప్రకటించారు. శాఖల కేటాయింపునకు సంబంధించి తలెత్తిన కొన్ని సమస్యలపై కూర్చుని మాట్లాడుకున్నాం. ప్రస్తుతం వివాదం పరిష్కారమైందని ఆయన మీడియాకు స్పష్టంచేశారు. తనకు కేటాయించిన నీటిపారుదల శాఖపైనే రామలింగారెడ్డి ప్రధానంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు డీకే తెలిపారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే దానిపై స్పష్టమైన అవగాహనకు వచ్చామని పేర్కొన్నారు. రామలింగారెడ్డి, నేను 1980ల నుంచి మంచి స్నేహితులం. పార్టీలోని సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తున్నాం. చిన్నచిన్న అభిప్రాయభేదాలను త్వరలోనే పరిష్కరించుకుంటామని డీకే భరోసా ఇచ్చారు. రామలింగారెడ్డి వివాదం ముగిసినప్పటికీ, కర్ణాటక మంత్రివర్గంలో అసంతృప్తి పూర్తిగా సమసిపోలేదని తెలుస్తోంది. మరో సీనియర్ మంత్రి కేహెచ్ మునియప్ప కూడా శాఖల కేటాయింపుపై తన సీనియారిటీకి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదంటూ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఇంకా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఒకవైపు రామలింగారెడ్డిని శాంతింపజేసినా, మరోవైపు మునియప్ప వంటి సీనియర్ నేతల్లోని అసంతృప్తిని కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు.. ఒకరి మృతి

**తిరువనంతపురం, జూన్ 6:** నైరుతి రుతుపవనాల రాకతో కేరళలో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. అనేక జిల్లాల్లో ఇండ్లు ధ్వంసం కాగా, రోడ్లు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా ఒకరు మరణించారు. రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసర్‌గాడ్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే, పతనంతిట్ట, కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిశూర్, పాలక్కాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రెడ్ అలర్ట్ ప్రకారం రాబోయే 24 గంటల్లో ఆయా జిల్లాల్లో 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఆరెంజ్ అలర్ట్ ప్రకారం 11 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల రోడ్లు నీట మునిగాయి. చాలా చోట్ల ఇండ్లు, ఇతర ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో చాలా జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ఒక తాత్కాలిక షెడ్‌పై చెట్టు పడటంతో అందులో నిద్రిస్తున్న 29 ఏళ్ల యువకుడు మరణించాడు. ఈ ఘటన త్రిశూర్ జిల్లాలోని మనలూర్ వద్ద జరిగింది. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరుసగా వర్షాల నేపథ్యంలో కేరళలోని పర్యాటక ప్రాంతాల్లో అధికారులు పలు ఆంక్షలు విధించారు. పర్వత ప్రాంతాల్లోకి ట్రెకింగ్ నిషేధించారు. పర్యాటకులు కొండప్రాంతాల్ని వీడిరావాలని, రాత్రి ప్రయాణాలు మానుకోవాలని సూచించారు. వయనాడ్, కోజికోడ్, కాసర్‌గాడ్ ప్రాంతాల్లో పలు ఆంక్షలు కొనసాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయని, అందువల్ల గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తమిలనాడులో వర్షాలు కురుస్తున్నట్లు ఐఎండీ తెలిపింది.

## అన్నామలై ఉద్యమానికి భారీ మద్దతు




24 గంటల్లోనే 14 మంది భాగస్వామ్యం

**చెన్నై, జూన్ 6:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై బీజేపీకి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. బిజెపి ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపిందే. వెంటనే ఆయన "వియ్ ది లీడర్స్" పేరుతో నూతన రాజకీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రారంభించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే సుమారు 14 లక్షల మంది ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం గమనార్హం. గత కొంతకాలంగా పార్టీ రాష్ట్ర వ్యూహాల విషయంలో అధిష్ఠానంతో విభేదిస్తున్న అన్నామలై, చివరకు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. తన రాజీనామా లేఖను బీ జే పీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు పంపగా, ఆయన ఆమోదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల తనకు అమితమైన గౌరవం ఉందని, అయితే పార్టీని మరింత ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నామలై తన లేఖలో పేర్కొన్నారు. సింగంగా గుర్తింపు పొందిన ఆయన, 2020లో సివిల్ సర్వీసెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. రాజకీయల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే, 37 ఏళ్ల వయసులో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు. వియ్ ది లీడర్స్ ఉద్యమం ద్వారా తమిళనాడులో వారసత్వ, వ్యక్తిపూజ రాజకీయాలకు స్వస్తి పలికి, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని ప్రకటించారు. విద్య, ఆరోగ్యం, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని తెలిపారు. దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల స్ఫూర్తితో ఈ ఉద్యమాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. అన్నామలైకి మద్దతుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్‌తో సహా పలువురు కీలక నేతలు కూడా బీజేపీని వీడారు. ఈ నూతన ఉద్యమం రానున్న లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా ఆవిర్భవించే అవకాశం ఉందని చెన్నైలో రాజకీయనేతలు పేర్కొంటున్నారు.

## ఇరాన్ రాడార్ కేంద్రాలపై అమెరికా దాడి

**వాషింగ్టన్, జూన్ 6:** అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అగ్రరాజ్యం.. ఇరాన్‌కు చెందిన తీరప్రాంత నిఘా రాడార్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు నిర్వహించింది. హార్మూజ్‌లో నౌకల రవాణాకు ఇరాన్ డ్రోన్ దాడులు ముప్పుగా మారాయని యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పేర్కొంది. అందుకే తక్షణమే స్పందించాల్సి వచ్చిందని తెలిపింది. టెహ్రాన్‌కు చెందిన నాలుగు డ్రోన్‌లను కూల్చివేశామని వెల్లడించింది. దీని తర్వాత గోరుఖ్, ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. మరిన్ని దాడుల నుంచి రక్షించుకోవడానికే ఈ చర్యలు చేపట్టినట్లు సెంటకామ్ తెలిపింది. ఇరాన్ దురాక్రమణల నుంచి రక్షించుకునేందుకు తమ ప్రతిస్పందనలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ సంఘర్షణను ముగించేందుకు ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగున్నప్పటికీ.. దాడులు మాత్రం ఆగడం లేదు. కువైట్ లక్ష్యంగా దాడులు.. కువైట్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్‌లతో విరుచుకుపడింది. తమ గగనతలంపైకి దూసుకొచ్చే క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ తెలిపింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆపై బహ్రెయిన్‌లో కూడా సైరన్‌లు మోగడంతో బలగాలు అప్రమత్తయ్యాయి.

## ఎడారిలో ఘోరం.. నీరు దొరకక 49 మంది మృత్యువాత



**నియామెయి, జూన్ 6:** పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తోపాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజులపాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడి నుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు.

విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టం లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలస వెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేకమంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తు చేసుకున్నారు.

## ఓడిపోయి బాధలో ఉంటే.. లేచి నిల్చుని చప్పట్లు కొట్టమన్నారు..



### మమత మేనల్లుడిపై టిఎంసి రెబల్ నేత రితబ్రత ఆరోపణలు

**కోల్‌కతా, జూన్6:** మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై టిఎంసి రెబల్ నేత రితబ్రత బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు జరిగిందని ఆరోపించారు. మమతా బెనర్జీని తాము గౌరవిస్తున్నామని, అయితే తమపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ పెత్తనాన్ని మాత్రం అంగీకరించబోమని స్పష్టం చేశారు. పార్టీ కోసం ఏమీ చేయకపోయినా దీదీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టారని విమర్శించారు. బెంగాల్ ఎన్నికల్లో టిఎంసి ఓటమి అనంతరం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో సమావేశం నిర్వహించారని రితబ్రత పేర్కొన్నారు. పార్టీ కోసం అభిషేక్ చేసిన కృషికిగాను నిలబడి చప్పట్లు కొట్టాలని సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలకు మమత సూచించారని రితబ్రత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఉన్న తమను ఈ చర్య మరింత బాధించిందని అన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేల చేత సంతకాలు తీసుకున్నారని హాజరు కాని వారి పేర్లను అధికారిక రికార్డుల్లో రాసుకున్నారని ఆరోపించారు.

టిఎంసిలో అవినీతి బాగా పెరిగిపోయిందని దానిని ప్రక్షాళించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం 61 మంది ఎమ్మెల్యేలు తమతో ఉన్నారని, రాబోయే రోజుల్లో మరికొంతమంది తమతో పాటు కలిసే అవకాశం ఉందన్నారు. కాగా టిఎంసి పార్టీలోని చాలా మంది నాయకులు అభిషేక్ బెనర్జీ పనితీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

శుభేందు అధికారి సహా పలు నేతలు పార్టీని వీడి వెళ్లడానికి కూడా అభిషేక్ వైఖరే కారణమన్న ఆరోపణలూ ఉన్నాయి. మమత కష్టపడి క్షేత్రస్థాయి నుంచి పార్టీని నిర్మిస్తే అభిషేక్ తృణమూల్‌ను ఐపాక్ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టారని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు.

పార్టీ ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఆయనేనని నిందిస్తున్నారు.

ఈ నేపథ్యంలో మేనల్లుడి విషయంలో దీదీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

## సమితిలో మళ్లీ జమ్ముకాశ్మీర్ ప్రస్తావన తెచ్చిన పాక్




**న్యూయార్క్, జూన్ 6:** పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా ఐక్యరాజ్యసమితి లో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని తీవ్రంగా స్పందించారు. జమ్ముకశ్మీర్‌కేంద్రపాలిత ప్రాంత భాగం భారత్‌లో అంతర్భాగమని, ఎప్పటికీ విడదీయలేనిదని అన్నారు. దీనికి విరుద్ధంగా చేసే వాదనలకు చారిత్రక ఆధారాలు లేవని చెప్పారు. పాకిస్థాన్ చేస్తున్న నిరాధార వాదనలు ఈ వాస్తవాన్ని మార్చలేవని అన్నారు.

ఐక్యరాజ్యసమితి వేదికలను పాకిస్థాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు.

## అమెరికా ఉన్నతాధికారులపై ఇజ్రాయెల్ నిఘా!

### పెంటగాన్ అంతర్గత సర్క్యులర్ జారీ



**న్యూయార్క్, జూన్ 6:** అమెరికా రక్షణ విభాగం నిఘా సంస్థ అంతర్గతంగా ఒక హెచ్చరిక నోటీసును జారీ చేసింది. ఇజ్రాయెల్ తమ దేశ ఉన్నతాధికారులపై నిఘా వేసిందన్నది దాని సారాంశం. పశ్చిమాసియా వివాదాలపై అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకునే అంతర్గత నిర్ణయాలను దొంగిలించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందని పెంటగాన్ అనుమానిస్తోంది. ఈక్రమంలో ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లే యూఎస్ అధికారులకు నిబంధనలను కఠినతరం చేశారు. ఉన్నత స్థాయి చర్చల కోసం వెళ్లేవాళ్లు సాధారణ ఫోన్లకు బదులుగా బర్నర్ ఫోన్లు, తాత్కాలిక కంప్యూటర్లను మాత్రమే వాడనున్నారు. హోటల్ గదుల్లో ఎలాంటి సున్నితమైన విషయాలను మాట్లాడొద్దని సూచించారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు సమాచారాన్ని సేకరించడంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తాయని ఇప్పటికే పేరుంది. అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఇరాన్ యుద్ధంపై వస్తున్న విభేదాలే ఈ తాజా వివాదానికి కారణం. ఇటీవల ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత ట్రంప్ దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నారు. కానీ ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు చేయాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పట్టుబడుతున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య జరిగిన ఓ ఫోన్ సంభాషణలో ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, నెతన్యాహును పిచ్చివాడు అని సంబోధించారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ గూఢచర్య ఆరోపణలను వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం తోసిపుచ్చింది. తమపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వివరించింది. ఇజ్రాయెల్ ఎప్పుడూ అమెరికా ప్రభుత్వ అధికారులపై నిఘా పెట్టదని, తమ శత్రువులపై మాత్రమే నిఘా ఉంచుతుందని పేర్కొంది. అటు వైట్ హౌస్ కూడా ఈ వార్తలను అధికారికంగా ఖండించింది. అయినప్పటికీ ఇరుదేశాల మధ్య అంతర్గతంగా నమ్మకం దెబ్బ తినే ప్రమాదం ఉందంటున్నారు.



## పశ్చిమాసియా సంక్షోభంపై ప్రధాని మోడీ చర్చలు

### సులభశైలి జీవనం, వాణిజ్యంపై ఆర్థిక సలహామండలి సూచనలు కోరిన ప్రధాని

**న్యూఢిల్లీ,జూన్ 6:** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. సులభతర జీవనశైలి, సులభశైలి వాణిజ్య నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల నిపుణులనుంచి సలహాలు, అభిప్రాయాలు స్వీకరించారు. భారత్ ఆర్థికవృద్ధికి ఊతం ఇచ్చే అనేక అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. సభ్యులు కూడా పశ్చిమాసియా అనిశ్చితి భారత్‌పై ప్రభావం అన్న అంశానికి సంబంధించి తమతమ అధ్యయననివేదికలను మోడీకి వివరించారు. పశ్చిమాసియాపైనేకాకుండా భారత్, ప్రపంచదేశాలపై ఈప్రభావం అత్యధికంగా ఉంటుందన్నది నిపుణుల వాదన. భారత్ దీర్ఘకాలిక అభివృద్ధిప్రాధాన్యతాంశాలపైనే మోడీ ముఖ్యంగా సమావేశంలోప్రస్తావించారు. ప్రధాని ఆర్థిక సలహా మండలిలో ముగ్గురు శాశ్వత సభ్యులు కాగా 11 మంది తాత్కాలిక సభ్యులు ఉంటారు. ప్రధానికి స్థూల ఆర్థికవ్యవస్థ స్థితిగతులు, ఆర్థికపరమైన అంశాలపై ప్రధాని మోడీకి ఈ కమిటీ సలహాలు,సూచనలుచేస్తుంది.

## ఆస్ట్రేలియాలోలక్షకు పైగా బొద్దింకలు స్వాధీనం!



**న్యూసౌత్‌వేల్స్, జూన్ 6:** ఆస్ట్రేలియాలో నిర్వహించిన ఒక భారీ ఆపరేషన్‌లో లక్షకు పైగా అక్రమ బొద్దింకలను స్వాధీనం చేసుకున్నారు. దేశంలోకి దిగుమతి చేసుకోవడం లేదా పెంచడంపై నిషేధం ఉన్న ఈ బొద్దింకలను ఒకే బ్రీడర్ నుంచి పట్టుకోవడం సంచలనం సృష్టిస్తోంది. దేశ చరిత్రలో వెన్నెముక లేని జీవులకు సంబంధించి ఇదే అతిపెద్ద ఆపరేషన్ అధికారులు వెల్లడించారు. న్యూసౌత్ వేల్స్ రాష్ట్రంలోని బాథర్స్ నగరంలో మే నెలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక కమర్షియల్ బ్రీడర్ వద్ద జరిపిన సోదాల్లో మడగాస్కర్ హిస్సింగ్, డూబియా జాతులకు చెందిన లక్షకు పైగా బొద్దింకలను గుర్తించినట్లు ఆస్ట్రేలియా పర్యావరణ విభాగం తెలిపింది. వీటి విలువ సుమారు రెండులక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1.35 కోట్లు) ఉంటుందని అంచనా. ఈ మడగాస్కర్ బొద్దింకలు ప్రపంచంలోనే అతిపెద్ద జాతులలో ఒకటి. ఇవి 5 నుంచి 8 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. సాధారణ ఆస్ట్రేలియన్ బొద్దింకల కన్నా ఇవి చాలా పెద్దవి. స్థానికంగా పాములను పట్టే స్టెఫానీ లెస్సర్ మాట్లాడుతూ, పెంపుడు సరీసృపాలకు తక్కువ ఖర్చుతో కూడిన ఆహారం అందించేందుకు ఈ పెద్ద బొద్దింకలను అమ్ముతున్నారని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలో కఠినమైన బయోసెక్యూరిటీ నిబంధనలు అమల్లో ఉన్నాయి. దేశీయ వృక్ష, జంతుజాలాన్ని కాపాడేందుకు ఇలాంటి విదేశీ జీవులను పెంచడం, అమ్మడం చట్టవిరుద్ధం. విదేశీ బొద్దింకలు పర్యావరణానికి ప్రమాదకరం కావచ్చని, స్థానిక జీవవైవిధ్యానికి హాని కలిగించడంతో పాటు వ్యాధులను వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## సంక్షిప్తంగా..

### ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న లారీ: 9 మంది మృతి



**చండీగఢ్, జూన్ 6:** మరణించిన వృద్ధురాలి అంత్యక్రియలకు హాజరైన 28 మంది ట్రాక్టర్ ట్రాలీలో తిరుగుప్రయాణ మయ్యారు. ఆ ట్రాక్టర్ ట్రాలీని ఒక లారీ ఢీకొట్టగా 9 మంది మరణించారు. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో ఈ దుర్ఘటన జరిగింది. జలాలాబాద్‌కు చెందిన ఒక వృద్ధురాలు మరణించడంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులతో సహా సుమారు 28 మంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ట్రాక్టర్ ట్రాలీలో తిరుగుపయనమయ్యారు. కాగా, శనివారం తెల్లవారుజామున ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై ఆ ట్రాక్టర్ ట్రాలీని ఒక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పురుషులు, ఒక మహిళసహా నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. చికిత్స పొందుతూ మరో ఐదుగురు చనిపోయారు. మరోవైపు గాయపడిన మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన కొందరిని మెరుగైన చికిత్స కోసం ఫరీద్‌కోట్‌లోని ప్రత్యేక వైద్య కేంద్రానికి తరలించారు.

### చెస్ ప్లేయర్ ప్రజ్ఞానందకు ప్రధాని మోడీ అభినందనలు



**న్యూఢిల్లీ, జూన్ 6:** ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నీ టైటిల్‌ను గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఘనత సాధించడంపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. అతడి ప్రతిభకు ఇదో కీలక మైలురాయి అంటూ ప్రశంసించారు. ప్రజ్ఞానంద భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ సైతం యువ గ్రాండ్ మాస్టర్‌ను అభినందించారు. ఈ అద్భుతమైన విజయం అతని అసాధారణ ప్రతిభకు, అచంచలమైన అంకితభావానికి, ఏళ్ల తరబడి చేసిన కృషికి నిదర్శనమన్నారు. ప్రపంచ వేదికపై అత్యుత్తమమైన ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేశాడని ప్రశంసించారు.

### వంటమనిషి నిర్లక్ష్యం వల్లే ఢిల్లీ హోటల్లో అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ, జూన్6:** దేశ రాజధాని ఢిల్లీలో స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 21 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే హోటల్‌లో పనిచేస్తున్న కుక్ కేశవ్‌నేగిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే హోటల్‌లో పనిచేస్తున్న కుక్ కేశవ్‌నేగిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. వంట మనిషి నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదం సంభవించిందని తెలుస్తోంది. వంటగదిలో ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయగానే అది పేలిపోయిందని కుక్ మీడియాతో పేర్కొన్నారు. ఆ తర్వాత హోటల్ మెయిన్ పవర్‌ను ఆఫ్ చేసి తనను తాను రక్షించుకునేందుకు బయటకు పరుగులు తీసినట్లు వెల్లడించాడు.

### లాలూప్రసాద్‌యాదవ్ భద్రత కుదింపు!



**పాట్నా,జూన్ 6:** బీహార్ రాజకీయాల్లో ఒక్కసారిగా తీవ్ర సంచలనం చోటుచేసుకుంది. ఆర్జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య, మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవిలకు ఇన్నాళ్లూ ఉన్న అత్యున్నత జడ్‌ప్లస్ కేటగిరీ భద్రతను బీజేపీ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీని స్థానంలో బీహార్ స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బందిని కేటాయించింది. లాలూ కుటుంబం ఈ నిర్ణయాన్ని తీవ్రంగా నిరసించింది. తమ నివాసానికి వచ్చిన కొత్త భద్రతా సిబ్బందిని వారు లోపలికి రానివ్వకుండా వెనక్కి పంపేశారు. భద్రత ఉపసంహరణతో పాట్నాలోని లాలూ యాదవ్ నివాసం (10, సర్క్యులర్ రోడ్) వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆర్జేడీ నేతలు, కార్యకర్తలు చేతుల్లో కర్రలు పట్టుకుని లాలూ నివాసానికి స్వయంగా కాపలా కాస్తున్నారు.

07-06pg10.qxd OK OK:07-06pg10.qxd 1/1/02 7:20 AM Page 1



# తొలి రోజే టీమిండియా సెంచరీల షో

ఐపీఎల్‌లో విడివిడిగా ఎవరికి వారుగా సత్తా చాటిన ఆటగాళ్లు.. ఒక్కటిగా ఆడితే ఎలా రెచ్చిపోతారో ముల్లాన్ పూర్ వేదికగా సాక్షాత్కారమైంది. అందరూ కలిసికట్టుగా ఊచకోత కోస్తుంటే ఆఫ్ఘన్ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. రాహుల్ క్లాస్, గిల్ మాస్ సెంచరీలకు సుదర్శన్, రిషబ్ పంత్ మెరుపు హాఫ్ సెంచరీలు తోడవడంతో తొలి రోజే భారత్ 350 ప్లస్‌రన్స్ చేసి క్రికెట్ కూనపై పూర్తి ఆధిక్యం ప్రదర్శించింది.

న్యూచండీఘర్, మే 6: క్రికెట్ కూన ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో తొలి రోజే టీమిండియా బ్యాట్స్‌మెన్ దుమ్మురేపారు. న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఈ టెస్ట్‌లో కేఎల్ రాహుల్(165 బంతుల్లో 100; 11 ఫోర్లు) క్లాస్, శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103నాటౌట్; 11 ఫోర్లు, ఓ సిక్స్) మాస్ సెంచరీలతో విరుచుకుపడ్డారు. ఈ శతకాలకు సాయి సుదర్శన్ (104 బంతుల్లో 81; 13 ఫోర్లు), రిషబ్ పంత్(70 బంతుల్లో 50నాటౌట్;2 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు తోడవడంతో తొలి రోజు ఆటముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆ వికెట్లు కోల్పోయి 368 పరుగుల భారీ స్కోరు చేసింది.







### దూకుడుగా ఆరంభం

టాస్ గెలిచి టీమిండియా మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌ను యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్ ధాటిగా ఆరంభించారు. ముఖ్యంగా ప్రారంభం నుంచే దూకుడుగా ఆడుతూ, బౌండరీలతో ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచిన యశస్వీ జైస్వాల్ ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. ఆయన 24రన్స్ మాత్రమే చేసి సలీం సఫీ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన సాయి సుదర్శన్‌తో కలిసి కేఎల్ రాహుల్... అద్భుతంగా ఆడాడు. లంచ్ సమయానికి భారత్ ఒక వికెట్ నష్టానికి 96 రన్స్ చేసింది.

### లంచ్ తర్వాత మరింత జోరు

లంచ్,టీ మధ్యలో మరింతగా సుదర్శన్, రాహుల్ విరుచుకుపడ్డారు. రాహుల్ 86 బంతుల్లో, సాయి సుదర్శన్ 67 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేశారు. స్కోరును 150 మార్కు దాటించారు. క్రిరాక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని శతకం వైపు దూసుకెళ్తున్న సాయి సుదర్శన్ జోరుకు మరోసారి సలీం సఫీ బ్రేక్ వేశాడు. 139 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. టీ విరామానికి భారత్ 2 వికెట్లు కోల్పోయి 209 రన్స్ చేసింది.

### రాహుల్, గిల్ సెంచరీల మోత

చివరి సెషన్‌లో టీమిండియా ట్వంటీ స్టయిల్‌లో పరుగులు రాబట్టింది. నిలకడగా ఆడిన కేఎల్ రాహుల్... గ్రౌండ్‌లో క్లాస్ షాట్లతో అలరిస్తూ 164 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. రాహుల్‌కు ఇది టెస్ట్‌ల్లో 12వ శతకం. అయితే సెంచరీ మార్కు రీచ్ అయిన తర్వాతి బంతికే రెహమాన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. దీంతో 247 పరుగుల వద్ద టీమిండియా మూడో వికెట్ కోల్పోయింది. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వచ్చి రావడంతోనే బౌండరీలతో ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 68 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన గిల్... మరో 59 బంతుల్లో సెంచరీ మార్కు అందుకున్నాడు. కెప్టెన్‌గా గిల్‌కిది 6వది కాగా, వ్యక్తిగతంగా 11వ శతకం.

### రిషభ్ పంత్ విజృంభణ

గిల్‌కు తోడుగా వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ సైతం గ్రౌండ్ నలుమూలలా భారీ సిక్సర్లు కొడుతూ.. భారత జట్టు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలోనే కేవలం 70 బంతులు ఆడి 50 పరుగులు పూర్తి చేచేశాడు. ఈ హాఫ్ సెంచరీతో పంత్ .. 19 టెస్ట్ అర్ధ శతకం నమోదుచేశాడు. వీరిద్దరి జోరుకు చివరి సెషన్‌లో భారత్ ఖాతాలో ఏకంగా 159 పరుగులు చేరాయి. తొలి రోజే 368 రన్స్ కొట్టి ఆఫ్ఘన్ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించిన టీమిండియా.. 600 ప్లస్ స్కోరుపై కన్నేసింది.

### సంక్షిప్త స్కోర్లు

**భారత్ తొలి ఇన్నింగ్స్: 368/3(85 ఓవర్లలో)** (జైస్వాల్ 24, కెఎల్ రాహుల్ 100, సాయి సుదర్శన్81, శుభ్‌మన్ గిల్ 103 నాటౌట్, రిషబ్ పంత్ 50 నాటౌట్, సలీం సూఫి 2/67, రహమాన్ 1/61)



## కెప్టెన్‌గా శ్రేయాస్
## తిలక్‌కు ప్రమోషన్
## సూర్యకు డబుల్ షాక్
## వైభవ్, ప్రిన్స్ ఇన్

# బేబీ బాస్ ఆగయా




**ఐపీఎల్‌లో ఇరగదీసిన యూనివర్సల్ బేబీ బాస్.. మెన్ ఇన్ బ్లూలోకి ఎంట్రీ ఇచ్చాడు. వస్తూనే రికార్డు బద్దలు కొట్టాడు. అదీ క్రికెట్ దేవుడు సచిన్ తెండూల్కర్‌ది. అతిపిన్న వయస్సులో టీమిండియాకు ఎంపికై నయా హిస్టరీ క్రికెట్ చేశాడు. సచిన్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో భారత్ తరపున ఆడితే.. అతని కంటే ఏడాదిన్నర ముందే ఈ ఫీట్ అందుకోబోతున్నాడు. వైభవ్ కేవలం 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే టీమిండియాకు ఎంపికయ్యాడు. బుడ్డోడి విధ్వంసాన్ని బ్లూ జెర్సీలో చూడాలని ఉవ్విళ్లూరుతున్న ఫ్యాన్స్ కలలు కొద్ది రోజుల్లోనే సాకారం కానుంది.**

న్యూఢిల్లీ: ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనలకు.. ఆసియా క్రీడలకు భారత టీ20 జట్టును బీసీసీఐ ప్రకటించింది. మెన్ ఇన్ బ్లూకు కొత్త కెప్టెన్ వచ్చాడు. సూర్యకుమార్ యాదవ్ స్థానంలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ గా ఎంపిక అయ్యాడు. తెలుగు తేజం తిలక్ వర్మకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీలకు చోటు కల్పించారు. సూర్య కుమార్‌కు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఆసియా క్రీడల కోసం బుమ్రా జట్టులోకి రాగా.. సిరాజ్, ప్రిన్స్ యాదవ్‌లకు విశ్రాంతి ఇచ్చారు.

**వైభవ్‌కు చోటు :** ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించిన యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కింది. ఐపీఎల్2026లో బౌలర్లను ఊచకోత కోస్తూ 16 మ్యాచ్‌ల్లో 237.31 స్ట్రైక్ రేట్ తో 72 సిక్సర్లు, 63 ఫోర్లతో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ విజేతగా నిలిచాడు. అలాగే ఒకే సీజన్ లో అత్యధిక సిక్సర్లు క్రిస్ గేల్ రికార్డును కూడా బద్దలుకొట్టాడు. దీంతో ఇదే సరైన సమయమని భావించిన సెలెక్టర్లు.. జాతీయ జట్టులో చోటు కల్పించారు. జూన్ ఆఖర్లో ఐర్లాండ్‌తో 2 టీ20లు, జులై ఆరంభంలో ఇంగ్లాండ్‌తో 5 టీ20లు ఆడనుంది. సెప్టెంబర్‌లో ఆసియా గేమ్స్ ఉన్నాయి.

### కఠిన నిర్ణయమైనా తప్పలేదు: అగార్కర్

రాబోయే రెండేళ్ల వరల్డ్ కప్ సైకిన్‌ను దృష్టిలో పెట్టుకునే జట్టును ఎంపికచేసినట్లు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించారు. టీమ్ ప్రయోజనాల కోసమే సూర్యతో వ్యక్తిగతంగా మాట్లాడి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. మేం మంచి జట్లను ఎంపిక చేశామని భావిస్తున్నట్లు అగార్కర్ వివరించారు.

**ఇంగ్లాండ్, ఐర్లాండ్ సిరీస్‌లకు జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్‌రెడ్డి, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్

**ఆసియా క్రీడల కోసం జట్టు:** శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే, వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి



# ఆండ్రీవాదే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విజేతగా రష్యా టీనేజ్ సంచలనం మిరా ఆండ్రీవా ఆవిర్భవించింది. 19 ఏళ్ల ఆండ్రీవా తొలిసారి గ్రాండ్ స్లామ్ టైటిల్ అందుకుంది. రోలాండ్ గారోస్‌లో జరిగిన మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ మిరా ఆండ్రీవా... 6-3, 6-2తో వరుస సెట్లలో పోలెండ్ ప్లేయర్ చ్వాలిన్‌స్కాపై విజయం సాధించింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా.. రెండు వరుస సెట్లలో ఆండ్రీవా ఆధిక్యం ప్రదర్శించింది. 2014లో మరియా షరపోవా తర్వాత.. ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన రష్యా అమ్మాయిగా ఆండ్రీవా రికార్డ్ సృష్టించింది. అలాగే మోనికా సెలెస్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన రెండో అతిపిన్న క్రీడాకారిణిగా నిలిచింది. 1992లో మోనికా సెలెస్ ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గినపుడు ఆమె వయస్సు 18 ఏళ్లు.

తొలి సెట్ ఆరంభంలో ఇద్దరూ పోటీపోటీగా తలపడ్డారు. క్వాలిఫయర్‌గా ఫైనల్ వరకు వచ్చిన చ్వాలిన్‌స్కా తన సర్వీసులను నెలబెట్టుకోవడంతో తొలి సెట్ 3-3తో సమంగా కొనసాగింది. ఈ దశలో ఏస్‌లతో విజృంభించిన ఆండ్రీవా...చ్వాలిన్ స్కా సర్వీసును బ్రేక్ 6-3 తో కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో ఆండ్రీవా తన ఆటలో మరింత స్పీడ్ పెంచింది. వరుస అద్భుతమైన విన్నర్లతో 5-0తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. అయితే, పోలిష్ స్టార్ చివరి నిమిషాల్లో పుంజుకుని, ఆధిక్యాన్ని 5-2కు తగ్గించింది. తర్వాతి గేమ్‌లో ఆండ్రీవా ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ఫైనల్ ముగించి తొలి గ్రాండ్ స్లామ్ విజేతగా నిలిచింది.

# యెస్‌బ్యాంకుపై రూ.63 కోట్లకుపైగా జిఎస్టీ డిమాండ్ నోటీసు





ముంబయి, జూన్ 6: ప్రైవేటురంగంలోని ఎస్‌బ్యాంకుకు మహారాష్ట్ర జిఎస్టీ విభాగం రూ.63 కోట్లకుపైగా చెల్లించాలని నోటీసులు జారీచేసింది. జిఎస్టీ అప్పీళ్ల విభాగం కమిషనర్‌నుంచి తమకు ఉత్తర్వులు వచ్చాయని యెస్‌బ్యాంకు వెల్లడించింది. జరిమానాతో సహా మొత్తం పన్ను డిమాండ్ రూ.63 కోట్ల 26,98,888లు చెల్లించాలని నోటీసులో తెలిపింది. అయితే తాము న్యాయపరంగా ముందుకు వెళతామని బ్యాంకు ప్రకటించింది. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని చెప్పిన డిమాండ్ నోటీసులో జరిమానాతోపాటు వడ్డీని కూడా అధికంగా ఉందని ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లోవివరించింది. ఈ ఉత్తర్వుల వల్ల బ్యాంకు ఇతర లావాదేవీలు, కార్యకలాపాలకు ఎలాంటి నష్టం జరగదని యెస్‌బ్యాంకు వెల్లడించింది. బ్యాంకు ఈ నోటీసుపై విధిగా న్యాయపరమైన చర్యలకు వెళుతుందని, అప్పీలుతో సహా అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటుందని బ్యాంకు ప్రకటించింది. అయితే ఈనోటీసులో పన్ను ఎగవేతలా, లేక పన్ను చెల్లించకపోవడమా, పన్ను బకాయిలా అన్నది జిఎస్టీ కమిషనరేట్ స్పష్టంచేయలేదు.




# 26కోట్లకు పెరిగిన ఎన్‌ఎస్‌ఇ ఇన్వెస్టర్ ఖాతాలు

న్యూఢిల్లీ, జూన్ 6: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలో ఇన్వెస్టర్ ఖాతాలు ఏటికేడాది పెరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 26కోట్లమంది ఇన్వెస్టర్ ఖాతాలున్నట్లు సమాచారం. గడచిన 4 నెలల్లోనే కోటి ఖాతాలు తెరిచారు. గత ఏడాదికాలంగా చూస్తే 4.3 కోట్ల ఖాతాలు కొత్తగా తెరిచారు. ఈ ఏడాది మేనెలనాటికి ఎన్‌ఎస్‌ఇలో 13.1 కోట్ల ఇన్వెస్టర్‌ఖాతాలు రిజిస్టర్ అయి ఉన్నాయి. ఏప్రిల్‌లోనే 13 కోట్ల మార్కును బ్రేక్‌చేసింది. అయితే ఒక ఇన్వెస్టర్ ఎన్ని ఖాతాలయినా తెరుచుకునే సౌలభ్యంఉంది. మహారాష్ట్ర అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ నమోదుచేసింది. మొత్తం ఖాతాల్లో 17శాతం అంటే 4.4 కోట్లమంది ఖాతాలున్నాయి. ఆ తర్వాత యుపి మూడు కోట్లు, గుజరాత్‌నుంచి 2.2కోట్లు, పశ్చిమబెంగాల్; రాజస్థాన్ రాష్ట్రాలనుంచి 1.5 కోట్లచొప్పున ఇన్వెస్టర్ల ఖాతాలున్నాయి. టాప్ ఐదు రాష్ట్రాలే మొత్తం 49శాతం ఇన్వెస్టర్‌ఖాతాలతో ఉన్నాయి. ఈశాన్యరాష్ట్రాలపరంగా మిజోరమ్, సిక్కిమ్, మేఘాలయ రాష్ట్రాలు 32.3శాతం, 30శాతం, 29.2శాతంగా ఉన్నట్లు ఎన్‌ఎస్‌ఇ ప్రకటించింది. ఇక ఎన్‌ఎస్‌ఇ50, ఎన్‌ఎస్‌ఇ 500 సూచీలు 7.1శాతం, 9.8శాతం చొప్పున రిటర్నులతో ఉన్నాయి. ఎన్‌ఎస్‌ఇ జాబితా అయిన కంపెనీల విలువలు 12.6శాతంపెరిగింది. ఐదేళ్లలో 462.2 లక్షలకోట్లుగా ఉందని తేలింది. వ్యక్తిగత ఇన్వెస్టర్లు 18.7శాతం మంది ఉన్నారు. మ్యూచువల్‌ఫండ్స్ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. సిప్‌లలో పెట్టుబడులు అధికంగా ఉన్నాయి. ఏడాదికాలంలోనే 7.2 కోట్ల సిప్ ఖాతాలు తెరిచారు. నెలవారీ సగటు సిప్ ఫ్లో ఎనిమిదిరెట్లుపెరిగింది. 3660 కోట్ల నుంచి 29,132 కోట్లకు పెరిగినట్లు ఎన్‌ఎస్‌ఇ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీరామ్‌కృష్ణన్ చెప్పారు. రెండు, మూడు, నాలుగో శ్రేణి నగరాలనుంచి కూడా ఇన్వెస్టర్లు ఎక్కువమంది ఈక్విటీలు, ఈటిఎఫ్‌లు, రీట్స్, ఇన్విట్స్, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ఇటీవలిఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్స్ కూడా మరిన్ని పెరిగాయి. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచేందుకు ఎన్‌ఎస్‌ఇ తరచూ చైతన్య సదస్సులు నిర్వహించింది. ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్‌పేరిట మొత్తం 9.4 లక్షలమందికి అవగాహణ కల్పించింది. అలాగే ఇన్వెస్టర్ పరిరక్షణ నిధి కూడా 2890 కోట్లుగా ఉందని ఎన్‌ఎస్‌ఇ సిబిడివో తెలిపారు.

# ఐదు నెలల్లోనే లక్షకు పైగా టెక్కీలకు లేఆఫ్




న్యూఢిల్లీ, జూన్ 6:టెక్నాలజీరంగంలో లేఆఫ్‌లు భారీ ఎత్తున కొనసాగుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో ఉద్యోగులపై కోతకే కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కేవలం ఐదునెలల్లోనే లక్షమందికిపైగా టెక్ ఉద్యోగులు ఇంటిబాట పట్టారు. అనేక పెద్ద కంపెనీలు, బహుళజాతి కంపెనీలు కూడా ఉద్యోగాలపై కోతను ప్రకటించాయి. గడచిన రెండునెలల్లోనే మరింతగా పెరిగాయి. వాటిలో ఉబేర్, మెటా, క్లౌడ్‌ఫ్లేర్, ఇన్‌ట్యూట్ వంటి కంపెనీలున్నాయి. మేనెలలో 28 వేల ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించారు. నేఆఫ్ డాట్ ఎఫ్‌వైఐ పోర్టల్ అంచనాలను చూస్తే ఈ ట్రాకర్ గత ఏడాది మేనెలలో 10,577 ఉద్యోగాలపై కోత పడితే ఈ ఏడాది ఏకంగా 28,889 మందికి ఉద్వాసన ప్రకటించినట్లుతేలింది. లేఆఫ్ ట్రాకర్ పోర్టల్‌ను చూస్తే మొత్తం 1,16,739 మంది ఉద్యోగులు ఇళ్లకుపోయినట్లు తేలింది. మార్చి నెలలో అత్యధికంగా 46వేలకు పైగా ఉద్యోగాలపై కంపెనీలు కోత విధించాయి. వీటిలో పేపాల్, సిస్కో, మెటా, ఇన్‌ట్యూట్ వేలాది మందిని ఇళ్లకు పంపించాయి. ఉబేర్ 23శాతం మందికి లేఆఫ్ ప్రకటించింది. కంపెనీకి మంత్తం 34 వేల మంది గ్లోబల్‌స్థాయిలో ఉద్యోగులుంటే వారిలో ఒకటిశాతం మందికి లేఆఫ్ తప్పలేదు. ఇక సిస్కో అయితే నాలుగేవలమందిని ఇళ్లకు పంపించింది. గతనెలలో పేపాల్‌కూడా 20శాతం వర్క్‌ఫోర్స్‌ను తొలగించాలనినిర్ణయించింది. వచ్చే రెండుమూడేళ్లలో 4760 మందికిపైగా లేఆఫ్‌లు ప్రకటిస్తామని ముందే వెల్లడించింది. ఇక మెటా అయితే మొత్తం వర్క్‌ఫోర్స్‌లో ఏడువేలమందికి ప్రకటించింది. క్రెడిట్ కర్మ మాతృసంస్థ ఇన్‌ట్యూట్, టర్బోట్యాక్స్, క్విక్ బుక్స్ సంస్థలు తమ కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు మూడు వేలమందికి లే ఆఫ్ ప్రకటించామని చెప్పాయి. క్వోరా, కాయన్‌బేస్, క్లౌడ్‌ఫ్లేర్‌లు కూడా జాబ్‌కట్స్ ప్రకటించాయి. సుమారుగా 40 కంపెనీలు ఒకనెలలోనే లేఆఫ్‌లు ప్రకటించడంతో టెక్కీల్లో ఉద్యోగభద్రతపై ఆందోళన పెరిగింది.

# రూ.3వేల కోట్లకు ట్రూహోమ్ ఫైనాన్స్ ఐపిఒ

ముంబయి, జూన్ 6: వార్‌బర్గ్ పిన్‌కస్ అనుబంధ సంస్థల అయిన ట్రూహోమ్ ఫైనాన్స్ కంపెనీ సెబీవద్ద ఐపిఒకు దరఖాస్తుచేసింది. ఐపిఒ ద్వారా రూ.3వేల కోట్లు నిధులు సమీకరించే లక్ష్యంతో ఉంది. తాజాగా ఈక్విటీషేర్లు రూ.1500 కోట్ల మేర విడుదలచేస్తే ఆఫర్ ఫర్‌సేల్ కింద మరో రూ.1500 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. ఒఎఫ్ఎస్‌లో ప్రమోటర్ మ్యాంగో క్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కూడా పాల్గొంటుంది. ప్రమోటర్ వాటాలపరంగాచూస్తే మ్యాంగోక్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ రూ.10 విలువకలిగిన రూ.1500 కోట్ల విలువైన వాటాలను విక్రయిస్తున్నది. పూర్వపు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన ఈ సంస్థ అగ్రగామి హౌసింగ్ ఫైనాన్స్‌సంస్థగా కొనసాగుతోంది. గత మార్చి 9వ తేదీనే డిఆర్‌హెచ్‌పిని సెబీకి దాఖలుచేసింది. జెఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, జెఫరీస్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్, కోటక్ మహీంద్ర క్యాపిటల్ కంపెనీలు ఈ ఇష్యూకు బ్యాంకర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఐపిఒద్వారా సమకూరిన నిధులు కంపెనీ మూలధన బేస్‌ను పెంచుకునేందుకు వినియోగిస్తుంది.




ప్రస్తుత రుణపరపతి, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వీటిని పంపిస్తుంది. రిజర్వుబ్యాంకు నిర్దేశించిన క్యాపిటల్ అడక్వెసీ నిష్పత్తి ఆధారంగానే సంస్థ కొనసాగుతోంది. 2010లో స్థాపించిన ట్రూహోమ్ ఫైనాన్స్ అందుబాటుధరల్లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా కొనసాగుతోంది. అంతకుముందు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా కొనసాగింది. ఈ కంపెనీని వార్‌బర్గ్ పిన్‌కస్ 2024 డిసెంబరులో కొనుగోలుచేసింది.

స్థిరాస్థి తనఖా రుణాలు, ఇతర రుణపరపతి స్కీంలు అమలుచేస్తుంది. సగటు టికెట్‌సైజు రూ.20.13 లక్షల రూపాయలుగా ఉంది. ఒక్కోశాఖకు రూ.107.230 కోట్ల రూపాయలుగా నిర్వహణ ఆస్తులున్నట్లు అంచనా. ఎస్‌బిఐ మాజీ ఛైర్మన్ దినేష్‌కుమార్ ఖారాను ఛైర్మన్‌గాను, సుబ్రహ్మణియన్ జంబునాథన్‌ను ఎండిసిఇఒగాను నియమించుకుంది.

# ఆటోమొబైల్ సేల్స్‌లో మారుతి టాప్‌గేర్

న్యూఢిల్లీ,జూన్ 6: భారత ప్యాసింజర్ వాహనాల మార్కెట్ 2026 మే నెలలో అమ్మకాల పరంగా పటిష్టమైన వృద్ధి నమోదు చేసింది. గత సంవత్సరం మే నెలతో పోలిస్తే ఈసారి అమ్మకాలు 26.05 పెరిగి, మొత్తం 4,40,808 యూనిట్లుగా ఉన్నాయి. ఈసారి అమ్మకాల్లో దేశీయ ఆటో దిగ్గజం మహీంద్రాను వెనక్కి నెట్టి, టాటా మోటార్స్ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఎప్పటిలాగే, మారుతీ సుజుకీ 1,90,337 యూనిట్ల అమ్మకాలతో అగ్రస్థానంలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. గతేడాదితో పోలిస్తే కంపెనీ అమ్మకాల్లో ఏకంగా 39.99 వృద్ధి కనిపించింది. దీంతో మారుతీ మార్కెట్ వాటా 43.18 శాతానికి పెరిగింది. రెండో స్థానం కోసం జరిగిన తీవ్రమైన పోటీలో టాటా మోటార్స్ విజయం సాధించింది. టాటా 59,090 వాహనాలను విక్రయించగా, మూడో స్థానానికి పడిపోయిన మహీంద్రా 58,021 యూనిట్లను అమ్మింది. ఈ రెండు కంపెనీల మధ్య అమ్మకాల వ్యత్యాసం కేవలం 1,069 యూనిట్లు మాత్రమే. గతేడాది ఇదే సమయంతో పోల్చితే టాటా 42.19 వృద్ధి సాధించగా, మహీంద్రా వృద్ధి 10.66 వద్దే నిలిచింది. ఇక హ్యుందాయ్ 47,837 యూనిట్లతో నాలుగో స్థానంలో, టయోటా 30,574 యూనిట్లతో ఐదో స్థానంలో ఉన్నాయి. కియా 27,586 యూనిట్లతో ఆరో స్థానాన్ని దక్కించుకుంది. ఈ టాప్ 6 కంపెనీల వాటానే మొత్తం మార్కెట్లో దాదాపు 94 ఉండటం గమనార్హం. టాటా పంచ్, నెక్సాన్, మారుతీ బ్రెజా, మహీంద్రా స్కార్పియో వంటి ఎస్ యూవీ మోడళ్ల ఈ అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి.



# నిర్దిష్టమైన ప్యాకేజి సైజుల్లోనే వంటనూనెల సరఫరా

న్యూఢిల్లీ, జూన్ 6: వంటనూనెలకు సంబంధించి నిర్దిష్టమైన ప్యాకేజి సైజులు ఉండాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ సూచించింది. లీగల్‌మెట్రాలజీ పరిధిలో ఇకపై వంటనూనెల కంపెనీలన్నీ కూడా నిర్దిష్టమైన ప్యాకింగ్‌సైజుల్లోనే సరఫరాచేయాలని ఆదేశించింది. ప్రామాణిక నిర్వహణ విధానం ఎస్‌వోపిని సవరించిన కేంద్రం తూనికలు కొలతల శాఖ సూచించిన విధానం అనుసరించాలనిసూచించింది. సైజులతోపాటు తమ నూనెల స్పష్టమైన వివరాలు ఇవ్వాలి. ఇందుకు మూడునెలల గడువు విధించింది. ఉత్పత్తిదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులు ఈ గడువులోపు సూచించిన సైజుల్లో అమలుచేయాలని కోరింది. 200ఎంఎల్, 500 ఎంఎల్, లీటరు, 2 లీటర్లు, 3 లీటర్లు, నాలుగు, ఐదు 15 లీటర్లతోపాటు 20 లీటర్లు అత్యధిక సైజులో ఈ వంటనూనెలు ఉండాలి.

పామాయిల్, సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆముదం, వేరుసెనగ, నువ్వుల నూనె, రైస్‌బ్రాన్, పత్తిగింజలు, జొన్న గించలు వంటి వాటినుంచి తీసి బ్లెండింగ్‌చేసిన వంటనూనెలన్నింటికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. వంటనూనెల రంగానికి సంబంధించిన అందరు ప్రతినిధులతో విస్తృత స్థాయి చర్చలుజరిపిన తర్వాత ఈ కొత్తనిబంధనలు అమలుచేస్తోంది. దేశీయంగా ఉత్పత్తిచేసే నూనెలు, దిగుమతి చేసుకుంటున్న వంటనూనెలకు కూడా ఈ ప్యాకింగ్ సైజలు వర్తిస్తాయి. 200ఎంఎల్, లేదా 200 గ్రాములకు లోబడిన వంటనూనెలను మాత్రం మినహాయించారు. భారత వంటనూనెల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌దేశాయ్ ఈ ప్రతిపాదనను స్వాగతించారు. అయితే ఇందుకు మూడు సంవత్సరాలు గడువు ఇస్తే వంటనూనెల రంగంలో ఉన్న అనుబంధరంగాలకు పూర్తి అవగాహన కలుగుతుందన్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps